PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 348 | విజయవాడ, మంగళవారం 18 జులై 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 18 July 2023 | Rs



చంద్రయాన్ 3 ఇంజినీర్లకు

ఏడాదిగా జీతాల్లేవు

- కేంద్ర ప్రభుత్వ నిర్వాకం

లోపలి పేజీలో..



సెమీస్‌కు భారత్-ఏ


- అర్ధ సెంచరీలతో మెరిసిన ఓపెనర్లు
- ఎసిసి ఎమర్జింగ్ ఆసియా కప్
- వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలుపు

లోపలి పేజీలో..

కలెక్టర్ల సహకారంతో

ఆదాయం పెంపు

- సమీక్షలో సిఎం ఆదేశం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఆదాయం పెంపు విషయంలో జిల్లా కలెక్టర్ల సహకారం తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. ఆదాయ వనరుల శాఖల అధికారులతో సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల కలెక్టర్లను కడా భాగస్వాములను చేస్తే ఆదాయం మరింతగా పెరుగుతుందన్నారు. ఈ మేరకు కలెక్టర్లతో నిరంతరం సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆదాయం పెంచే విధానంపై కలెక్టర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందులో భాగంగా ఆర్థికశాఖ అధికారులు కూడా కలెక్టర్లతో అనునిత్యం మాట్లాడాలని నిర్దేశించారు. కలెక్టర్లు చొరవ చూపితే ఆదాయ వనరుల శాఖలు మరింత బలోపేతం అవుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మట్లాడుతూ అన్ని శాఖల్లో ఆదాయం గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఖర్చులకు కూడా పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చన్నారు. ఆదాయ వనరులకు చెందిన అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో ఆదాయం పెరిగిందని ముఖ్యమంత్రికి వివరించారు. జిఎస్‌టి వసూళ్లు గణనీయంగా పెరిగినట్లు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు 91 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. జిఎస్‌టి పన్నులు 7,653 కోట్లు వసూలైనట్లు వివరించారు.గతేడాదితో పోల్చిచూస్తే ఇది 23.74 శాతం పెరుగుదలగా ఉందని వారు చెప్పారు.అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇదే విధంగా ఆదాయాన్ని మరింతగా పెంచాలని దిశా నిర్దేశం చేశారు.

మద్యం తగ్గింది.. ఆదాయం పెరిగింది

మద్యం అమ్మకాల్లో ఆదాయం పెరిగినట్లు ఆ శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 2018-19తో పోల్చి చూస్తే మద్యం అమ్మకాలు బాగా తగ్గినట్లు వారు వివరించారు. 2018-19లో 384 లక్షల కేసుల మద్యం అమ్మకాలు జరగ్గా, 2022-23లో 336 లక్షల కేసుల అమ్మకాలు జరిగినట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుంటూ నాటు సారా అమ్మకాలు చేస్తున్న కుటుంబాలపై దృష్టి సారించాలని, వారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ల ఆదాయం కూడా పెరిగినట్లు ఆ శాఖ అధికారులు వివరించారు. గతేడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు 2,292 కోట్ల ఆదాయం లభించగా, ఈ ఏడాది ఆదే కాలంలో రూ. 2,793 కోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు వారు వివరించారు. గనుల శాఖలో కూడా 2018-19లో 1,950 కోట్లు ఆదాయం రాగా, 2022-23 నాటికి 4,756 కోట్లు ఆదాయం పెరిగిందని గనుల శాఖ అధికారులు వివరించారు. ఎపిఎండిసి ద్వారా కూడా ఆదాయం పెరిగినట్లు వివరించారు. గనుల శాఖలో పారదర్శకత, సంస్కరణల కారణంగానే ఆదాయం పెరిగిందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

రవాణా రంగంలో సంస్కరణలు

రవాణా రంగంలో సంస్కరణలపై దృష్టి సారించాలని ఆ శాఖ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని, అందులో ఉత్తమమైన వాటిని రాష్ట్రంలో అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వాహనాలపై వసూలు చేస్తున్న పన్నుల విషయంలో కొత్త విధానాలను అన్వేషించాలని సూచించారు. అయితే ఈ విధానం వాహన కొనుగోలుదారులను ప్రోత్సహించేలా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలు కీలక శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరో డిఎంకె మంత్రి నివాసాలపై

ఇడి దాడి

చెన్నై : మనీల్యాండరింగ్ కేసులో తమిళనాడు ఉన్నత విద్యాశాఖ మంత్రి, డిఎంకె నేత పొన్ముడి, ఆయన కుటుంబ సభ్యుల నివాసాలపై సోమవారం ఇడి దాడులు నిర్వహించింది. పొన్ముడి కుమారుడు, ఎంపీ గౌతం సిగమణి నివాసాల్లోనూ ఇడి సోదాలు జరుగుతున్నాయి.

చెన్నై, విల్లుపురంలోని తండ్రీ కొడుకుల నివాసాలు, ఆస్తులపై ఇడి అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. పొన్ముడి 2007-2011 మధ్య రాష్ట్ర మైనింగ్ మంత్రిగా ఉన్న సమయంలో క్వారీ లైసెన్స్ నిబంధనలను ఉల్లంఘించడంతో ప్రభుత్వ ఖజానాకు రూ.28 కోట్ల నష్టం వాటిల్లిందనే అభియోగాలను ఇడి ఆయనపై నమోదు చేసింది. ఇటీవల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి సెంథిల్ బాలాజీని మనీలాండరింగ్ కేసులో ఇడి అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే.

ప్రతిపక్షాల భేటీ నుంచి దృష్టి మళ్లించేందుకే : స్టాలిన్

మోడీ సర్కార్ రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఇడితో దాడులు చేయిస్తోందని డిఎంకె విమర్శించింది. బెంగళూర్‌లో ప్రతిపక్ష నేతల భేటీ నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే దాడులు జరుగుతున్నాయని, ఈ కేసుపై పొన్ముడి న్యాయ పోరాటం సాగిస్తారని తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ తెలిపారు. గవర్నర్ ఇప్పటికే ఎన్నికల ప్రచారం ప్రారంభించారని, ఇప్పుడు ఇడి కూడా బిజెపి తరపున బరిలో దిగిందని దుయ్యబట్టారు. ఈ డ్రామాలు బిజెపికి అలవాటేనని అన్నారు. పొన్ముడిపై ఇటీవల రెండు కేసులు కొట్టివేశారని, ఈ కేసును ఆయన న్యాయపరంగా ఎదుర్కొంటారని స్టాలిన్ తెలిపారు.



ప్రతిపక్షాల మెగా భేటీలో పాల్గొన్న సోనియాగాంధీ, ఖర్గే, రాహుల్, లాలూ, స్టాలిన్, కేజ్రీవాల్, మమతా బెనర్జీ, నితీష్‌కుమార్ తదితరులు

యుపిఎ పేరు మార్పు ?

- రెండో రోజు కీలక భేటీ నేడు
- సబ్ కమిటీల ఏర్పాటు సహా ఆరు ప్రధాన అంశాలపై చర్చలు
- ఉమ్మడి కార్యక్రమం కూడా ఖరారయ్యే అవకాశం
- అనంతరం నేతల ఉమ్మడి ప్రెస్ మీట్

బెంగళూరు : ప్రతిపక్ష పార్టీల రెండు రోజుల సమావేశం సోమవారం ఇక్కడ ప్రారంభమయింది. మొత్తంగా 26 పార్టీలకు పైగా పాల్గొనే ఈ ప్రతిపక్షాల మెగా భేటీలో మంగళవారం యుపిఎ పేరు మార్పు దిశగా విస్తృతంగా చర్చ జరిపి నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు. ఆరు ప్రధాన అంశాలపై ఈ పార్టీల నేతలు చర్చించనున్నారు. కాగా, సోమవారం సమావేశం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయింది. సుమారు 2 గంటల పాటు నేతలు సమావేశం జరిపారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వాగతోపన్యాసం చేశారు. తరువాత నేతలు వివిధ అంశాలపై మాట్లాడారు. విందు తరువాత సమావేశం ముగిసింది. తిరిగి మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశమవుతున్నారు. సోమవారం సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నుంచి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ (జెడియు), పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ (టిఎంసి), తమిళనాడు సిఎం ఎంకే.స్టాలిన్(డిఎంకె), జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్(జెఎంఎం), పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్‌తో పాటు సీతారాం ఏచూరి (సిపిఐ-ఎం), ఉద్ధవ్ థాకరే(ఎస్‌ఎస్-యుబిటి), డి.రాజా(సిపిఐ), లాలూప్రసాద్ యాదవ్ (ఆర్‌జెడి), బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, ఒమర్ అబ్దుల్లా (ఎన్‌సిపి), మెహబూబా ముఫ్తీ (పిడిపి), దీపాంకర్ భట్టాచార్య (సిపిఐ-ఎంఎల్) తదితరులు పాల్గొన్నారు. 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం సమావేశంలో చర్చిస్తారు. అనంతరం కూటమి ముందుకు సాగడం కోసం వివిధ సబ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. మధ్యాహ్నం 2.30గంటల సమయంలో సబ్ కమిటీల ఎన్నిక అనంతరం విపక్షాలను లీడ్ చేయడం కోసం ఒక నేతను ఎన్నుకోనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ముగిసిన అనంతరం 4 గంటలకు ప్రతిపక్ష పార్టీల నాయకులందరూ కలిసి ఉమ్మడి ప్రెస్ మీట్‌ను నిర్వహించనున్నారు.

బిజెపికి వ్యతిరేకంగా కూటమి కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని ఖరారు చేయడంతో పాటు రాష్ట్రాల వారీగా సీట్ల సర్దుబాటుపైనా ఈ సమావేశంలో చర్చలు జరపనున్నారు. కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించేందుకు ఓ సబ్ కమిటీని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అలాగే వచ్చే సార్వత్రిక ఎన్నికలకు విపక్షాలను ఏకం చేసే దిశగా అవసరమైన వ్యూహాలను ఖరారు చేసే అవకాశం వుంది. విపక్షాలు ఉమ్మడిగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టేందుకు అవసరమైన కార్యాచరణ కోసం మరో సబ్ కమిటీ ఏర్పాటు కానుంది. అలాగే ఇవిఎంలు, ఎన్నికల సంస్కరణలపైన కూడా ఈ సమావేశంలో విపక్షాలు చర్చించనున్నాయి.

ప్రతిపక్షాల సంకీర్ణం పేరు మార్పుపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ మిగతా 3లో

13.5 కోట్ల మంది

పేదరికం నుంచి అవుట్!

- నీతి ఆయోగ్ లీలలు!

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గత ఏడాది ప్రపంచ ఆకలి సూచీలో మొత్తం 121 దేశాల్లో 107 వస్థానంలో భారత్ నిలిచిందని ఐరాస సాక్షిగా వెల్లడించగా, నీతి ఆయోగ్ అందుకు పూర్తి భిన్నమైన చిత్రం ఆవిష్కరించింది. దేశంలో గత అయిదేళ్లలో 13.5 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని సోమవారం వెల్లడించింది. దేశంలో అధికారిక సర్వేలు, గణాంకాలు తప్పుల తడక అని, రాజకీయ జోక్యం పెరిగిపోతుండడం వల్ల గణాంకాలు విశ్వసనీయత కోల్పోతున్నాయని పలువురు ఆర్థిక వేత్తలు, మేధావులు విమర్శించిన నేపథ్యంలో అన్ని రకాల ఆర్థిక సర్వేలు, గణాంకాల సమీక్షకు కొత్త స్టాండింగ్ కమిటీ వేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిన మూడు రోజులకే నీతి ఆయోగ్ ఈ నివేదిక వెలువరించడం గమనార్హం. కార్పొరేట్ల ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా ప్రణాళికా సంఘం స్థానే పుట్టుకొచ్చిన నీతి ఆయోగ్ తాజాగా ప్రభుత్వానికి రాసిన లేఖలో ఐదేళ్లలో (2015-16, 2019-21 మధ్య) 13.5 కోట్ల (13,54,61,035) మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపింది. 2022 ప్రపంచ ఆకలి సూచీ (గ్లోబల్ హంగర్ ఇండెక్స్) లో మన దేశం 107 వ స్థానంలో ఉంది. అంతకు ముందు ఏడాదితో పోల్చితే 6 స్థానాలు దిగజారిందని వెల్లడించింది. ఇరుగుపొరుగు దేశాలైన పాకిస్తాన్ (99), శ్రీలంక(64), నేపాల్ (81), బంగ్లాదేశ్ (84) మన కన్నా మెరుగైన స్థితిలో ఉన్నాయి. 'నేషనల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్: ఎ ప్రోగ్రెస్ ఆఫ్ రివ్యూ 2023' నివేదికను నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బెరీ, నీతి ఆయోగ్ సభ్యులు వికె పాల్, అరవింద్ వీరమణి, నీతి వయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రమణ్యం సోమవారం నాడిక్కడ విడుదల చేశారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (2019-21), జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-4 (2015-16) మధ్య పేదరికాన్ని తగ్గించడంలో దేశం పురోగతిని వివిధ రూపాల్లో పేదరిక సూచిక (ఎంపిఐ) సూచిస్తుందని నీతి ఆయోగ్ తెలిపింది. పేదరికాన్ని కొలిచే పద్ధతులను మార్చడం, ప్రాతిపదికల్లో కొన్నిటిని తొలగించడం ద్వారా పేదరికం తగ్గినట్లు చూపింది. పోషకాహారం, పిల్లలు, కౌమారదశ మరణాలు, తల్లి ఆరోగ్యం, పాఠశాల విద్య, పాఠశాల హాజరు, వంట ఇంధనం, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, ఇళ్లు, ఆస్తులు బ్యాంకు ఖాతాలు వంటి మొత్తం 12 అంశాలు ప్రాతిపదికన ఈ నివేదిక ఇచ్చారు.

నివేదిక ప్రకారం.. దేశంలో వివిధ రూపాల్లో పేదల సంఖ్య 2015-16లో 24.85 శాతం నుంచి 2019-2021లో 14.96 శాతం నుంచి 9.89 శాతం (13,54,61,035 మంది) పాయింట్లకు గణనీయమైన క్షీణతను నమోదుచేసింది. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం 32.59 శాతం మిగతా 7లో



జిల్లా	2015-16 (శాతాల్లో)	2019-21
అనంతపురం	12.47	6.74
చిత్తూరు	9.64	5.66
తూర్పు గోదావరి	8.51	6.13
గుంటూరు	7.26	4.36
కృష్ణా	8.69	4.38
కర్నూలు	19.64	12.84
ప్రకాశం	13.84	6.28
నెల్లూరు	11.27	5.41
శ్రీకాకుళం	14.01	5.20
విశాఖపట్నం	15.10	7.60
విజయనగరం	19.00	8.66
పశ్చిమగోదావరి	9.11	2.42
కడప	9.14	3.34

ప్రాంతీయ పార్టీలతో

బిజెపి రాజకీయ క్రీడ

టిడిపి, వైసిపిలు ప్రాంతీయ పార్టీల ప్రధాన లక్షణాన్ని కోల్పోయాయి

- బిజెపిగూటి చిలకలా జనసేన
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల నేపథ్యంలో అవకాశవాదంతో అంటకాగుతున్న రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలతో బిజెపి రాజకీయ క్రీడ ఆడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. జనసేన ఎన్‌డిఎ సమావేశానికి హాజరు కావడం ఆ పార్టీ ఉనికినే దెబ్బతీస్తుందని హెచ్చరించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఉపాంగంగా జనసేన మారిపోతుందని తెలిపారు. రాష్ట్రంలో బిజెపి బలమైన శక్తిగా లేకపోయినా వైసిపి, టిడిపి, జనసేనల సాయంతో పార్టీ ఏదైనా 'మీరు గెలిపించండి.. మాతో పంపండి' అనే విధానంతోనే పనిచేస్తోందని విమర్శించారు. సోమవారం విజయవాడలో జరిగిన ఎన్‌టిఆర్ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా మేధావులు గళం విప్పాలని విజ్ఞప్తి చేశారు. అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి, వారితోపాటు జనసేన బిజెపి ఎత్తుగడలకు లోబడే పని చేస్తున్నాయని అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు ఎన్నికల వరకు పొత్తు పెట్టుకోబోమని, అనంతరం మద్దతు ఇస్తాము అనే విధంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని, దాన్ని ఆయన ఖండించడం లేదని చెప్పారు. ఎన్‌టిఆర్ స్థాపించిన 1980 నాటి తెలుగుదేశం పార్టీ విధానాలకు, ఇప్పటి విధానాలకు అస్సలు పొంతన లేదని అన్నారు. ఇక అధికార వైసిపి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రాన్ని అప్పజెప్పేసిందని విమర్శించారు. విద్యుత్ సవరణ చట్టం, ఉమ్మడి పౌరస్మృతిపై మద్దతు ఇవ్వడం తోపాటు పార్లమెంటులో జరుగుతున్న ప్రతిచర్చల్లోను వైసిపి, టిడిపి ఎంపిలు బిజెపిని బలపర్చారని అన్నారు. రాష్ట్రపతికి అవమానం జరిగిందని రాజకీయ పార్టీలన్నీ పార్లమెంటు నూతన మిగతా 2లో



రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో వైఫల్యం

- వైసిపిపై చంద్రబాబు ధ్వజం

లోపలి పేజీలో..



శ్రీకాళహస్తి సిఐపై చర్యలు తీసుకోండి

- తిరుపతి ఎస్‌పికి పవన్ కల్యాణ్ ఫిర్యాదు

లోపలి పేజీలో..



పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారిని కలిసిన సర్పంచుల సంక్షేమ సంఘం నాయకులు

నేరుగా మాకే ఇవ్వండి

- 15వ ఆర్థిక సంఘం నిధులపై పిఆర్ కమిషనర్‌కు సర్పంచుల వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రం నుండి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీ ఖాతాల్లో జమచేయాలని, లేనిపక్షంలో ఈ నెలాఖరు నుండి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని సర్పంచుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. సోమవారం తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారిని సంఘం నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు, కార్యదర్శి టి కృష్ణమోహన్, ఉపాధ్యక్షులు ఉయ్యూరు అప్పిరెడ్డి, పూల నాగమణి, లలితకుమారి, అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షులు వీరాంజనేయులు ఉన్నారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి 50 రోజులు అవుతున్నా పంచాయతీలకు విడుదల కాలేదని తెలిపారు. ముఖ్యంగా కేంద్రం ఇచ్చే నిధులను రాష్ట్రాలకు సంబంధం లేకుండా నేరుగా పంచాయతీలకు ఇచ్చే విధంగా చూడాలని కమిషనర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. కేంద్రం నుండి రావాల్సిన రూ.988 కోట్లను కూడా రెండో విడత విడుదల చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ సందర్భంగా పంచాయతీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను కమిషనర్‌కు వివరించారు. ముఖ్యంగా జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని, విద్యుత్ బకాయిలు చెల్లించాలని విద్యుత్ అధికారులు నోటీసులు ఇస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచులకు పెండింగ్ పడిన వేతన బకాయిలనూ విడుదల చేయాలని మిగతా 7లో

మునుగుతున్న చదువులు

- ముంపు మండలాల గిరి పల్లెల్లో విద్యార్థుల కష్టాలు
- శిథిలావస్థలో పాఠశాలలు
- ఈ విద్యా సంవత్సరంలో 1092 మంది డ్రాపౌట్స్



శిథిల భవనంలోనే కొనసాగుతున్న ఉమ్మిడివరం ప్రైమరీ స్కూలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలవరం ముంపు మండలాల్లోని గిరి పల్లెల్లో బడి బాధ వెంటాడుతోంది. ఓ వైపు గోదావరి వరదలు, మరోవైపు ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థుల చదువులను నిలువునా ముంచుతున్నాయి. కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న భవనాలలోనే బోధన చేపట్టడం సర్వత్రా ఆందోళనకు గురి చేస్తోంది. వెరసి డ్రాపౌట్స్ శాతం పెరుగుతోంది. విలీన మండలాలైన ఎటపాక, విఆర్.పురం, కూనవరం, చింతూరు మండలాల్లో 2022-23 విద్యా సంవత్సరంలో 17,995 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో 16,903 మంది మాత్రమే పాఠశాలల్లో చేరినట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీనినిబట్టి 1,092 మంది విద్యార్థులు డ్రాపౌట్ అయినట్లు స్పష్టమవుతోంది. ముంపు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు లేకపోవడంతో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి. ఎటపాక, కూనవరం, విఆర్‌పురం, చింతూరు మండలాల పరిధిలో 314 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రైమరీ స్కూల్స్ 266, అప్పర్ ప్రైమరీ 17, హైస్కూల్స్ 314. ఈ పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 16,903 మంది విద్యనభ్యసిస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే 6.5 శాతం మంది డ్రాపౌట్ అయ్యారు. దీనిపై చింతూరు ఎంఇఒ లక్ష్మీనారాయణను వివరణ కోరగా, విద్యార్థుల పేర్లు ఆన్‌లైన్ చేయడంలో ఆలస్యం వల్ల డ్రాపౌట్స్ సంఖ్య పెరిగినట్టు కనిపిస్తోందని చెప్పారు.

అధ్వానంగా పాఠశాలలు

ప్రభుత్వం నాడు-నేడు అంటూ గొప్పలు చెప్పుకుంటుండగా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలు చినుకుపడితే చిత్తడిగా, ఎండా కాలం తీవ్రవేడితో విద్యార్థులకు అసౌకర్యంగా మారాయి. పక్కా భవనాలు లేకపోవడం, నేలపై గచ్చు లేకపోవడంతో మట్టిలోనే కూర్చోవాల్సి వస్తోంది. వర్షాకాలంలో పాఠశాల పాకలు కారిపోతున్నాయి. గాలి దుమారం వస్తే పైకప్పు విరిగిపడుతుందేమోననే మిగతా 7లో

వర్షం వస్తే క్లాసులు బంద్



వర్షం వస్తే తరగతులు నిర్వహించడం లేదు. బిల్డింగ్ స్లాబు నుంచి నీరు కారడంతో తరగతి గది పూర్తిగా చిత్తడిగా మారుతోంది. సబ్జెక్టు టీచర్లు లేరు. 200 మంది విద్యార్థులకు కేవలం ముగ్గురు టీచర్లు మాత్రమే ఉన్నారు. స్కూలుకు రంగులు మాత్రమే వేశారు. స్లాబు లీకులకు మరమ్మతులు చేయలేదు. కొత్త బిల్డింగ్ నిర్మాణ పనులు నిలిచిపోయి రెండేళ్లవుతోంది. ఆ భవనం త్వరితగతిన పూర్తి చేస్తే విద్యార్థులకు కొంత ఊరట లభిస్తుంది.

-కుంజా సీతామహాలక్ష్మి, కస్తూర్బా పాఠశాల, విఆర్.పురం మండలం

చెట్ల కింద వంట



పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. మధ్యాహ్న భోజనం వండేందుకు ఎటువంటి సౌకర్యాలూ లేవు. ఆరుబయటే చెట్ల కింద కట్టెలతో వంట చేస్తున్నాం. వర్షం కురిస్తే కట్టెలు తడిసిపోతున్నాయి. కష్టపడి పొయ్యి వెలిగించినా మంట నిలబడే పరిస్థితి లేదు. వంట చేసుకునేందుకైనా షెడ్లు ఏర్పాటు చేయాలి.

-సున్నం రాజమ్మ, మధ్యాహ్న భోజన కార్మికురాలు, ప్రాథమిక పాఠశాల, ఉమ్మడివరం, విఆర్.పురం మండలం



ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ధర్నాలో అభివాదం చేస్తున్న నేతలు



ధర్నాకు హాజరైన ఉద్యోగులు, రైతు సంఘాల నాయకులు

కో-ఆపరేటివ్ వ్యవస్థ రక్షణ కోసం సమైక్య ఉద్యమం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కో-ఆపరేటివ్ నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, సహకార వ్యవస్థను రక్షించుకునేందుకు అన్ని ఉద్యోగ, కార్మిక, రైతు సంఘాలు కలిసి సమైక్య ఉద్యమంగా మారాల్సిన ఆవశ్యకత ఉందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు తెలిపారు. మోడీ ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలన్నారు. విజయవాడలోని అలంకార్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎపి స్టేట్ ప్రైమరీ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీ గౌరవాధ్యక్షులు పి అజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. 50 శాతం వాటాను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చి సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని, దీన్ని అడ్డుకునేందుకు రైతాంగాన్ని కదిలించేందుకు సహకార ఉద్యోగులు నడుంబిగించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం సహకార రంగాన్ని దాదాపు కనుమరుగు చేసిందని, నూలు మిల్లులు, పంచదార ఫ్యాక్టరీలు, ఆయిల్ మిల్లులు సహకార రంగంలో లేవన్నారు. మిగిలి ఉన్న వ్యవసాయ పరపతి సంఘాలను కాపాడుకునేందుకు నడుంబిగించాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమాన్ని దీర్ఘకాలంగా చేస్తున్నామని, ఫలితంగానే స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ కాకుండా నిలబడిందన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగం చేసిన పోరాట ఫలితంగా నల్లచట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. రైతాంగ స్ఫూర్తితో ఉద్యమాలు చేయాలని నర్సింగరావు పిలుపునిచ్చారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. సహకార సంఘాల్లో రైతులు మాత్రమే వాటా దారులుగా ఉండాలని, అంతేకానీ 50 శాతం వాటాలను ప్రైవేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ, రైతు భరోసా కేంద్రాలను పిఎసిఎస్‌ల్లో విలీనం చేస్తూ 1964 చట్టానికి చేసిన సవరణలను రద్దు చేయాలన్నారు. రైతులు మాత్రమే సంఘాల్లో యజమానులుగా ఉండాలన్నారు. జిఓలు 36, 90 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, 2016 ఏప్రిల్ 1 నుంచి నగదు ప్రయోజనాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సహకార రంగంలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే త్వరలో జరగనున్న శాసనమండలి సమావేశాల్లో ఈ అంశాల గురించి ప్రశ్నిస్తామన్నారు. ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, 2019 మార్చి 1 తర్వాత సహకార సంఘాల్లో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. రైతుల మద్దతుతో ప్రైవేటీకరణను తిప్పి కొట్టాలన్నారు. వ్యవసాయ పరపతి సహకార సంఘాల్లో 50 శాతం వాటాలను ప్రైవేటు వ్యక్తులు, కంపెనీలు, ఫండ్స్‌కు కట్టబెడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన సవరణలను రద్దు చేయాలన్నారు. ఉద్యోగుల పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు.

ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ.. పిఎసిఎస్‌కు కేంద్ర, రాష్ట్రాలు వేసిన ఉరిని అమలు కాకుండా పోరాడుతున్న ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. 50 శాతం షేర్లు బయట వ్యక్తులు కొనుక్కోవచ్చంటే దాని అర్థం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కో-ఆపరేటివ్ బ్యాంకులను ఆర్‌బికెలకు అనుసంధానం చేస్తామని ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. తక్షణమే ప్రభుత్వం తెచ్చిన బిల్లులను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ) జనరల్ సెక్రటరీ బిఎస్ రాంబాబు మాట్లాడుతూ.. జిఓ నెంబరు 36లో ఉన్న డిఎ పద్ధతిని మాత్రమే అనుసరించి ఆప్కాబ్ మార్గదర్శకాల్లో ఇచ్చిన 24.90 శాతం వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. సహకారశాఖ కమిషన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం షేరు ధనంపై 6 శాతం డివిడెంట్ లేదా వడ్డీని తక్షణమే డిసిసిబిలు, పిఎసిఎస్‌లకు చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయన అన్నారు. సహకార ఉద్యోగులకు మద్దతుగా బ్యాంకు ఉద్యోగులు ఒకరోజు మధ్యాహ్న భోజన సమయంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ ధర్నాలో కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు, సహకార ఉద్యోగ సంఘాల జనరల్ సెక్రటరీ నీలం నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయ ప్రసాద్, కో-ఆపరేటివ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, వ్యవసాయ కో-ఆపరేటివ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి హరినాథ్‌రెడ్డితోపాటు పలువురు ఉద్యోగులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ధర్నాకు ముందు రైల్వే స్టేషన్ నుంచి ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ప్రత్యేక హోదా ఉద్యమాల్లో పాల్గొన్న వారిపై కేసులు ఉపసంహరించాలి

- కేసును తిరగదోడి శిక్షలు వేయించడం దుర్మార్గం
- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలంటూ ఉద్యమం చేసిన వారిపై కేసులు ఉపసంహరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. యోగివేమన విశ్వవిద్యాలయ విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం పునర్విచారణకు పిటిషన్ వేసి శిక్షలు పడేలా చేయడం వారిపై కక్ష సాధించడమేనని పేర్కొంది. ఈ చర్యను తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా అనేక రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు వేదికలు వివిధ రూపాలలో తమ నిరసనను తెలియజేశాయని తెలిపారు. అందులో భాగంగా 2016 ఆగస్టు 8న యోగివేమన విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించడానికి ప్రయత్నించారన్న ఆరోపణలతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీ విద్యార్థి నాయకులపై వైవియు పోలీసులు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. అయితే పోలీసులు విచారణ సరిగాచేయలేదని సాక్ష్యాలను, పక్కాగా పెట్టలేదని పేర్కొంటూ పునర్విచారణ చేయడం కోసం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిఆర్‌పిసి సెక్షన్ 242 క్లాజ్ 2 ప్రకారం కేసు బలంగా ఉండడం కోసం మరిన్ని ఆధారాలను చేరుస్తూ పిటిషన్ వేసిందని వివరించారు. సెక్షన్ 311 కింద సాక్షులను మళ్లీ కోర్టుకు పిలిపించి విద్యార్థి నాయకులకు వ్యతిరేకంగా సాక్ష్యాలు ప్రవేశపెట్టడమంటే ప్రత్యేక హోదా పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత కక్ష ఉందో అర్థమవుతుందని ఆగ్రహించారు. ఎన్నికల్లో గెలవడానికి వైఎస్‌ఆర్‌సిపి కూడా ప్రత్యేక హోదాను సాధనంగా వాడుకుందని, అధికారంలోకొచ్చాక ఆంధ్ర ప్రజల ఆత్మగౌరవాన్ని పక్కన పెట్టి కేంద్రానికి దాసోహమన్నది చాలక స్వార్థ ప్రయోజనాల కోసం విద్యార్థి నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సమావేశం నిర్వహించిన విద్యార్థి నాయకులపై క్రిమినల్ ప్రొసీజర్ 242, 311 సెక్షన్లతో పిటిషన్ వేయడం, విచారణ జరిగిపోయిన కేసును తిరగదోడి పునర్విచారణ చేసి శిక్షలు పడేలా చేయడం రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు నిదర్శనమని తెలిపారు. ప్రజాసమస్యలపై పోరాడే వారిపై క్రిమినల్ చట్టాలను ప్రయోగించడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను తొక్కిపెట్టడానికి తెచ్చిన జిఓ నెం.1 విషయంలో కోర్టులనుంచి ఎదురుదెబ్బ తగిలిన తరువాత కూడా వైసిపి ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవడం లేదని, ప్రజాఉద్యమాలను ఎంత అణచాలని చూస్తే అంత వేగంగా పెరుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ప్రభుత్వ వైఖరిని ఖండించాలని ఆయన కోరారు.



టిడిపి హయాంలో రైతులకు పంపిణీ చేసిన ట్రాక్టర్లతో లోకేష్ సెల్ఫీ

మూతబడిన సహకార డెయిరీలను తెరుస్తాం

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి-పొన్నలూరు, ఒంగోలు బ్యూరో

మూతబడిన సహకార డెయిరీలను తెరిపిస్తామని, అలాగే ఒంగోలు డెయిరీ కూడా తెరిపిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ హామీ ఇచ్చారు. పాత గ్రానైట్ పాలసీని కూడా యథావిధిగా అమలు చేస్తామని తెలిపారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర సోమవారం ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలంలో కొనసాగింది. పంచాయతీ ఎన్నికల్లో వైసిపికి మద్దతు ఇవ్వలేదని తన కిరాణా షాపును వైసిపి నాయకుల ఒత్తిడితో అధికారులు కూల్చేశారని కొండపి నియోజకవర్గం మూలెవారిపాలెంకు చెందిన మోరబోయిన మాల్యాద్రి తన ఆవేదనను లోకేష్ ఎదుట వ్యక్తం చేశారు. లోకేష్ స్పందిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా పాలన చేయడం చేతగాని జగన్... బుల్డోజర్లతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. బలహీనవర్గాలపై కక్షగట్టినట్లుగా సిఎం వ్యవహరిస్తున్నారని, ఇటువంటి అరాచకాలు చూసిన తర్వాతే బిసిల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలని నిర్ణయించామని తెలిపారు. అన్నదాతను రాజును చేయాలనే లక్ష్యంతో చంద్రబాబు పనిచేస్తే, వైసిపి ప్రభుత్వం అన్నదాతలను ఉరికంభమెక్కిస్తోందని విమర్శించారు. సర్కారు వేధింపులు తాళలేక కుప్పం నియోజకవర్గం గుడిపల్లిలో ఎండిఒ కార్యాలయంలోనే గోవిందప్ప అనే రైతు సోమవారం ఆత్మహత్య చేసుకున్నారని, ఎవరు రైతు బాంధవుడు? ఎవరు రైతుల పాలిట యమకింకరుడు? అని ప్రశ్నించారు. వైసిపి నేతల ఒత్తిడితో అడ్డగోలుగా పనిచేసే పోలీసు అధికారులపై ప్రత్యేక విచారణ జరిపి, ఉద్యోగాల నుంచి తొలగించడమేగాక జైలుకు పంపుతామని హెచ్చరించారు. టిడిపి హయాంలో అన్నదాతలకు ఇచ్చిన రైతు రథాల వద్ద లోకేష్ సెల్ఫీ తీసుకున్నారు. మాలెపాడు నుంచి ప్రారంభమైన పాదయాత్ర చెరుకూరివారిపాళెం వరకూ కొనసాగింది. రాత్రికి లోకేష్ అక్కడే బస చేశారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏడాది గడిచినా వరద సాయం ఏదీ?

- రోడ్డుపై బైఠాయించి నిరసన

ప్రజాశక్తి- కుక్కునూరు

గోదావరి వరదలకు ఇళ్లు కోల్పోయిన తమకు ఏడాది గడిచినా ఇంటి నష్టపరిహారం అందలేదంటూ ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం వేలేరు గ్రామంలో వరద బాధితులకు సోమవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. జగనన్న సురక్షా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ గ్రామానికి జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, కెఆర్‌పురం ఐటిడిఎ పిఒ జివివి.సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీరాణి వచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులతోపాటు స్థానిక వైసిపి నాయకులు రోడ్డుపై బైఠాయించారు. గోదావరి వరదలు వచ్చి ఏడాది గడిచినా నేటికీ ఎటువంటి నష్టపరిహారమూ ఇవ్వలేదని, బాధితులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. దీనిపై జెసి స్పందిస్తూ, పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

సాగర్ నీరు విడుదల చేసి ప్రకాశం జిల్లాను ఆదుకోండి

- సిఎంకు ఆదిమూలపు విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రకాశం జిల్లాలోని ప్రజల తాగునీటి అవసరాల కోసం ఎస్ఎస్ ట్యాంకులను నింపేందుకు గానూ సాగర్ నీరు విడుదలకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిఎంను మంత్రి కలిసి పరిస్థితి వివరించారు. జిల్లాలో ఇప్పటికే కొన్ని సిపిడబ్ల్యుఎస్ స్కీమ్‌లో నీరు డెడ్‌స్టోరేజీకి పడిపోయిందని మంత్రి తెలిపారు. జిల్లాలోని పుల్లల చెరువు మండలం ముటుకుల, త్రిపురాంతకం మండలంలోని గొల్లపల్లి, దూపాడు, ఎర్రగొండపాలెం, మార్కాపురం, దర్శి, దొనకొండలోని చందవరం, కురిచేడు, ముండ్లమూరులోని ఎస్ఎస్ ట్యాంకులను నింపితే దాదాపు 6 లక్షల 50 వేల మంది ప్రజల తాగునీటి ఇబ్బందిని పరిష్కరించవచ్చని మంత్రి వివరించారు. ఈ విషయంపై స్పందించిన సిఎం ఈ నెల 19న జరిగే కృష్ణా రివర్ వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశంలో ఇఎన్‌సి, ఇంజినీరింగ్ అధికారులు నిర్ణయం తీసుకుంటారని అన్నారు. తక్షణమే నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని సిఎం తమతో చెప్పినట్లు మంత్రి పేర్కొన్నారు.

టిడిపి కార్యకర్తలపై హత్యాయత్నం

- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - తోటపల్లిగూడూరు (నెల్లూరు)

టిడిపి కార్యకర్తలను వైసిపి కార్యకర్త కారుతో గుద్ది హత్య చేసేందుకు యత్నించిన ఘటన నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకొంది. బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి.. చింతోపు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు మహేంద్ర, గోపి తమ సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఆములూరు వెళ్లి వస్తున్నారు. అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకులు బాలాజీ తన కారుతో ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో మహేంద్ర, గోపి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి వీరిని నెల్లూరు రూరల్ మండలం చింతారెడ్డిపాలెంలోని నారాయణ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం గోపి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉంది. చికిత్స పొందుతున్న వారిని మాజీ మంత్రి సోమిరెడ్డి పరామర్శించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు స్థానిక సర్పంచ్ కుమారుడు అని సమాచారం.



కలెక్టరేట్ వద్ద ధర్నాలో నినదిస్తున్న బాధిత ప్రజలు, నేతలు

అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలు ఆపాలి

- ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు జిల్లాలో అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలు, కైకలూరు మండలం నర్సాయపాలెంలో ఫిషరీస్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణం తక్షణం ఆపాలని డిమాండ్ చేస్తూ బాధిత ప్రజలు సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సిపిఎం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి, ఏలూరుకు చెందిన బాధితులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం నాయకులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా ఆక్వా చెరువులు తవ్వుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజల ఆవాసాలు, మంచినీటి చెరువులు, బావులు, పంటచేల మధ్య ఎటువంటి అనుమతులూ లేకుండా అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయాలకు భిన్నంగా కైకలూరు మండలం పల్లెవాడ రెవెన్యూ నర్సాయపాలెంలో ఫిషరీస్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణం చేస్తున్నారని అన్నారు. ప్రజల ఆవాసాలకు దూరంగా దీన్ని నిర్మించాలని కోరారు. కలెక్టర్ స్పందించి చెరువుల తవ్వకాలను, ప్లాంట్ నిర్మాణం నిలుపుదలకు తగు ఆదేశాలు ఇచ్చి బాధిత ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు సిపిఎం నాయకులు, బాధిత ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలపై చర్చించిన కలెక్టర్ పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు, నర్సాయపాలెం గ్రామ సర్పంచి కె రాధాకృష్ణ, సీతారాంపురం అగ్రహారం గ్రామ సర్పంచ్ పర్సా వెంకటస్వామి, కానుకొల్లు ఆక్వా చెరువులు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు ఎల్లమెల్లి మరియరాజు ప్రసంగించారు.

2013 భూసేకరణ చట్టం అమలుచేయాల్సిందే

- వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తమకు ఇచ్చే పరిహారం విషయంలో 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని, 18 సంవత్సరాలు నిండిన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని కోరుతూ ఒంగోలు కలెక్టరేట్ వద్ద శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నిర్వాసితుల సంఘం కార్యదర్శి గాలి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ 2008లో ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్‌లో 11 గ్రామాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. ఆనాడు ఎనకమిక్ సర్వే ద్వారా 4517 మందిని, 2009 ఆగస్టు జరిగిన గ్రామ సభల ద్వారా 2700 మందిని అర్హులుగా నిర్ణయించారన్నారు. మొత్తం 7217 మందిని అర్హులుగా గుర్తించారని తెలిపారు. 18 సంవత్సరాలు దాటిన యువతీయువకులు సుమారు 800 మందిని అర్హులుగా గుర్తించలేదన్నారు. వీరినీ అర్హుల జాబితాలో చేర్చించాలని డిమాండ్ చేశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి రూ.వెయ్యి కోట్లు వెంటనే విడుదల చేయాలని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో 2019 ఆగస్టు నాటికి అర్హులను ప్యాకేజీలో చేర్చాలని కోరారు. గొట్టిపడియ, అక్క చెరువు, గుండ్లంచర్ల, కాటమరాజు తండాకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, నిర్వాసితుల కుటుంబాలలో అర్హులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించి యుద్ధ ప్రాతిపదికన నిధులు విడుదల చేయాలని కోరారు. అనంతరం స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో నిర్వాసితులు బుర్ర చిన్న వెంకటేశ్వర్లు జివిజి నాగభూషణం, ఇడుగుల చిన్న యోగిరెడ్డి, జి ఆదినారాయణ, వేసాని శ్రీనివాస రెడ్డి, రాచకొండ శ్రీనివాసులు, టి కోటిరెడ్డి పాల్గొన్నారు.

నాలుగో ఏడాది 'జగనన్న తోడు'

- నేడు చిరువ్యాపారుల అకౌంట్లలోకి రూ.560.73 కోట్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగనన్న తోడు నాలుగో ఏడాది చిరువ్యాపారుల బ్యాంకు ఖాతాల్లో మంగళవారం రూ.560.73 కోట్లు జమకానున్నాయి. క్యాంపు కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నిరుపేదలైన చిరు వ్యాపారులు, హస్త కళాకారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారి ఖాతాల్లో జమచేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,10,412 మంది చిరువ్యాపారులకు రూ.549.70 కోట్లు వడ్డీలేని రుణాలు, రూ.11.03 కోట్లు వడ్డీ రీ ఎంబర్స్‌మెంట్ కలిపి మొత్తం రూ.560.73 కోట్లు చిరువ్యాపారుల ఖాతాల్లో జమకానున్నాయి. సకాలంలో రుణాలు చెల్లిస్తున్న వారికి రూ.10 వేల నుంచి రూ.11 వేలకు, రూ.12 వేల నుంచి రూ.13 వేలకు పెంచుతూ బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం ఇప్పిస్తోంది.

శాసనసభలో పలు కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి శాసనసభలో పలు కమిటీలు ఏర్పాటయ్యాయి. రూల్స్ కమిటీ ఛైర్మన్‌గా స్పీకరు తమ్మినేని సీతారాం, సభ్యులుగా బాలినేని శ్రీనివాసులు రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, ఎస్‌వి అప్పలనాయుడు, మానుగుంట మహీధర్ రెడ్డి, బి అప్పలనాయుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఉన్నారు. పిటిషన్ల కమిటీ ఛైర్మన్‌గా డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్ర స్వామి, సభ్యులుగా చింత రామచంద్రారెడ్డి, వసంత వెంకట కృష్ణప్రసాద్, కాసు మహేష్ రెడ్డి, అదిమూలం కొనేటి, అన్నంరెడ్డి అదీప్‌రాజు, నిమ్మల రామానాయుడు సభ్యులుగా ఉన్నారు. ప్రివిలైజ్ కమిటీ ఛైర్మన్‌గా భూమన కరుణాకర్ రెడ్డి, సభ్యులుగా భాగ్యలక్ష్మి, కోన రఘుపతి, అబ్బయ్య చౌదరి, టిజెఆర్ సుధాకర్ బాబు, శంబంగి వెంకటచిన్న అప్పలనాయుడు, అనగాని సత్యప్రసాద్ ఉంటారు. ఎథిక్స్ కమిటీ ఛైర్మన్‌గా శిల్పా చక్రపాణి రెడ్డి, సభ్యులుగా రాఘురామిరెడ్డి శెట్టిపల్లి, మొండితోక జగన్‌మోహన్‌రావు, జి శ్రీనివాస్ నాయుడు, మేకా వెంకటప్రతాప్ అప్పారావు, సత్తి సూర్యనారాయణ రెడ్డి, నిమ్మకాయల చినరాజప్ప ఉంటారు. సౌకర్యాల కమిటీకి, వణ్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీల ఛైర్మన్‌గా స్పీకరు తమ్మినేని సీతారాం, ఎస్‌సి వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్‌గా జి బాబూరావు, ఎస్‌టి వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్‌గా తెల్లం బాలరాజు, మైనార్టీ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్‌గా మహ్మద్ ముస్తాఫ, స్త్రీ, శిశు, వికలాంగ, వృద్ధుల సంక్షేమ కమిటీ ఛైర్మన్‌గా జొన్నల గడ్డ పద్మావతి, బిసి వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్‌గా రమేష్ యాదవ్, లెజిస్లేషన్ సబార్డినేట్ ఛైర్మన్‌గా మర్రి రాజశేఖర్, గ్రంథాలయ కమిటీ ఛైర్మన్‌గా పి రామసుబ్బారెడ్డి నియమితులయ్యారు. అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పిపికె రామాచారి విడుదల చేసిన ఉత్తర్వులు సోమవారం బయటకు వచ్చాయి.

రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో వైఫల్యం

- వైసిపిపై చంద్రబాబు ధ్వజం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలు సందర్భంగా టిడిపి పార్లమెంటరీ సమావేశం హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 31 మంది ఎంపిలు ఉండి కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏం సాధించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. 10 ఏళ్ల రాష్ట్ర విభజన చట్ట కాలపరిమితి మరి కొద్ది నెలల్లో ముగుస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

ప్రత్యేక హోదా తెస్తానని ఉరూరా తిరిగి ఓట్లు వేయించుకున్న జగన్ నాలుగేళ్లల్లో రాష్ట్రానికి కనీసం ఒక్క ప్రాజెక్టును గానీ, సంస్థను గానీ తీసుకురాలేదన్నారు. టిడిపి చొరవతో రాష్ట్రంలో ఏర్పాటైన కేంద్ర సంస్థలకు కనీసం నిధులు కూడా తెలేకపోయారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు, ప్రాజెక్టులపై ఒక్క ఎంపి కూడా కేంద్రానికి విన్నపం చేసిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ తన కేసుల విషయంలో లాబీయింగ్ కోసమే తన పార్టీ ఎంపిలను వాడుతున్నారే తప్ప రాష్ట్ర ప్రయోజనాల పట్ల కనీస బాధ్యతగా వ్యవహరించడం లేదన్నారు. అప్పులు తెచ్చుకోవడంపై ఉన్న శ్రద్ధ హక్కులు సాధించడంలో లేదన్నారు. రాష్ట్రంలో పూర్తిగా గాడి తప్పిన శాంతిభద్రతలు, విధ్వంసకర పాలనపై పార్లమెంట్‌లో మాట్లాడాలని టిడిపి ఎంపిలకు చంద్రబాబు సూచించారు. అక్రమ కేసులు, దళిత, గిరిజనులు, బిసి, మైనార్టీ వర్గాలపై జరుగుతున్న దాడులను పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం తన అసమర్థత కారణంగా తప్పుల మీద తప్పులు చేసి జాతీయ ప్రాజెక్టు పోలవరాన్ని ఎలా నాశనం చేసిందో లేవనెత్తాలని సూచించారు. నదుల అనుసంధానం వల్ల జరిగే లబ్ధిని ప్రత్యేకంగా చర్చించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపిలు కె రామ్మోహన్ నాయుడు, గల్లా జయదేవ్, కేశినేని నాని, కనక మేడల రవీంద్రకుమార్, మాజీ ఎంపి కంభంపాటి రామ్మోహన్ రావు పాల్గొన్నారు.



టిడిపి పార్లమెంటరీ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

ఓటర్ జాబితాలో భాగస్వాములు కావాలి

ఎలక్షన్ కమిషన్ ఈ నెల 21 నుంచి తలపెట్టిన ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. చెక్ యువర్ ఓట్, గెట్ యువర్ ఓట్ అంటూ ట్విటర్‌లో సోమవారం పేర్కొన్నారు. ఓటు మన బాధ్యత అని, ఓటుతో భద్రత, ఓటుతోనే భవిష్యత్తుకు భరోసా అని తెలిపారు.

ఆర్-5 జోన్ ఏర్పాటు చట్ట వ్యతిరేకం

- రాజధానికి భూములిచ్చిన రైతులకు అన్యాయం
- వాదనలు 21కి వాయిదా వేసిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతిలో ఇతర ప్రాంతాల వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం అన్యాయమని, భూ సమీకరణ కింద రాజధానికి భూములిచ్చిన రైతులు అందులో భాగస్వాములని సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు హైకోర్టులో వాదించారు. ఆర్-5 జోన్ ఏర్పాటు చట్ట వ్యతిరేకమని అన్నారు. సిఆర్‌డిఎ-రైతుల మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని, రైతుల్ని సంప్రదించకుండా ఆర్-5 పేరిట జోన్ ఏర్పాటు చెల్లదన్నారు. మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వ చర్య ఉందన్నారు.

రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలుగా చట్ట సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని, తదానుగుణంగా జారీ చేసిన జిఓలను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ రవినాథ్ తిల్హారీతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. యాజమాన్య హక్కులను దఖలు పరిచే అంశంపై సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వివరించారు. వాదనల తర్వాత హైకోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ నెల 21న జరిగే విచారణలో మధ్యంతర ఉత్తర్వుల అంశంపై తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది.

నర్సరావుపేటలో 144 సెక్షన్

- ఎస్‌పికి వైసిపి, టిడిపి పరస్పర ఫిర్యాదులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా నర్సరావుపేటలో ఆదివారం రాత్రి టిడిపి, వైసిపి మధ్య నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో పట్టణంలో 144 సెక్షన్ విధించారు. ఈ మేరకు జిల్లా ఎస్‌పి రవిశంకర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

ఈ ఘర్షణలపై ఇరు పార్టీల నాయకులు ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సమక్షంలోనే వైసిపి వారు టిడిపి నాయకులు, కార్యకర్తలపై దాడి చేశారని ఆరోపించారు. దాడిలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి నరసరావుపేట నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ.. ఒక ప్లాన్ ప్రకారమే ఎమ్మెల్యే దాడులు చేయించాడని ఆరోపించారు. ఎమ్మెల్యే అవినీతి గురించి ప్రశ్నిస్తుంటే తట్టుకోలేక దాడి చేయించాడని విమర్శించారు.

ప్రాంతీయ పార్టీలతో బిజెపి రాజకీయ క్రీడ

మొదటి పేజీ తరవాయి

భవనం ప్రారంభోత్సవానికి వెళ్లబోమని తీర్మానిస్తే ఈ రెండు పార్టీలు మాత్రమే ఆ కార్యక్రమానికి హాజరయ్యాయని విమర్శించారు. పోలవరం నిర్వాసితులు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సాగుతున్న పోరాటాల్లో ఈ పార్టీలు కేంద్రంతో రాజీ పడుతున్నాయని, రాజకీయ స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టాయని విమర్శించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ రోడ్‌మ్యాప్ బిజెపి ఇస్తుందని నేరుగా ప్రకటించారని, ఢిల్లీలో ఆ పార్టీ కేంద్ర నాయకులతో భేటీ అయ్యాక టిడిపి పొత్తుపై 'అధ్యయనం' చేస్తున్నామని బిజెపి గూటి చిలకలా మాట్లాడారని అన్నారు. జనసేన బిజెపితో అంటకాగుతూ ముస్లిములు, క్రైస్తవులకోసం ఏం చేస్తుందని విమర్శించారు. హిందూధర్మాన్ని కాపాడడం కోసం పోరాడుతామని బహిరంగ సభలలో వ్యాఖ్యలు చేస్తున్నారని, రానున్నకాలంలో జనసేన ఆరెస్సెస్ అనుబంధ సంస్థగా మారిపోయినా ఆశ్చర్యపోనక్కరలేదని అన్నారు.

బిజెపి వంటి నిరంకుశ పార్టీల విధానాల వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా చూడటమే ప్రాంతీయ పార్టీల ప్రధాన లక్షణమని, అవకాశవాదంతో ఆ లక్షణాన్నే మన రాష్ట్రంలో పార్టీలు కోల్పోయాయని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో బిజెపికి మద్దతు ఇచ్చిన ప్రాంతీయ పార్టీలన్నీ చీలిపోవడం, నాశనమైపోయాయని, రాష్ట్రంలోనూ అదే పరిస్థితి దాపురిస్తుందని హెచ్చరించారు. బిజెపితో పోరాడిన పార్టీలే నిలబడగలుగుతున్నాయని అన్నారు. జూలై 17, 18 తేదీల్లో బెంగుళూరులో జరిగే ప్రతిపక్ష పార్టీల సమావేశం దేశ రాజకీయాలను బిజెపికి వ్యతిరేకంగా తిప్పేందుకేనని అన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు కాపాడడం కోసం ఈ మూడు ప్రాంతీయ పార్టీలు బిజెపితో పొత్తులు విడనాడాలని కోరారు.

అప్పుల బాధతో మహిళా రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-కనగానపల్లి

అప్పుల బాధతో ఓ మహిళా రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండల పరిధిలోని పాతపాళ్యం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... శ్రావణి (32)కి తొమ్మిదెకరాల వ్యవసాయ భూమి ఉంది. భర్త సుధీర్‌రెడ్డితో కలిసి ఆమె వర్షాధార పంటలైన వేరుశనగ, కంది సాగు చేస్తుండేవారు. పంటల సాగు నిమిత్తం దాదాపు రూ. ఎనిమిది లక్షల వరకు అప్పులు చేశారు. గత ఐదేళ్లుగా పంటలు చేతికందకపోవడంతో అప్పులు తీర్చడం కష్టం అయ్యింది. దీంతో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తరువాత శ్రావణి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతి చెందారు. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిబోయిన ప్రసాద్‌కు ఎన్‌యు డాక్టరేట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థలో ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బాలిబోయిన ప్రసాద్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. "రిమోట్ సెన్సింగ్, భౌగోళిక సమాచార వ్యవస్థ (జిఐఎస్)తో కృష్ణ, గుంటూరు జిల్లాల భౌతిక, సామాజిక దుర్బలత్వం, వరద విపత్తుల అంచనా" అనే అంశంపై ఆయన రిసెర్చ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి బిఆర్ అంబేద్కర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో విపత్తుల సంస్థ ఇడి డాక్టర్ సి.నాగరాజు, డాక్టర్ ఎంఎం అలీ, డాక్టర్ పూర్ణచంద్, డాక్టర్ బాలకృష్ణ, శాంతిస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా పునరావాస శిబిరంలోనే!

- దారుణంగా పోలవరం నిర్వాసితుల పరిస్థితి
- 2022లో జులైలో కుక్కునూరును ముంచెత్తిన వరద



2022 వరదలకు ఏ బ్లాక్‌లో కుప్పకూలిన ఇల్లు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వం ఎంత దారుణంగా వ్యవహరిస్తుందో ఏలూరు జిల్లాలోని మండల కేంద్రం కుక్కునూరు ఎ బ్లాక్ నిర్వాసితుల పరిస్థితి చూస్తే అర్థమవుతుంది. 2022 జులైలో విరుచుకుపడిన గోదావరి వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 107 హేబిటేషన్లకుగాను 90కుపైగా హేబిటేషన్లను వరద ముంచెత్తింది. పోలవరం కాఫర్ డ్యాం నిర్మాణంతో భద్రాచలం వద్ద 72 అడుగుల నీటిమట్టానికే ఊళ్లన్నీ జలమయమయ్యాయి. ఇళ్ల పైకప్పుల మీదుగా వరద నీరు పారింది. కుక్కునూరులోని ఎ బ్లాక్, సి బ్లాక్ వంటి ప్రాంతాలన్నీ వరద తాకిడికి విలవిల్లాడాయి. వరద ఉధృతికి ఇళ్లన్నీ నేలమట్టమయ్యాయి. దీంతో, కట్టుబట్టలతో వేలాది కుటుంబాలు పునరావాస శిబిరాలకు చేరాయి. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పోలవరం నిర్వాసిత గిరిజనుల కోసం కివ్వాకలో పునరావాస కాలనీని ప్రభుత్వం నిర్మించింది. వరదల సమయంలో ఈ కాలనీలో ప్రభుత్వం పునరావాస కేంద్రం ఏర్పాటు చేసింది. కుక్కునూరు ఎ బ్లాక్ వరద బాధిత కుటుంబాలను ఈ కాలనీకి అధికారులు తరలించారు. వరదల్లో ఇల్లు దెబ్బతింటే రూ.పది వేలు పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఎ బ్లాక్‌లోనివరద బాధితుల్లో చాలామందికి ప్రభుత్వం ప్రకటించిన వరద పరిహారం నేటికీ అందలేదు. దెబ్బతిన్న ఇంటిని తిరిగి నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేక వందకుపైగా కుటుంబాలు ఏడాదిగా కివ్వాక పునరావాస కాలనీలోనే ఉంటున్నాయి. సరైన ఉపాధి లేక, ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందక నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కివ్వాక పునరావాస కాలనీలో ఉంటున్న ఎ బ్లాక్ నిర్వాసితులకు ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించి ఏ ఒక్కటీ అమలు చేయలేదు. ఇళ్లకుగానీ, భూములకుగానీ, 18 ఏళ్లు నిండిన యువతకుగానీ పరిహారం ఇవ్వలేదు. జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెంలో కివ్వాక ఎ బ్లాక్ నిర్వాసితులకు ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ డబ్బులు ఇస్తే తాము చల్లావారిగూడెం పునరావాస కేంద్రానికి వెళ్లిపోతామని నిర్వాసితులు చెప్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

వరద పరిహారం అందలేదు



గతేడాది వరదలకు ఇల్లుతో సహా సర్వస్వం కోల్పోయాం. కట్టుబట్టలతో కివ్వాక పునరావాస కాలనీకి వచ్చాం. ఏడాదైనా ఇప్పటికీ కూలిపోయిన ఇంటికి వరద పరిహారం అందలేదు. నేటికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయలేదు. సొంత ఇల్లు లేక, పరిహారం అందక పునరావాస కాలనీలో అవస్థలు పడుతున్నాం. నాకు ఐదెకరాల భూమి ఉంది. ముంపులో ఉన్నా లేదని చెప్తూ పరిహారం ఇవ్వడం లేదు. ప్రభుత్వం వెంటనే పునరావాస పరిహారం, వరద నష్టపరిహారం అందించాలి.

-ఎమ్‌డి పుల్లు, కుక్కునూరు ఎ బ్లాక్ నిర్వాసితుడు

పరిహారం ఇస్తే వెళ్లిపోతాం



గడిచిన ఏడాది వరదలకు సర్వం కోల్పోయి పునరావాస శిబిరానికి చేరాం. వరద తాకిడికి ఇల్లు కూలిపోయింది. ఇంటికి రూ.పది వేలు పరిహారం ఇస్తామని ప్రకటించినా ఇవ్వలేదు. మాకు రావాల్సిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇస్తే ప్రభుత్వం నిర్మిస్తున్న కాలనీలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు.

-సంగెపు పెంటయ్య, ఎ బ్లాక్ నిర్వాసితుడు

ఎపిఎస్‌ఆర్‌టిసికి వంద 'ఒలెక్ట్రా' బస్సులు

- తిరుపతి నుంచి తిరుమలకు 50 బస్సులు
- ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

ఎలక్ట్రిక్ బస్సుల తయారీలో అగ్రగామి సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎపిఎస్‌ఆర్‌టిసి)కు వంద బస్సులను సరఫరా చేసింది. ఇప్పటికే 88 బస్సులను అందజేయగా మిగతా 12 బస్సులను సోమవారం అందించింది. ఈ 12 బస్సులు అన్నమయ్య జిల్లా మదనపల్లి నుంచి తిరుపతికి నడపనున్నారు. మదనపల్లి ఆర్‌టిసి డిపోలో ఎపిఎస్‌ఆర్‌టిసి చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి జెండా ఊపి వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం 50 ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులు తిరుపతి నుంచి తిరుమలకు, 14 తిరుమల నుంచి రేణిగుంట విమానాశ్రయానికి, కడప నుంచి తిరుపతికి 12, నెల్లూరు నుంచి తిరుపతికి 12 బస్సులు నడుస్తున్నాయన్నారు. తాజాగా మదనపల్లి నుంచి తిరుపతికి 12 బస్సులు నడవనున్నాయని తెలిపారు.

రియల్‌మీ నార్జో 60 సిరీస్ 5జి విడుదల

హైదరాబాద్ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ రియల్‌మీ కొత్తగా రియల్‌మీ నార్జో 60 సిరీస్ 5జి, రియల్‌మీ బడ్స్ వైర్‌లెస్ 3 ఉత్పత్తులను ఆవిష్కరించింది. సోమవారం వీటిని రియల్‌మీ ప్రొడక్ట్ మేనేజర్ బాబుల్ కౌచర్ హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కౌచర్ మాట్లాడుతూ.. నార్జో 60 5జి, నార్జో 60 ప్రో 5జి స్మార్ట్‌ఫోన్లు వినియోగదారులకు విశేష అనుభూతిని పంచనున్నాయన్నారు. వీటి ప్రారంభ ధరను వరుసగా రూ.17,999, రూ.23,999గా నిర్ణయించామన్నారు. నో కాస్ట్ ఇఎంఐపై అమెజాన్‌లో లభిస్తాయన్నారు. 5000 ఎంఎహెచ్ బ్యాటరీ, 64 ఎంపి స్ట్రీట్ ఫోటోగ్రఫీ కెమెరా, 1టిబి స్టోరేజీ విస్తరించుకునే సౌలభ్యం, 20ఎక్స్ డిజిటల్ జూమ్ ఫీచర్లతో వీటిని ఆవిష్కరించామన్నారు. గడిచిన నాలుగేళ్లలో 'నార్జో' సిరీస్‌లో 1.34 కోట్ల ఉత్పత్తులను విక్రయించామన్నారు. గడిచిన ఆరు నెల్లలో 10 లక్షల నార్జో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు చేశామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తమకు రెండంకెల మార్కెట్ వాటా ఉందన్నారు.

శ్రీకాళహస్తి సిఐపై చర్యలు తీసుకోండి

- తిరుపతి ఎస్‌పికి పవన్ కల్యాణ్ ఫిర్యాదు



ఎస్‌పి పరమేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఇటీవల శ్రీకాళహస్తిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపార్టీ కార్యకర్త సాయిపై సిఐ అంజూయాదవ్ దాడి చేయడం శోచనీయమని, ఈ ఘటనపై విచారణ జరిపి, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌పి పరమేశ్వరరెడ్డికి జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. జనసైనికుడు కె. సాయి శాంతియుత పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో సిఐ చేసిన దాడి ఉపేక్షించరానిదన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్యాంగానికి పోలీసులు విధేయులుగా పనిచేయాలి తప్ప, పార్టీలకు కాదని అన్నారు. ఈ సంఘటనను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, ఇప్పటికే సిఐకి చార్జిమెమో ఇచ్చామని, ఆమె సమాధానం తర్వాత శాఖాపరమైన చర్యలు ఉంటాయని ఎస్‌పి తెలిపారు. అంతకుముందు రేణిగుంట విమానాశ్రయం నుంచి ఎస్‌పి కార్యాలయానికి బయలు దేరారు. దారి పొడవునా అభిమానులు, కార్యకర్తలు పూలమాలలు, గజమాలలతో స్వాగతం పలికారు.

ఓ అభిమాని క్రేన్‌పై వచ్చి పవన్‌కు శాలువ కప్పి, పూలమాల వేశాడు. ఫిర్యాదు అనంతరం తిరిగి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న సమయంలో అక్కడ మీడియాతో మాట్లాడుతూ.. సాయికి జరిగినట్లే రేపు మరొకరికి జరగవచ్చని, దీనిపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం కూడా స్పందించి, సుమోటోగా కేసు తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. నాయకులు చిలకం మధుసూదన రెడ్డి, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజారెడ్డి, కోటా వినుత, రాందాస్ చౌదరి, కళ్యాణం శివశ్రీనివాస్ పాల్గొన్నారు.

సవాళ్లకు పరిష్కారాలను వెతికే బాధ్యత యువతదే

- ఎస్‌కెయు 21వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్



మాంతేష్‌కు ఎస్‌కెయు గౌరవ డాక్టరేట్‌ను అందిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వాతావరణ మార్పు, సాంకేతి పురోగతి, సామాజిక అసమానత, ప్రపంచ మహమ్మారి అనే సవాళ్లను ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొంటోందని, వీటికి వినూత్నమైన పరిష్కారాలను వెతికే బాధ్యత ఉన్నత విద్యను పూర్తి చేసుకున్న యువతపై ఉందనిరాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. అనంతపురంలోని శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ 21వ స్నాతకోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన సమర్ధనమ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జికె మహంతేష్‌కు గౌరవ డాక్టరేట్‌ను విశ్వవిద్యాలయం ప్రదానం చేశారు. వికలాంగుల క్రికెట్‌కు ఆయన విశేషంగా కృషిసల్పారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 57 మందికి బంగారు పతకాలను గరవ్నర్ ప్రదానం చేశారు. 9150 మందికి డిగ్రీ పట్టాలను అందజేశారు. ఎస్‌కెయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సావానికి ఛాన్సలర్‌గా గవర్నర్ హాజరై మాట్లాడారు. సమాజంలో విద్య అంత్యంత శక్తివంతమైన ఆయుధమని, ఇది మనిషికి శక్తినే కాకుండా ఆలోచనలకు ఆకృతినిస్తుందని పేర్కొన్నారు. డా మంతేష్ మాట్లాడుతూ ఎస్‌కెయు తనకు గౌరవ డాక్టరేట్ ఇవ్వడం హర్షనీయమన్నారు. వికలాంగుల క్రికెట్ అభివృద్ధికి ఆయన సంస్థ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. తొలుత యునివర్సిటీలో శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి గవర్నర్ పూలమాల వేశారు. ఇంజనీరింగు భవనాన్ని, వసతిగృహాన్ని, అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం రహదారిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపి తలారి రంగయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గౌతమి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, ఎస్‌కెయు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యుపిఎ పేరు మార్పు ?

(మొదటి పేజీ తరువాయి)

స్వయంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని రేపటి సమావేశంలోనే సమిష్టి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ యుపిఎ పేరు మార్పుపై విస్తతంగా చర్చించిన అనంతరమే ఒక నిర్ణయం వుంటుందని చెప్పారు. అయితే దీనంతంటికీ కొంత సమయం పడుతుందని కాంగ్రెస్ అంగీకరించింది. ప్రతిపక్షాల మొదటి సమావేశం జూన్ 23న బీహార్ రాజధాని పాట్నాలో నిర్వహించిన విషయం తెలిసిందే.

మోడీ విధానాలతో ఆర్థిక వ్యవస్థ విధ్వంసం : సిద్ధరామయ్య

దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని నరేంద్ర మోడీ నాశనం చేశారని కర్నాటక ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య విమర్శించారు. అనాలోచిత నిర్ణయాలు, అపరిపక్వ విధానాలతో ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది మోదీ సర్కారేనని, ప్రతిపక్షాలు కాదని స్పష్టం చేశారు. బెంగళూర్‌లో మంగళవారం జరగనున్న ప్రతిపక్షాల సమావేశం సందర్భంగా సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేశారు.

అంతకుముందు ఈ సమావేశానికి హాజరయ్యేందుకు నగరానికి చేరుకున్న కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, పార్టీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గేలకు సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సహా పలువురు పార్టీ నేతలు స్వాగతం పలికారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ ఆత్మహత్యాయత్నం

- వైసిపి కార్యకర్తల దాడి

ప్రజాశక్తి - రామచంద్రపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)



రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివాజీ

అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మున్సిపల్ వైస్ చైర్మన్‌పై వైసిపి కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. దీంతో ఆయన వంనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. ముచ్చిమిల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి మంత్రి వేణుగోపాల కృష్ణ, రామచంద్రపురం మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరు శివాజీ హాజరయ్యారు. శివాజీ మాట్లాడుతుండగా మంత్రి అనుచరుడు ఉదయ్‌కాంత్ తదితరులు మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నీకు మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి ఇవ్వడమే తప్పు' అంటూ దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. దీంతో అవమానానికి గురైన శివాజీ.. ఇంటికి వెళ్లి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

400 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - మోతుగూడెం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

రహస్యంగా మూడు కార్లలో తరలిస్తున్న 400 కిలోల గంజాయిని అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం గ్రామం వద్ద సోమవారం పోలీసులు పట్టుకున్నారు. కేసు వివరాలను ఎఎస్‌పి రాహుల్ మీనా, సిఐ అప్పలనాయుడు, ఎస్ఐ గోపాలరావు మీడియా సమావేశంలో వెల్లడించారు. గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు స్థానిక పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో మోతుగూడెం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మూడు కార్లలో 20 ప్లాస్టిక్ బ్యాగుల్లో తరలుతున్న 400 కిలోల గంజాయిని పట్టుకున్నారు. పది మంది నిందితులను అరెస్టు చేశామని వెల్లడించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందన్నారు.

ప్రత్యామ్నాయం చూపండి?

- జగనన్న స్మార్ట్‌సిటీ పనులను అడ్డుకున్న దళితులు

ప్రజాశక్తి - బద్వేలు : జగనన్న స్మార్ట్ సిటీ కోసం తీసుకున్న భూములకు ప్రత్యామ్నాయం చూపకుండా పనులు చేపట్టడాన్ని వైఎస్ఆర్ జిల్లా బద్వేలు మండలం మడకవారిపల్లె దళితులు అడ్డుకున్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా పనులు ఎలా మొదలు పెడతారంటూ అధికారులను ప్రశ్నించారు. బాధితుల వివరాల మేరకు.. జగనన్న స్మార్ట్ సిటీ కోసం గోపవరంలోని సర్వేనంబర్ 1751 నుంచి 1761 వరకు ఉన్న జడ్‌హెచ్‌డిసి భూములను ఎంఐసి కింద 68 ఎకరాలను 28 మంది దళితుల నుంచి అధికారులు సేకరించారు. బాధితులకు ప్రత్యామ్నాయ భూములు చూపించకుండా సోమవారం జగనన్న స్మార్ట్ సిటీ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న మడకవారిపల్లె దళితులు నెల్లూరు జాతీయ రహదారి 67 పైకి వచ్చి ఆందోళన చేపట్టారు.



మాన్సాస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఎంఆర్ కళాశాలలో సమస్యల పరిష్కరించాలి

- మాన్సాస్ కార్యాలయం వద్ద విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహారాజా కళాశాలలో మౌలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల గేటు ముందు సోమవారం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. కాలేజి యాజమాన్యం నుంచి ఎటువంటి హామీ రాకపోవడంతో మాన్సాస్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాజా కళాశాల విద్యార్థి సంఘం నాయకులు డి వెంకటరమణ మాట్లాడుతూ కళాశాలలో ఎయిడెడ్ తొలగించి అన్ ఎయిడెడ్‌గా మార్చిన తరువాత అనేక సమస్యలు పేరుకుపోయాయని, ఇప్పటికే పలు దఫాలుగా రీవాల్యుయేషన్ ఫీజులు, సప్లిమెంటరీ ఫీజులు పెంచేశారని అన్నారు. కరోనా కాలంలో మూసేసిన కళాశాల హాస్టల్‌ను తిరిగి తెరిపించాలని, విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కళాశాలకు అనుబంధంగా ఉన్న చౌల్ట్రీలో రుచికరమైన భోజనం పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం మాన్సాస్ విద్యాసంస్థ ఎండోమెంట్ అధికారికి వినతి పత్రం అందజేశారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, పి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల బైక్ ర్యాలీ అడ్డగింత

- తొమ్మిది మంది అరెస్టు, విడుదల



బైక్ ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - కొత్తూరు (శ్రీకాకుళం)

వంశధార నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన సోమవారం చేపట్టిన బైక్ ర్యాలీని పోలీసులు భగ్నం చేశారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు నుంచి హిరమండలం మీదుగా ఎల్ఎన్‌పేట వరకు చేపట్టే ర్యాలీని మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ప్రారంభిస్తుండగా ఎస్ఐ ఎం గోవింద్ సిబ్బందితో వచ్చి ర్యాలీని అడ్డగించారు. శాంతియుతంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని వ్యకాస నాయకులు బదులిచ్చారు. అయినా నిర్వహించడానికి వీల్లేదంటూ వ్యకాస జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం, హిరమండలం జడ్‌పిటిసి సభ్యులు పొగిరి బుచ్చిబాబుతో పాటు తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేసి, స్థానిక స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడిచిపెట్టారు. అనంతరం వ్యకాస నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులకు ఇవ్వాల్సిన అదనపు పరిహారం పూర్తిస్థాయిలో చెల్లించలేదని విమర్శించారు. పిడిఎఫ్ కుటుంబాలు కొద్దిమందికి మాత్రమే రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి మోసం చేసిందన్నారు. డి-పట్టా భూములకు నష్టపరిహారం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలను తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నిర్వాసితులు నాయకులు సురవరపు సింహాచలం, జి శంకరరావు, ఎ రామకృష్ణ, జి రాంబాబు, పి రామారావు, కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వంశధార నిర్వాసితులు అదనపు పరిహారం కోసం శాంతియుతంగా బైక్ ర్యాలీ చేస్తే పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

సంపాదకీయం


లెక్కల తకరారుకే...

జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) చేసే అన్ని రకాల సర్వేలనూ సమీక్షించడానికి కేంద్ర ప్రభుత్వం నిపుణులతో కమిటీని నియమించింది. ఇంతకు ముందు 2019లో ఆర్థిక గణాంకాల సమీక్షకు స్టాండింగ్ కమిటీని వేయగా, దాని స్థానంలో కొత్త కమిటీ వచ్చింది. భారతదేశపు మొట్టమొదటి ముఖ్య గణాంక శాస్త్రవేత్త, జాతీయ గణాంక కమిషన్ (ఎన్ఎస్‌సి) మాజీ ఛైర్‌పర్సన్ ప్రణబ్ సేన్ నూతన కమిటీకి అధ్యక్షులుగా ఎంపికకాగా, కమిటీలో 10 మంది అధికారిక సభ్యులు, నలుగురు విద్యారంగానికి చెందిన ప్రభుత్వేతర సభ్యులు ఉంటారు. కమిటీలో గరిష్టంగా 16 మంది సభ్యులకు అవకాశం కల్పించారు. ఇప్పటి వరకు ఉన్న స్టాండింగ్ కమిటీకి ఎన్ఎస్ఓ చేసే ఆర్థిక సర్వేలను మాత్రమే సమీక్షించే అధికారం ఉంది. నూతన కమిటీ ఆర్థిక అంశాలతో పాటు సామాజిక అంశాలనూ పరిశీలించేలా అధికారాల పరిధిని విస్తృతం కావించారు. గతంలో వేసిన స్టాండింగ్ కమిటీపై ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్‌పర్సన్ వివేక్ దేవ్‌రాయ్‌తో సహా పలువురు నిపుణులు బహిరంగంగానే విమర్శలు చేశారు. మన దేశ స్టాటిస్టికల్ సర్వీస్‌కు సర్వేల నిర్వహణపై తక్కువ నైపుణ్యం ఉందని తప్పుబట్టారు. ఈ నేపథ్యంలో, వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలున్నాయనగా ప్రభుత్వం ఏదో చేస్తోందని ప్రజలను భ్రమింపజేయడానికే కొత్త కమిటీ తంతు అన్న భావన ప్రజలందరిలో ఉంది.

పారిశ్రామిక, సేవారంగాలు, కార్మికశక్తి గణాంకాలను కమిటీ పరిశీలించినా, తుది ఫలితాల ఖరారు జాతీయ గణాంక కమిషన్‌దేనైనా, తిరకాసంతా హౌస్‌హోల్డ్ సర్వేలకు నిర్ణయించే కొలబద్దల్లోనే ఉంటుంది. ఫ్రేమ్‌వర్క్, నమూనా, విశ్లేషణ, ఫలితాల వద్ద గిమ్మిక్కులకు పాల్పడే అవకాశం లేకపోలేదు. మోడీ ప్రభుత్వం వచ్చాక దేశం అన్ని రంగాల్లో సుభిక్షంగా శోభిల్లుతోందంటూ ప్రజలకు 'ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్'ను ఎక్కించడమే పనిగా పెట్టుకుంది. అవసరమైతే కొలబద్దలను మార్చేస్తోంది. అందుకు ఉదాహరణ జాతీయ స్థూల ఉత్పత్తి (జిడిపి) లెక్కింపునకు ప్రామాణిక సంవత్సర మార్పు. హౌస్‌హోల్డ్ సర్వేకి 2011-12 ఏడాది బేస్ ఇయర్‌గా ఉంది. మోడీ ప్రభుత్వం 2017-18ని ప్రామాణికంగా తీసుకుంటామంటోంది. ఇప్పటి ఆదాయాలను ప్రామాణికంగా చూపితే జిడిపి సైజ్ పెద్దగానే కనిపిస్తుంది. అప్పటి ధరలకు ఇప్పటి ధరలకు పోలిక పెడితే ఎన్నోరెట్ల పెరుగుదల కనిపిస్తుంది. ఈ వాస్తవాన్ని కావాలనే మోడీ ప్రభుత్వం కప్పెడుతోంది. అదానీ ఆదాయాన్నీ, వీధుల్లో చెప్పులు కుట్టుకునే నిరుపేద ఆదాయాన్ని కలిపి జిడిపి, తలసరి ఆదాయాలను లెక్కిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ ఐదు ట్రిలియన్ డాలర్లకు చేరుతుంది. ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థాయికి ఎగబాకుతుంది. కానీ జనబాహుళ్యం బతుకుల్లో ఎలాంటి మార్పు ఉండదు.

ఆర్థిక మాంద్యం, కరోనా విలయం, ప్రభుత్వం తలకెత్తుకున్న నయా-ఉదారవాద ఆర్థిక విధానాల వలన ప్రజల బతుకులు అంతకంతకూ ఛిద్రమవుతున్నాయి. నిరుద్యోగం రికార్డులు బద్దలు కొడుతోంది. ఉపాధి అవకాశాలు పడిపోతున్నాయి. ప్రభుత్వరంగాన్ని అమ్మకానికి పెట్టడంతో ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయి. పారిశ్రామికవృద్ధి మందగమనంలో ఉంది. సర్వీస్ రంగం ఊగిసలాటలో ఉంది. వ్యవసాయరంగం సంక్షోభంలో ఉంది. ధరలు పెరిగి ద్రవ్యోల్బణం కట్టలు తెంచుకుంటోంది. పేదరికం పెరుగుతోంది. ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. ఈ లెక్కల్లో చాలా భాగం ప్రభుత్వానివే. అందుకే సర్వేలంటే మోడీ సర్కారుకు కడుపుమంట. అందుకే ఎన్ఎస్ఎస్ ఫలితాలను ప్రకటించకుండా తొక్కిపెడుతోంది. మానవ అభివృద్ధి సూచీలు, గ్లోబల్ హంగర్ ఇండెక్స్ రిపోర్టులను తూలనాడుతోంది. చివరికి ప్రభుత్వం నిర్వహించే ఎన్‌సిఆర్‌బి గణాంకాలను సైతం రహస్యంగా ఉంచుతోంది. నిజాలు బయట పడితే ఎక్కడ తమ బండారం బయట పడుతుందోనన్న భయమే అందుక్కారణం. ఎన్ని కమిటీలు వేసినా, ఎంతగా అవాస్తవాలతో మభ్యపెట్టాలని ప్రయత్నించినా ప్రజలకు అనునిత్యం ఎదురవుతున్న వారి దైనందిన అనుభవాలే అద్దాలు. వాటిలో వాస్తవాలే కనిపిస్తాయి. ఆపడం మోడీ ప్రభుత్వతరం కాదు.

మహనీయుల మాట



కళలకు సృష్టికర్త మానవుడు. ఆ కళలు తిరిగి నూతన మానవుణ్ణి సృష్టిస్తున్నాయి.

- దోస్తోవ్‌స్కీ
రష్యన్ రచయిత

మూడవ ప్రపంచ దేశాల విదేశీ రుణం

సామ్రాజ్యవాద దేశాలతోపాటు జి-20లో భారతదేశం గాని మరేదైనా మూడవ ప్రపంచదేశం గాని పాల్గొనడం వల్ల ఏమిటి ప్రయోజనం? మొత్తంగా మూడవ ప్రపంచదేశాలు ఎదుర్కొంటున్న ఉమ్మడి, తక్షణ సమస్యలను ఆ జి-20 సమావేశాల వేదిక మీద లేవనెత్తగలిగితేనే ఏదైనా ప్రయోజనం ఉంటుంది. భారతదేశం జి-20 దేశాల సమావేశానికి అధ్యక్ష హోదాలో ఆతిథ్యం ఇవ్వనుంది. మూడవ ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న అత్యంత క్లిష్టమైన సమస్య విదేశీ రుణాల చెల్లింపు సమస్య. ఈ సమస్యను ఆ సమావేశాలలో భారతదేశం తప్పనిసరిగా లేవనెత్తాలి. అప్పుడే ఆ జి-20 సమావేశాలలో పాల్గొన్నందుకు సార్థకత లభిస్తుంది. ఇంతకీ ఈ విదేశీ రుణాల చెల్లింపు సమస్య ఏమిటి?

సంపన్న పెట్టుబడిదారీ దేశాలు తమ దేశీయ వినిమయాన్ని గాని, తమ స్వంత పెట్టుబడులను గాని కుదించుకుని మిగిల్చిన ఆర్థిక వనరులను మూడవ ప్రపంచదేశాలకు రుణంగా ఇస్తున్నాయని చాలామంది అనుకుంటారు. మరి వాస్తవం ఏమిటి? మూడవ ప్రపంచదేశాలు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలనుండి (ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్) రుణాలు తీసుకుంటాయి. విదేశీఎగుమతి, దిగుమతుల లావాదేవీలలో వచ్చిన ఆదాయం కన్నా చెల్లించవలసినదే ఎక్కువైనప్పుడు ఆ లోటును భర్తీ చేసుకోడానికి రుణం అవసరం అవుతుంది. ఒకవేళ తీసుకున్న రుణంలో లోటును భర్తీ చేయగా ఇంకా మిగిలిపోతే అప్పుడు ఆ మేరకు విదేశీమారక ద్రవ్యం నిల్వలకు తోడవుతుంది. అప్పుడు దానిమీద చక్రవడ్డీ చెల్లించాల్సివస్తుంది. అందుకే మూడవ ప్రపంచ దేశాలు విదేశీ చెల్లింపుల్లో లోటు ఏ మేరకు ఏర్పడుతుందో ఆ మేరకే విదేశీ రుణం తీసుకుంటాయి. ఈ విదేశీ రుణం ఏర్పాటు చేయడానికి సంపన్న పశ్చిమ దేశాలు తమ వనరులనుండి కొంత భాగాన్ని త్యాగం చేశాయి గనుక ఆ త్యాగానికి బదులు తీర్చుకోడానికి మూడవ ప్రపంచదేశాలు వడ్డీతో సహా ఆ రుణాలను తప్పకుండా తిరిగి చెల్లించాలి. - ఇది సామ్రాజ్యవాద దేశాలు, వారి తైనాతీలుగా వ్యవహరించే ఆర్థికవేత్తలు ప్రచారంలో పెట్టే వాదన.



ప్రభాత్ పట్నాయక్

చాలా ప్రాథమికమైన ఆర్థిక సూత్రాల దృష్ట్యా చూసినా, ఈ వాదన పూర్తిగా తప్పు. అదెలాగో చూద్దాం. ఏదైనా ఒక సరుకు మార్కెట్‌లో సరఫరా అవుతున్న మేరకు దానికి డిమాండ్ లేదనుకుందాం. అప్పుడు ఆ తేడాను మూడు విధాలుగా సర్దవచ్చు. మొదటిది: ఆ సరుకు ధర తగ్గవచ్చు. రెండవది: ఆ సరుకును అంతటినీ మార్కెట్ లోకి విడుదల చేయకుండా కొంతభాగాన్ని నిల్వగా అట్టిపెట్టవచ్చు. మూడవది: దాని ఉత్పత్తిని తగ్గించేయవచ్చు. ఐతే, సాధారణంగా వినిమయ వస్తువుల ధరలను, సేవల ధరలను గుత్తాధిపతులు నిర్ణయిస్తారు. అందువలన వాటి ధరలు మార్కెట్ లో పడిపోవు (ఆ గుత్తాధిపతులు కావాలని తగ్గిస్తే తప్ప). అదే విధంగా సరుకుల నిల్వలను ఎక్కువ కాలం పాటు నిల్వ ఉంచుకోరు. వాటిని ఏదోవిధంగా తొందరగా వదిలించుకుంటారు. అందుచేత ఒకానొక సరుకుకు మార్కెట్‌లో డిమాండ్ గనుక తగ్గితే, ఆ సరుకు ఉత్పత్తిని తగ్గించడం జరుగుతుంది. అంటే మార్కెట్‌లో ఆ సరుకుకు ఎంత డిమాండ్ ఉండబోతోందో ఆ మేరకే ఆ సరుకు ఉత్పత్తి జరుగుతుంది. అందుకే పెట్టుబడిదారీ విధానాన్ని డిమాండ్-నియంత్రిత వ్యవస్థ అంటాం (సరుకు అవసరాన్ని బట్టి గాక ఆ సరుకును కొనగలిగేవారు ఎందరుంటారో ఆ మేరకే ఉత్పత్తి చేయడం). పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజల కొనుగోలుశక్తి తగ్గుతూనే వుంటుంది గనుక స్థూల ఉత్పత్తి గాని, అదనపు ఉద్యోగాల కల్పన గాని జరగదు.



అంటే ఒక సంపన్న దేశం మూడవ ప్రపంచ దేశానికి ఇచ్చే రుణం తన దేశీయ వినిమయాన్ని తగ్గించుకుని త్యాగం చేసి ఇచ్చేది కాదు సరికదా, అందుకోసం తన దేశీయ వినిమయాన్ని మరింత పెంచుతుంది. ఈ రుణాన్నే ఇవ్వకపోతే ఆ సంపన్నదేశం తన దేశీయ వినిమయాన్ని అంతగా పెంచుకోగలిగేది కాదు. దేశీయ వినిమయం పెరగడం అంటే ఆ మేరకు ఆ సంపన్న దేశంలో ఉపాధి కూడా పెరుగుతుంది. ఆ విధంగా మూడవ ప్రపంచ దేశాలకు ఇచ్చే రుణం ఫలితంగా సంపన్న దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను మరింత బలపరుచుకో గలుగుతాయి. అంతే తప్ప త్యాగం చేసి కోల్పోయేది ఏమీ ఉండదు.

విదేశీ వ్యాపారంలో మూడవ ప్రపంచ దేశాలకు ఏర్పడే చెల్లింపుల లోటు అంటే అది ఆ విదేశీ వ్యాపారంలో సంపన్న పెట్టుబడిదారీ దేశాల వద్ద ఏర్పడే చెల్లింపుల మిగులు మాత్రమే. మూడవ ప్రపంచదేశాల సరుకులతో పోల్చితే సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ఉత్పత్తి చేసే సరుకులకు ప్రపంచం మొత్తం మీద ఉన్న డిమాండ్ ఎక్కువగా ఉండబట్టే వాటివద్ద ఆ చెల్లింపుల మిగులు ఏర్పడుతుంది. సంపన్న పెట్టుబడిదారీ దేశాల నుండి మూడవ ప్రపంచదేశాలు సరుకులను,సేవలను కొనుగోలు చేస్తాయి. అదే సంపన్న దేశాల వద్ద చెల్లింపుల మిగులురూపంలో కనిపిస్తుంది. ఆ మేరకే ఆ సంపన్నదేశాలు రుణాలను మూడవ ప్రపంచదేశాలకు ఇస్తాయి. అంతే తప్ప తమ దేశీయ వినిమయాన్నో, దేశీయ పెట్టుబడులనో తగ్గించుకుని (త్యాగం చేసి) రుణాలు ఇవ్వవు (క్రెడిట్ కార్డుల సదుపాయం అంతిమంగా బ్యాంకులకే లాభం కాని వినియోగదారుడికి కాదు. మూడవ ప్రపంచదేశాల విదేశీ రుణం కూడా అలాంటిదే).

అంతే కాదు. సంపన్న దేశాలు మూడవ ప్రపంచ దేశాలకు ఇచ్చే రుణాలు వాస్తవానికి అవి అదనంగా చేసే పొదుపు మాత్రమే. ఉదాహరణకు ఒకానొక సంపన్న దేశం 100 డాలర్లను రుణంగా ఇచ్చిందనుకుందాం. అది ఆ దేశం చేసిన పొదుపు. 100 డాలర్లమేరకు పొదుపు చేయగలగాలంటే ఆ దేశం ఎంత వినిమయం అదనంగా చేయాలి? లెక్క కోసం ఆ దేశం వినిమయం-పొదుపు నిష్పత్తి 100:25 గా ఉందనుకుందాం (అంటే 25 డాలర్ల పొదుపు చేయాలంటే 100 డాలర్ల వినిమయం అదనంగా పెంచాలి). ప్రస్తుత ఉదాహరణలో 100 డాలర్ల పొదుపుకు గాను ఆ దేశం 400 డాలర్ల మేరకు దేశీయ వినిమయాన్ని పెంచాలి. అంటే ఒక సంపన్న దేశం మూడవ ప్రపంచదేశానికి ఇచ్చే రుణం తన దేశీయ వినిమయాన్ని తగ్గించుకుని త్యాగం చేసి ఇచ్చేది కాదు సరికదా, అందుకోసం తన దేశీయ వినిమయాన్ని మరింత పెంచుతుంది. ఈ రుణాన్నే ఇవ్వకపోతే ఆ సంపన్నదేశం తన దేశీయ వినిమయాన్ని అంతగా పెంచుకోగలిగేది కాదు. దేశీయ వినిమయం పెరగడం అంటే ఆ మేరకు ఆ సంపన్న దేశంలో ఉపాధి కూడా పెరుగుతుంది. ఆ విధంగా మూడవ ప్రపంచదేశాలకు ఇచ్చే రుణం ఫలితంగా సంపన్న దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను మరింత బలపరుచుకోగలుగుతాయి. అంతే తప్ప త్యాగం చేసి కోల్పోయేది ఏమీ ఉండదు.

ఇప్పుడు ఈ సంపన్న దేశాలు మూడవ ప్రపంచ దేశాలకు ఇచ్చిన రుణం మొత్తాన్ని మాఫీ చేశాయి అనుకుందాం. దానివలన ఆ సంపన్న దేశాలు ఏం కోల్పోతాయి? రుణాన్ని మాఫీ చేసేనాటికన్నా ముందు సంపన్న దేశాలు ఉండే పరిస్థితికి, మాఫీ చేశాక ఏర్పడే పరిస్థితికి తేడా ఏముంటుంది? నిజానికి రుణం ఇచ్చిననాటికన్నా వాటిని మాఫీ చేసేనాటికి ఆ సంపన్న దేశాలలో వినిమయం గాని ఉపాధి కాని మెరుగుపడతాయి (వ్యక్తుల విషయంలో కూడా అప్పు తీసుకున్నవాడు వడ్డీ నిమిత్తం చెల్లించేది అసలు కన్నా కూడా ఎక్కువైపోయే సందర్భాలు చాలానే ఉంటాయి. అటువంటి సందర్భాల్లో అసలును మాఫీ చేయమని అడగడం కద్దు.). ఇలా రుణాలను మాఫీ చేయాలనే డిమాండ్ బలంగా మూడవ ప్రపంచ దేశాలవైపు నుండి తలెత్తకుండా ఉండాలనే సంపన్న దేశాల ప్రతినిధులు, వారి తైనాతీలుగా ఉండే ఆర్థికవేత్తలు, బ్రెట్టన్‌వుడ్ సంస్థలు ఈ "త్యాగం" సిద్ధాంతాన్ని ముందుకు తెస్తున్నాయి. నిజానికి ఈ తరహా సిద్ధాంతాలనే మార్క్స్ "వికృత ఆర్థిక సిద్ధాంతాలు" అని తూర్పారబట్టాడు. అంతేగాక సంపన్న దేశాలవద్ద ఉండే ఆర్థిక వనరులను తమ స్వంత అవసరాలకు వాడుకోకుండా రుణాలుగా ఇస్తున్నట్టు చిత్రించడం ద్వారా వాటివద్ద పరిమితంగానే ఆర్థిక వనరులు ఉన్నాయన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నారు.

ప్రసిద్ధ ఇంగ్లీష్ ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ మహా మాంద్యం కాలంలో ఒక వ్యాఖ్య చేశాడు. అది పైకి చూడడానికి చాలా విడ్డూరంగా అనిపిస్తుంది. అతనేం అన్నాడో చూడండి: ప్రభుత్వ ప్రాజెక్టుల్లో కార్మికులను పనిలో పెట్టి వాళ్ళని ముందు కొన్ని గోతులు తవ్వమని, ఆ తర్వాత వాటిని పూడ్చివేయమని ఆదేశించి అందుకోసం వాళ్ళకి కూలీగా 100 డాలర్లు చెల్లిస్తే దానివలన సమాజానికి లాభం కలుగుతుంది. అటువంటి పనికిమాలిన ప్రాజెక్టులకోసం చేసే 100 డాలర్ల ఖర్చు వలన సమాజంలో అదనంగా 300 డాలర్ల మేరకు వినిమయం పెరుగుతుంది. వినిమయం పెరిగిన మేరకు అదనపు ఉపాధి అవకాశాలు కూడా కలుగుతాయి. దాని వలన సమాజంలో మెరుగైన పరిస్థితులు ఏర్పడతాయి.

ఇప్పుడు మూడవ ప్రపంచ దేశాలకు ఇచ్చిన రుణాన్ని మాఫీ చేసే విషయంలోనూ ఇదే సామ్యం వర్తిస్తుంది. ఆ విధంగా మాఫీ చేసినా సంపన్న దేశాలు నష్టపోయేదేమీ లేదు.

బహుశా ఇదే దృక్పథంతో బ్రాండ్ట్ కమిషన్ సిఫార్సు చేసివుండాలి. సంపన్న దేశాలు తమ జిడిపిలో ఒక శాతం మొత్తాన్ని కడు పేద దేశాల రుణాల మాఫీ నిమిత్తం కేటాయించాలని ఆ కమిషన్ సిఫార్సు చేసింది. ఆ విధంగా మాఫీ చేయడం వలన సంపన్న దేశాలకు నష్టం రాదు సరికదా మాఫీ చేసిన మొత్తానికి మూడు, నాలుగు రెట్లు తమ స్వంత దేశాల్లో వినిమయం, ఉపాధి పెరుగుతాయి.

ఇంతదాకా మనం మూడవ ప్రపంచ దేశాలు కేవలం సంపన్న పశ్చిమ దేశాల వద్దనే రుణాలు తీసుకుంటున్నాయి అన్న కోణం నుండి చర్చించాం. కాని కొంత రుణాన్ని అవి చైనా నుండి కూడా పొందుతున్నాయి. సంపన్న దేశాల బ్యాంకుల మధ్యవర్తిత్వంతో అందుకు సంబంధించిన లావాదేవీలు జరుగుతాయి. చైనాతో బాటు కొన్ని చమురు ఉత్పత్తి చేసే దేశాలు కూడా ఈ రుణాలిస్తాయి. ఐతే చైనాకు గాని చమురు ఉత్పత్తి చేసే దేశాలకు గాని పైన చెప్పిన వాదనలు వర్తించవు. దానికి కారణం చైనా గాని, చమురు ఉత్పత్తి దేశాలు గాని డిమాండ్-నియంత్రిత వ్యవస్థలుగా లేవు (వినిమయ సరుకుల ఉత్పత్తి, సేవల ఉత్పత్తి ప్రధానంగా ఉండేది సంపన్న పశ్చిమ దేశాలలో. అక్కడ డిమాండ్-నియంత్రిత వ్యవస్థ ఉంటుంది. కాని చైనాలో, చమురు ఉత్పత్తి దేశాలలో వాటితోబాటు వ్యవసాయం లేదా సహజవనరుల ఉత్పత్తి కూడా ఉంటుంది). అందుచేత మూడవ ప్రపంచ దేశాలు చైనాతో, చమురు ఉత్పత్తి దేశాలతో రుణాల విషయంలో వేరే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. పశ్చిమ దేశాల బ్యాంకుల ద్వారా కాకుండా ఆ దేశాలతో నేరుగా సంప్రదింపుల జరిపి రుణాల విషయంలో మాఫీని గాని రాయితీలను గాని పొందాలి. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థమీద సంపన్న పశ్చిమ దేశాల పెత్తనం బలహీనపడుతోంది గనుక చైనాతో గాని చమురు ఉత్పత్తి దేశాలతో గాని నేరుగా సంప్రదింపులు జరపడానికి అవకాశాలు మెరుగయ్యాయి.

ఇక సంపన్న దేశాలిచ్చిన రుణాల విషయంలో ఆ దేశాలేవో త్యాగాలు చేసేసి రుణాలిస్తున్నాయన్న తప్పుడు అభిప్రాయాన్ని వదిలించుకుని రుణాలను తిరిగి చెల్లించే విధివిధానాలను తమ తమ దేశాల ఆర్థిక వ్యవస్థల ప్రయోజనాలకు అనుగుణంగా ఉండేవిధంగా మార్చడానికి ఒత్తిడి చేయాలి. ఐఎంఎఫ్ ప్రతిపాదించే "ఉద్ధరణ" ప్యాకేజీలు నిజానికి రుణాలు తీసుకునే దేశాల ఆర్థిక వ్యవస్థలను, ఆ దేశాల ప్రజల జీవన పరిస్థితులను దారుణంగా దెబ్బ తీస్తున్నాయి.

ఐతే ఏ ఒక్క మూడవ ప్రపంచదేశమూ సంపన్న దేశాలకు ఈ విధమైన ప్రతిఘటనను ఇచ్చి తన దేశ ప్రయోజనాలకు అనుగుణంగా ఉండే విధంగా రుణ బకాయిల చెల్లింపుల షరతులను తిరగరాయగలిగిన పరిస్థితి లేదు. కాని ఉమ్మడిగా అన్నిదేశాలూ కలిసికట్టుగా నిలవగలిగితే కొన్ని రాయితీలనైనా సాధించవచ్చు. ఉదాహరణకు: అన్ని దేశాలూ ఉమ్మడిగా పట్టుపడితే, రుణ బకాయిల చెల్లింపుకు ఇప్పుడు విధిస్తున్న గడువులకు బదులు, ప్రతీ దేశమూ తన ఎగుమతుల ద్వారా లభించే ఆదాయంలో ఒకానొక శాతాన్ని రుణబకాయిల నిమిత్తం చెల్లించేట్టు కొత్త నిబంధనలు ఉండాలని ఒత్తిడి చేయవచ్చు. అలాగే చెల్లించవలసిన మొత్తాన్ని కూడా గణనీయంగా తగ్గించుకోవచ్చు. ఇది సాధ్యపడాలంటే రుణగ్రహీత దేశాల మధ్య ముందస్తు సంప్రదింపులు జరగాలి. ఆ తర్వాత రుణదాతలతో బేరసారాలు జరగాలి. జి-20లో సభ్య దేశంగా ఉన్న భారతదేశం ఇటువంటి దిశగా చొరవ తీసుకోవాలి.

అన్ని దేశాలూ ఉమ్మడిగా పట్టుపడితే, రుణ బకాయిల చెల్లింపుకు ఇప్పుడు విధిస్తున్న గడువులకు బదులు, ప్రతీ దేశమూ తన ఎగుమతుల ద్వారా లభించే ఆదాయంలో ఒకానొక శాతాన్ని రుణబకాయిల నిమిత్తం చెల్లించేట్టు కొత్త నిబంధనలు ఉండాలని ఒత్తిడి చేయవచ్చు. అలాగే చెల్లించవలసిన మొత్తాన్ని కూడా గణనీయంగా తగ్గించుకోవచ్చు. ఇది సాధ్యపడాలంటే రుణగ్రహీత దేశాల మధ్య ముందస్తు సంప్రదింపులు జరగాలి. ఆ తర్వాత రుణదాతలతో బేరసారాలు జరగాలి. జి-20లో సభ్య దేశంగా ఉన్న భారతదేశం ఇటువంటి దిశగా చొరవ తీసుకోవాలి.

(స్వేచ్ఛానుసరణ)

★

సమస్య

జనగణన ఒక జాతీయ అవసరం

అన్ని వనరుల్లో మానవ వనరు అత్యంత ప్రధానమైనది. దానిని క్రమబద్ధీకరించుకోవడం ఎంతో అవసరం. మానవ వనరుకు సంబంధించిన దశ, దిశ ఎప్పటికప్పుడు స్థిరీకరించుకోవాలంటే దానికి సంబంధించిన సమాచారం క్రమం తప్పని విధంగా సర్వ జనుల కనుసన్నల్లో ఉండాల్సిందే. ఓ దశాబ్దం క్రితం నుండి 'ప్రివెంటివ్ హెల్త్ చెకప్' అనే భావన బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆ తర్వాతి నుండి సంవత్సరానికి ఒకసారో లేదా డాక్టర్ల సూచన మేరకో మెడికల్ టెస్టులన్నీ చేయించుకుని ఏవైనా రుగ్మతలు తలెత్తే సంకేతాలు కనపడితే సరైన చికిత్స తీసుకుంటున్నాం. తద్వారా ఆయు:ప్రమాణాలను పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాం. ఇలా ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న వారిలో 90 శాతం మంది అకస్మాత్తుగా సంభవించే ప్రమాదాల నుండి బయట పడుతున్నారట! నిజానికి మోటార్ వెహికల్స్ సర్వీసింగ్‌కు సంబంధించినంత ఫాలోఅప్ మనుషుల ఆరోగ్యానికి లేదు. అలా ఒక క్రమబద్ధమైన పర్యవేక్షణ ఉంటే ఆయు:వృద్ధితో పాటు జీవన ప్రమాణాలు కూడా పెరుగుతాయి. ఇదే రకమైన అంశాన్ని దేశానికి వర్తింపజేస్తే ప్రతిఫలాలు ఎలా ఉంటాయో ఆలోచించండి. కనీసం పదేళ్లకోసారైనా దేశ జనాభాకు సంబంధించిన గణాంకాలన్నీ సేకరించకపోతే భవిష్య ప్రణాళికలు, పథకాలు, విధానాలు, దిద్దుబాటు చర్యలు వంటివన్నీ ఎలా రూపొందించుకుంటాం? కానీ ఈ అంశంపై కేంద్ర పాలనాధికార వ్యవస్థ నిర్లక్ష్యం వహిస్తున్న సంకేతం కనిపిస్తున్నది. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా తాజా ఉత్తర్వుల ప్రకారం 2024 జనవరి 1వ తేదీ వరకు అడ్మినిస్ట్రేటివ్ బౌండరీలన్నింటిని తటస్థీకరిస్తున్నట్లు (ఫ్రీజ్) ప్రకటించారు. దీంతో ఆ తేదీ వరకు ఏ రకమైన జనాభా లెక్కల ప్రక్రియ మొదలు కాదని అర్థమైంది. 2020లో జరగవలసిన జనాభా లెక్కలు కరోనా మహమ్మారి కారణంగా వాయిదా వేయబడ్డవి. అయితే ఇదే సమయంలో జనాభా లెక్కలు పూర్తి చేయవలసి ఉన్న అమెరికా, చైనా, బ్రెజిల్ వంటి దేశాలు ఆ పనిని ఇప్పటికే పూర్తిచేశాయి. మన పొరుగు దేశమైన బంగ్లాదేశ్ 2022లో జనగణన పూర్తి చేసింది. 1979లో చివరిసారిగా జనాభా లెక్కలు నిర్వహించిన ఆఫ్ఘనిస్తాన్ లాంటి అస్తవ్యస్తమైన దేశం తప్ప చాలా దేశాలు ఆ ప్రక్రియను పూర్తి చేశాయి.



జనాభా లెక్కలు అంటే కేవలం మనుషుల సంఖ్య, స్త్రీ పురుష నిష్పత్తి మాత్రమే కాదు. ఏ యే ప్రాంతాల్లో ఎంత జనసాంద్రత ఉన్నది? వారి జీవన విధానాలు ఎలా ఉన్నాయి? ఏయే వృత్తులలో ఎంతమంది నిర్దిష్టంగా ఉన్నారు? నిత్యం పెరుగుతున్న వలసల కారణంగా ఏ యే ప్రాంతాలు, రంగాలు ప్రభావితం అవుతున్నాయి? క్రమం తప్పని నిర్దిష్టమైన ఆదాయాలు కలిగిన జనాభా ఏ ప్రాంతంలో ఉన్నది? పూర్తిగా అసంఘటితమైన జనాభా ఎక్కడ ఉన్నది? వారి వెనుకబాటు తనానికి కారణాలేమిటి? వంటి అనేక అంశాలను ఒడిసిపట్టినప్పడే కదా కావలసిన దిశా నిర్దేశం చేసుకోవడానికి వీలుంటుంది.

భారత్ యువత ఎక్కువగా ఉన్న దేశమని చెప్పుకుంటున్నాం. కానీ అనేక స్వచ్ఛంద సంస్థల నివేదికల ద్వారా సమాజంలోని వివిధ అంశాలలో ఆందోళన కలిగించే వాస్తవాలు బయట పడుతున్నాయి. ఉదాహరణకు పిల్లల్లో పెరుగుతున్న పౌష్టికాహార లోపం, వయసుకు తగ్గ బరువు లేకపోవడం, వయసుకు మించిన రోగాల బారినపడడం, నాణ్యమైన విద్యా ప్రమాణాలు గ్రామీణ భారతంలో పూర్తిగా పడిపోవడం, సంతానోత్పత్తి రేటు, వృద్ధాప్య సంరక్షణ వంటివన్నీ ఉన్నాయి. జనాభా లెక్కలు అంటే కేవలం మనుషుల సంఖ్య, స్త్రీ పురుష నిష్పత్తి మాత్రమే కాదు. ఏ యే ప్రాంతాల్లో ఎంత జనసాంద్రత ఉన్నది? వారి జీవన విధానాలు ఎలా ఉన్నాయి? ఏయే వృత్తులలో ఎంతమంది నిర్దిష్టంగా ఉన్నారు? నిత్యం పెరుగుతున్న వలసల కారణంగా ఏ యే ప్రాంతాలు, రంగాలు ప్రభావితం అవుతున్నాయి? క్రమం తప్పని నిర్దిష్టమైన ఆదాయాలు కలిగిన జనాభా ఏ ప్రాంతంలో ఉన్నది? పూర్తిగా అసంఘటితమైన జనాభా ఎక్కడ ఉన్నది? వారి వెనుకబాటుతనానికి కారణాలేమిటి? వంటి అనేక అంశాలను ఒడిసిపట్టినప్పుడే కదా కావలసిన దిశా నిర్దేశం చేసుకోవడానికి వీలుంటుంది. వృద్ధులు, వితంతువులు, అనాథలు, స్పెషల్ చిల్డ్రన్‌గా పిలువబడే వారి సమాచారం లేకుండా రాష్ట్రాలు సంక్షేమ పథకాలను సక్రమంగా అమలుపరచలేవు. ఈ జనాభా లెక్కల సమాచారం కేవలం ప్రభుత్వానికి మాత్రమే కాదు అనేక విభాగాలకు, సంస్థలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఏయే ప్రాంతాలలో ఏ వయసు వారికి ఏ విధమైన వస్తు సేవల అవసరాలు ఎక్కడెక్కడ ఎంత మోతాదులో ఉన్నాయి? అనే అంశాలు ముందస్తుగానే తెలిస్తే కావలసిన విధంగా సంస్థలను నెలకొల్పడానికి అవకాశం ఉంటుంది. ఆర్థిక పెట్టుబడి మాదిరిగా మానవ వనరు కూడా ఒక చోట స్థిరంగా ఉండటం లేదు. అంచేత కాకి లెక్కలు కాకుండా కచ్చితమైన వివరాలుంటే, పోలీసు వ్యవస్థకు కూడా చాలా వెసులుబాటు వుంటుంది.

భారత దేశంలో జనాభా లెక్కలు 1881లో ప్రారంభమయ్యాయి. అప్పటి నుండి నిరాఘాటంగా కొనసాగిన ఈ ప్రక్రియ రెండవ ప్రపంచ యుద్ధ సమయంలోనూ ఆగిపోలేదు. అలాంటిది ఇప్పుడు తాత్సారం చేయబడుతున్నది. కరోనా మహమ్మారి ప్రభావం తగ్గిపోయింది, జనాభా లెక్కల సేకరణకు కావలసినంత యంత్రాంగం ఉన్నప్పటికీ కేంద్ర అధికార సంస్థలు వెనకడుగు వేయడానికి కేవలం రాజకీయ కారణాలే కనిపిస్తున్నాయి. జనాభా లెక్కల గడువు ఏర్పడిన తర్వాత సేకరించవలసిన వివరాలపై వివాదాలు మొదలయ్యాయి. ముఖ్యంగా వెనుకబడిన తరగతుల వివరాలను గత 70 ఏళ్ల కిందట మాత్రమే నమోదు చేశారు. ఆ తర్వాతి కాలాలలో దానిని విస్మరించారు. అంచేత ఇప్పుడు వెనుకబడిన తరగతుల, వివిధ ప్రాంతాల, కులాలకు సంబంధించిన డేటా సేకరించాలని అనేక రాజకీయ పార్టీలు పట్టుబట్టాయి. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధమైన రిజర్వేషన్లు, నిధుల కేటాయింపులు జరుగుతున్నాయి. వీటిల్లో సమతుల్యత సాధించాలన్నా జనాభా లెక్కల వివరాలుండాలి. "ఒకరు డిమాండ్ చేస్తే మేమెందుకు చేయాలి?" అన్న ధోరణితో దానిని నిరాకరించడమే గాక జనాభా లెక్కల సేకరణని వాయిదా వేస్తూ వస్తున్నారు. ఇది చాలా తప్పు. "ఈ దేశంలో కుల వ్యవస్థ ద్వారా నిర్మితమైన ఆర్థిక జరుగుబాటు ఉన్నది, అందుచేత వీలైనంత మేరకు సమాజంలో ఏ రకమైన అంతరాలు వున్నాయో తెలుసుకుంటే వాటికి పరిష్కారాలు కనుక్కోవడం సులభం" అని మాజీ దౌత్యవేత్త, రచయిత పవన్ కుమార్ వర్మ అభిప్రాయపడ్డారు. భూమి, ఉత్పత్తి కారకాలు ఇప్పటికీ కొందరి చేతిలోనే బంధీ అయిన సందర్భంలో ఇలాంటి గణాంకాలు సేకరించడం వల్ల పరిపాలనకు సౌలభ్యం ఏర్పడుతుంది. కానీ ఇలాంటి లెక్కలు సేకరించిన తర్వాత బయటపడిన వాస్తవాలు రాజకీయంగా కొందరికి తిరోగమన ఫలితాలు ఇస్తాయేమోనన్న భయం పాలకులను వెంటాడుతున్నట్లుంది. ఆదివాసీలు, గిరిజనుల రాజకీయ ప్రభావం ఈ మధ్య కాలంలో పెరిగింది. వారికి సంబంధించిన వివరాల్లో మార్పులు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తాయోనన్న భయమూ ఓ కారణమే! మన దేశం ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిదని చెప్పుకుంటున్నారు పాలకులు. కాని అస్తిత్వ సమీకరణల ప్రజాస్వామ్యంగా ఏనాడో మార్చేశారు. ఎన్నికలకు ముందు రెండేళ్ల నుండే సమీకరణల ఆధారంగా పాలన సాగిస్తే అది నిజమైన ప్రజాస్వామ్యమెలా అవుతుంది? లింగ, కుల, మత, ప్రాంతాల వారీగా ఎవరెవరి ఆర్థిక స్థోమతలేవో తెలిపే సాధనం ఈ జనగణన ప్రక్రియ. జనాభా లెక్కలు సేకరించకుండానే-ఫలానా మతం వారు బహు భార్యత్వాన్ని పాటిస్తూ వారి జనాభాను విపరీతంగా పెంచుకుంటున్నారు-అనే సంకేతాలిస్తూ, కొన్ని జాతులను, మతాలను మినహాయిస్తూనే ఉమ్మడి పౌర స్మృతి ప్రస్తావనను ముందుకు తేవడం విచారకరం. క్రమం తప్పని జనగణన చేయకపోవడం దేశానికి అపకారం తలపెట్టడంతో సమానం. కారణాలేవైనా దీనికి ఒడిగట్టడం నేరం.

- జి. తిరుపతయ్య,
సెల్ : 9951300016

కవిత్వం

సారా మహమ్మారి..!

సావాసగాళ్ళతో కలిసి
సరదాగా తాగిన సారాయి
అలవాటుగా మారి...
పానలోలులకు దినచర్య అవుతోంది...!?
రక్తబంధువులు కన్నా...
రక్తం పీల్చే రమ్ము, సారానే
మధుపాన ప్రియులు మనసారా ప్రేమిస్తారు..!
తన కుటుంబాన్ని విస్మరిస్తారు..!
సగటుజీవి గుడిసెలోకి
సారా మహమ్మారి గడుసుగా వచ్చి
తాటాకుల కొంపను కూల్చుతున్నా....
పెరుగుతున్న సారాయి ఆదాయం చూసి
పాలకులు మత్తులో మురిసిపోతుంటారు...!?
సాయంత్రం కాగానే...సందులోని
సారాయి దుకాణాల వద్ద
కష్టజీవులు కూలీ పనులు ముగించుకుని
బీరుల కోసం బారులు తీరతారు...!
పగలంతా శ్రమటోడ్చిన సొమ్ముతో
వేగిరమ్ముగా రమ్మును కొనుక్కుని
సర్కారు వారి సురాద్రవాన్ని తాగి
దారులు వెంట సర్కసు ఫీట్లు చేస్తూ..
ఇంటి గడపను తొక్కుతారు..!
బూతుల మూటలను విప్పుతూ.!?
గడప దాటని ఇల్లాలు ఎదురు చూసే..
ఇంటిలోని సరుకులు కోసం...!?
అన్నానికి తాళలేక...పాపం
చిన్నపిల్లలు నిద్రలోకి జారిపోయే..!
తప్ప తాగి వచ్చిన మగడు
నులక మంచం మీదకు చేరి
పలవరింతలతో గుర్రు పెట్టె..!
ప్రతి రోజూ చూసే సారా సీరియల్‌కి ..
బాధిత గృహిణికి సహనం చచ్చిపోతున్నది..!
కుటుంబ భారాన్ని మోసేందుకు
బాధ్యత గల ఇల్లాలు కాయకష్టానికెళుతోంది...
చంటి పిల్లలకు పట్టెడు మెతుకులు కోసం....!?

- జి.సూర్యనారాయణ, దివిసీమ.

బాలికల అభివృద్ధికి సోపానాలు కెజిబివిలు

- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- కెజిబివి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాలికల సర్వతోముఖాభివృద్ధికి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు(కెజిబివి) సోపానాలు అని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు ఇందులో చదివే విద్యార్థుల భవిష్యత్తు బాధ్యతను తీసుకోవాలని చెప్పారు. అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రోత్సహించి ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కెజిబివిల్లో కొత్తగా నియామకమైన 1,543 మంది ఉపాధ్యాయులకు పాఠ శాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి బొత్స హాజరై మాట్లాడారు. కెజిబివిల్లోని విద్యార్థులు ప్రతి రంగంలో రాణించే దిశగా బోధన ప్రక్రియ కొనసాగాలని, ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికల విద్య ప్రాధాన్యతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం తదనుగుణంగా విద్యాభివృద్ధికి భారీ స్థాయిలో నిధులు వెచ్చించి వారి సాధికారతకు కృషి చేస్తోందన్నారు. కెజిబివితోపాటు ప్రతి ఒక్క ప్రభుత్వ పాఠశాలలో మనబడి నాడు-నేడులో భాగంగా బాలికల కోసం ప్రత్యేకంగా టాయిలెట్ల నిర్మాణం, కౌమర దశ బాలికలకు శానిటరీ నాప్ కిన్‌లు, రక్తహీనత లోపం లేకుండా పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్‌ను పూర్తి చేసి, బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. తరగతి గదిలో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్, బి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యకు కస్తూరిబా గాంధీ విద్యాలయాలు బ్రాండ్‌గా మారాయన్నారు. కెజిబివి కార్యదర్శి డి మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. కెజిబివిల్లో బాలికల కోసం స్నేహపూరిత వాతారణం కల్పించడం, వృత్తి విద్యా నైపుణ్యాలను కల్పించడం, నాణ్యమైన జీవనాన్ని గడిపేందుకు కావాల్సిన జీవన నైపుణ్యాలను పెంపొందిస్తున్నామన్నారు. పాఠశాల విద్య డైరెక్టర్ పార్వతి, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ ఎ సుబ్బా రెడ్డి, ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

- కలిసొచ్చే సంఘాలతో ఐక్య ఉద్యమం
- చర్చా వేదికలో వక్తలు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, దాడులు, వివక్ష తదితర సమస్యలను పరిష్కరించాలని చర్చా వేదికలో వక్తలు డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై కలిసొచ్చే సంఘాలు, సంస్థలు, మేధావులతో కలిసి ఐక్య కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. దళితులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక హక్కుల కోసం త్వరలో జరగనున్న రక్షణ భేరికి మద్దతుగా విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చర్చావేదిక సోమవారం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు తీర్మానం ప్రవేశపెట్టారు. కెవిపిఎస్ ప్రధాన కార్యదిర్శి అండ్ర మాల్యాద్రి దీనిని బలపరచగా, పలువురు మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుకార్చే 41 సిఆర్‌పి ప్రకారం బెయిల్ ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. దాడులు, హత్యలు, స్త్రీలపై అత్యాచారాల కేసులను విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

దళితులను హత్య చేసిన, శాశ్వత వికలాంగులను చేసిన వ్యక్తి లేదా వ్యక్తుల ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బాధితులకు నష్టపరిహారం ఇచ్చే విధంగా చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేసింది. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. కులవివక్ష, అంటరానితనంపై ప్రభుత్వమే ప్రచార క్యాంపెయిన్ నిర్వహించాలని, రాష్ట్ర ప్రభుత్వం టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసి సంఘాలకు అందులో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బిజెపి మతోన్మాద శక్తులు, మనువాద రాజ్యాంగం అమలు చేసే కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిఓ 1235 ప్రకారం దళితులకు శ్మశాన స్థలాలు కేటాయించాలని కోరారు. జాతీయ నూతన విద్యావిధానం అమలు వల్ల దళిత విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్బంధ ఉచిత విద్య హక్కు చట్టం ప్రకారం దళిత విద్యార్థులు చదువుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, ఉప ప్రణాళిక చట్టం ప్రకారం బడ్జెట్‌లో పక్కదారి పట్టించిన నిధులను తిరిగి కేటాయించాలని కోరారు. డప్పు కళాకారులు, చర్మకారులకు పెన్షన్ రూ.5 వేలకు పెంచి 45 సంవత్సరాలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి దళిత కుటుంబానికీ 3 సెంట్ల ఇంటి స్థలం, 2 ఎకరాల సాగుభూమి కేటాయించాలని కోరారు.

గృహ నిర్మాణానికి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. భూస్వాముల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములు తీసుకుని పేదలకు పంచాలని, అసైన్డ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శ్మశానాల్లో పని చేస్తున్న కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఉచిత విద్యుత్ 300 యూనిట్లకు పెంచాలన్నారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం జరగనున్న దళిత రక్షణభేరిలో దళిత ప్రజాసంఘాల నాయకులు పాల్గొనాలన్నారు. చర్చా వేదికలు, క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో ఆగస్టు 9న క్విట్ కులవివక్ష, మతోన్మాదం పేర్లతో సదస్సులు, ఆగస్టు 15న కవితా గోస్టులు నిర్వహించాలని, సెప్టెంబరులో జాతాలు నిర్వహించాలని వేదిక తీర్మానం చేసింది. ఎపి కౌలు రైతుల సంఘం అధ్యక్షులు వై రాధాకృష్ణ, డిబిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, రెల్లి సంక్షేమ సంఘం నాయకులు టి నాగేంద్ర, ప్రొఫెషనల్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నేతి మహేశ్వరరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, డప్పు కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి జి క్రాంతికుమార్, కెవిపిఎస్ నాయకులు జి నటరాజ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పిజిటి, సిఆర్‌టి ఉపాధ్యాయులను విధుల్లో కొనసాగించాలి

- జై భీమ్ దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జునరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాల్లో గతంలో పనిచేసిన (పిజిటి, సిఆర్‌టి) ఉపాధ్యాయులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని జై భీమ్ దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు ఆదాడి మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని ధర్నాచౌక్‌లో సోమవారం ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ.. తెలుగు, ఇంగ్లీషు ఫ్యాకల్టీలను క్రమబద్ధీకరించి తిరిగి వారి ఉద్యోగాలు వారికి ఇవ్వాలని, కెజిబివిల్లో గెస్ట్ ఫ్యాకల్టీలను కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్ష లేదా సిఎం ఇల్లు ముట్టడి చేపడతామన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
స్పెషల్ కలెక్టరువారి కార్యాలయము(భూసేకరణ) ఒంగోలు

ప్రకాశంజిల్లా భూసేకరణ ప్రకటన

ఆర్.సి.నెం.సి/53/2023 ది: 03.07.2023

ఫారం నెం.6(ఎ)

(2013 వ సంవత్సరము 30 వ చట్టము వలన భూసేకరణ, పునరావాసము, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టంలోని సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి.

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములను ప్రజాహిత ఉపయోగార్థం అనగా కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్ట్ క్రింద నాగులుప్పలపాడు మండలం కండ్లగుంట గ్రామము నందు ఎడుమ ప్రధాన కాలువ పైన Tail Channal for Super Passage @ Km.21.463 నిర్మాణము నిమిత్తము భూమి కావలయునని శ్రీ స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్, ఒంగోలు వారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావించినందున, భూసేకరణ చట్టం 2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1)న నిభంధనలను సరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీ చేయడమైనది.

పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్ -12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉపకలెక్టర్ (భూసేకరణ), కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయరు ప్రాజెక్ట్ వారికి, వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై సెక్షన్ క్రింది ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11 (4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి శ్రీ ప్రత్యేక కల్లెక్టరు/ భూసేకరణ అధికారి వారి ముందస్తు అనుమతి లేనిదే, ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకము /కొనుగోలు (క్రయ విక్రయాలు) ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పైచట్టంలో సెక్షన్ 15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంభందించిన వ్యక్తి /వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించిన తేది నుండి 60 (అరువది) దినములులోగా శ్రీ స్పెషల్ కలెక్టర్, (భూసేకరణ) , పి.యస్.వి.పి. ఒంగోలు/ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), ఆర్ & ఆర్ యూనిట్ ఒంగోలు అధికారి వారి ఎదుట అభ్యంతరములు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : ప్రకాశం మండలము : నాగులుప్పలపాడు గ్రామము : కండ్లగుంట

Tail Channal for Super Passage @ Km.21.463 Left Main Canal

క్రమ సంఖ్య	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణము ఎ. సెంట్లు	కాలువ క్రింద తీసుకున్న విస్తీర్ణము ఎ.సెంట్లు	భూస్థితి	సంబంధించిన ఆసామి పేరు మరియు చిరునామ	హద్దులు ఉత్తరం సర్వే నెం. స.డి.నెం	దక్షిణం సర్వే నెం. స.డి.నెం	తూర్పు సర్వే నెం. స.డి.నెం	పడమర సర్వే నెం. స.డి.నెం	చెట్టు మరియు కట్టడములు వివరములు
1	33/8బి	1.63	0.09	ఇనాం మెట్ట	పల్లెర్ల అంజిరెడ్డి తండ్రి చెంచిరెడ్డి	32	33/10బి	36	33/2బి	
2	33/10బి	1.63	0.08	ఇనాం మెట్ట	గుదిబండ్ల విజయలక్ష్మి భర్త రమణారెడ్డి	33/8బి	ప్రాసంగులపాడు గ్రామ పొలిమేర	34	33/2బి	
3	34/1	0.63	0.08	ఇనాం మెట్ట	కోట్ల సుబ్బారెడ్డి తండ్రి పెరిరెడ్డి	36	ప్రాసంగులపాడు గ్రామ పొలిమేర	34/2	33	
4	34/2	0.57	0.08	ఇనాం మెట్ట	పల్లెర వెంకటసుబ్బమ్మ భర్త వెంకటేశ్వరరెడ్డి	36	ప్రాసంగులపాడు గ్రామ పొలిమేర	34/3	34/1	
	34/3	0.57	0.07	ఇనాం మెట్ట		36	ప్రాసంగులపాడు గ్రామ పొలిమేర	34/4	34/2	
5	34/4	0.57	0.06	ఇనాం మెట్ట	రాచపూడి పోతురాజు తండ్రి లక్ష్మయ్య	36	ప్రాసంగులపాడు గ్రామ పొలిమేర	34/5	34/3	
6	34/5	0.59	0.06	ఇనాం మెట్ట	కోట్ల సుబ్బారెడ్డి తండ్రి పేరిరెడ్డి	36	ప్రాసంగులపాడు గ్రామ పొలిమేర	34/6	34/4	
	34/6	0.58	0.05	ఇనాం మెట్ట		36	ప్రాసంగులపాడు గ్రామ పొలిమేర	35	34/5	
7	35/1	0.21	0.02	ఇనాం మెట్ట	రాచపూడి శేషయ్య తండ్రి దస్తగిరి	36	35/2	35/9	34	
8	36/5	0.52	0.07	మెట్ట	పల్లెర్ల కోటిరెడ్డి తండ్రి వెంకట సుబ్బారెడ్డి	36/4	36/16	39	36/6	
9	36/6	0.51	0.08	మెట్ట	పల్లెర్ల సుబ్బారెడ్డి తండ్రి కోటిరెడ్డి	37	36/15	36/5	36/7	
10	36/7	0.93	0.02	మెట్ట	ఈమని భారతమ్మ భర్త చింపిరయ్య	37	36/15	36/6	36/9	
11	36/12	0.39	0.02	మెట్ట	పల్లెర్ల వెంకటేశ్వరరెడ్డి తండ్రి అంజిరెడ్డి	36/10,15	34	36/13	36/11	
12	36/13	0.39	0.09	మెట్ట	పల్లెర్ల వేణుగోపాలరెడ్డి తండ్రి వెంకటసుబ్బారెడ్డి	36/15	34, 35	36/14	36/12	
13	36/14	0.63	0.11	మెట్ట	కొమ్మారెడ్డి అంజిలిదేవి భర్త అనంతరెడ్డి	36/15	35	36/17	36/13	
14	36/15	1.71	0.25	మెట్ట	పల్లెర్ల విజయలక్ష్మీ తండ్రి బాపనరెడ్డి	36/7,6	36/12 13,14	36/16	36/10	
15	36/16	0.58	0.10	మెట్ట	పల్లెర్ల అంజిరెడ్డి తండ్రి చెంచురెడ్డి	36/5,6	36/17	39	36/15	
	మొత్తం		1.33							

సం॥ శ్రీ **కె.చెన్నయ్య** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ),ఎఫ్.ఎ.సి, పి.ఎస్.వెలిగొండ ప్రాజెక్ట్, ఒంగోలు

కోల్డ్ స్టోరేజీల్లోనే మిర్చి నిల్వలు

- ఆర్డర్లు లేక ధరల తగ్గుదల
- 10 రోజుల్లో క్వింటాలుకు రూ.3 వేలు పతనం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజీల్లో ఎండు మిర్చి నిల్వలు పెరుగుతున్నాయి. భవిష్యత్తులో మంచి ధరలు వస్తాయని భావించి రైతులు, వ్యాపారులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుంటున్నారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లోని 120 కోల్ట్ స్టోరేజిల్లో 50 లక్షల టిక్కిల నిల్వలు ఉన్నాయి. గత 15 రోజుల్లో క్వింటాలుకు రూ.3 వేల వరకు తగ్గింది. సాధారణ రకాలు కనిష్ట ధర క్వింటాలు రూ.9 వేలు, గరిష్ట ధర రూ.24 వేలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. గత నెలలో సాధారణ రకాల కనిష్టంగా రూ.12 వేలు, గరిష్టంగా రూ.26 వేల వరకు ధర వచ్చింది. మేలురకాలైన తేజ, బాడిగ, దేవనారు డీలక్స్ రకాలు ధరలు కూడా బాగా తగ్గాయి. 15 రోజుల క్రితం వరకు మేలు రకాలు తేజ, బాడిగ కనిష్టంగా రూ.18 వేలు, గరిష్టంగా రూ.33 వేల వరకు పలికాయి. ప్రస్తుతం వీటి ధరలు కనిష్టంగా రూ.13 వేలు, గరిష్టంగా రూ.27 వేలకు కొనుగోలు జరుగుతోంది. ఎక్కువ సరుకు కనిష్ట ధరలకే కొనుగోలు చేస్తున్నారు. విదేశాలకు ఆర్డర్లు లేవు. గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకలో మిర్చి సాగు పెరగడం వల్ల దేశీయంగా ఇతర ప్రాంతాల నుంచి ఆర్డర్లు లేవని వ్యాపారులు చెబుతున్నారు. గతేడాది నవంబరులో మేలు రకాలకు గరిష్టంగా క్వింటాలుకు రూ.45 వేల వరకు ధరలు వచ్చాయి. గృహ అవసరాలకు విక్రయించే రిటైల్ వ్యాపారుల నుంచి కూడా ఆర్డర్లు తగ్గాయి. ధరలు తగ్గడం వల్ల యార్డుకు వచ్చే సరుకు గణనీయంగా తగ్గుతోంది. సోమవారం 37,050 టిక్కిలు రాగా, పాత నిల్వలతో కలిపి 34,864 టిక్కిలు అమ్ముడుపోయాయి. క్వింటాలుకు రూ.3 వేలు వరకు తగ్గినా గరిష్టంగా రూ.16 వేలకు తగ్గడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఆర్డర్లు వస్తే మళ్లీ ధరలు వస్తాయంటున్నారు.

అస్తవ్యస్తంగా పంచాయతీరాజ్ వ్యవస్థ

- పురందేశ్వరికి సర్పంచుల వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీలకు కేంద్రం నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆయా నిధులను దారి మళ్లించి పంచాయతీరాజ్ వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చిందని గ్రామ సర్పంచులు పేర్కొన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం పలువురు సర్పంచులు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. పురందేశ్వరిని కలిసిన వారిలో సర్పంచులు కె అశోక్ కుమార్, పి జయరామిరెడ్డి, ఎన్ శ్రీనివాసరావు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ

ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు

నెం.58 మరియు 77/2023-24, తేది: 15.07.2023
పని పేరు: కృష్ణా పశ్చిమ డెల్టాలోని కాలువల మరమ్మత్తుల నిమిత్తం ఓ అండ్ యమ్ మరియు యం.పి ల్యాడ్స్ పనులు చేపట్టుట. 20 పనుల విలువ: రూ. 72.96 లక్షలు. టెండరు షెడ్యూల్స్ ఆన్‌లైన్‌లో లభ్యమగు తేది: 17.07.2023 ఉ.10.30గం. నుండి 31.07.2023 ఉ.11గం. వరకు. వివరాలు: https://tender.apeprocurement.gov.in ఫోన్ నెం. 7901093255.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, కృష్ణా పశ్చిమ భాగము, తెనాలి
DIPRNo:10213/CL/ADVT/1/1/2021-22

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, ప్రొటియం ఫైనాన్స్ లిమిటెడ్ గతంలో గ్రోత్ సోర్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీస్ లిమిటెడ్‌గా పేరుగలది మరియు దానికి ముందు గ్రోత్ సోర్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా పేరుగలది) ఒక నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ అనునది రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాతో రిజిస్టరైనది దాని రిజిస్టర్డు ఆఫీసు: 7వ అంతస్తు, బ్లాక్ బి2, ఫేజ్-1, నిర్లాన్ నాలెడ్జి పార్కు, పహాడి గ్రామం, ఆఫీస్: వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే, కామ ఇండస్ట్రియల్ ఎస్టేట్, గోరెగాం (ఈస్ట్), ముంబయి-400063, మహారాష్ట్ర వద్ద కలిగియుండి, ఒక దాని బ్రాంచి సత్యవాణి హైట్స్, 12/1 అరుండల్‌పేట్, 1వ అంతస్తు, డోర్ నం.31-12-1020, అరుండల్‌పేట్, గుంటూరు-522002 నుండి, విజయవాడ బ్రాంచి డోర్ నం.59-10/3/ఎ, 59-10-3, 1వ అంతస్తు, గడ్డె కృష్ణయ్య, వీధి, గాయత్రినగర్, విజయవాడ-520008, ఆం.ప్ర. నకు 21 జులై, 2023 నుండి విలీనం అవుటకు ఆసక్తిగలిగియుంది.
వినియోగదారు పాత ఆవరణలో ఆఫీసు మూసి యుంటే అప్పుడు అనగా., 21 జులై, 2023 నుండి డోర్ నం.59-10/3/ఎ, 59-10-3, 1వ అంతస్తు, గడ్డె కృష్ణయ్య, వీధి, గాయత్రినగర్, విజయవాడ-520008, ఆం.ప్ర. వద్ద నుండి సేవలను పొందవచ్చును.
సంబంధిత వ్యక్తులు ఇందు పేర్కొన్న చిరునామా కొత్త బ్రాంచి పై అన్ని తదుపరి సమాచారం& సంప్రదింపుల పొందుటకు మరియు దయచేసి సదరు మార్పులను గమనించగలరు.
తేది: 18.07.2023,
ప్రదేశం: విజయవాడ
ప్రొటియం ఫైనాన్స్ లిమిటెడ్ తరపున సం/-

FIVE STAR Business Finance Limited
ఫైవ్ స్టార్ బిజినెస్ ఫైనాన్స్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: న్యూ నం.27, ఓల్డ్ నం.4, టైలర్స్ రోడ్, కిల్‌పాక్, చెన్నై-600010.
విజయవాడ శాఖ: డోర్ నం.40-27-41, అలంకార్ స్వీట్స్& బేకరి ఎదురుగా, పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్, విజయవాడ.

స్వాధీనతా ప్రకటన షార్ఫసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(4) క్రింద

ఏదైతే, క్రింది సంతకందారు **ఫైవ్ స్టార్ బిజినెస్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్& ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54 ఆఫ్ 2002) క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, తేది: **20.01.2023 నాటి డిమాండ్ నోటీసు** జారీచేసి, ఇందు దిగువ పేర్కొన్న రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారులను, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **24,80,786/- (రూపాయలు ఇరువై నాలుగు లక్షల ఎనభై వేల ఏడు వందల ఎనభై ఆరు మాత్రమే)**లను చెల్లించవలసిందిగా కోరబడినది.
రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారులు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారులకు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **14 జులై, 2023న భౌతిక స్వాధీనంచేసుకున్నారు.**
రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారులకు ప్రత్యేకించి మరియు సర్వజనులకు ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఇందు దిగువ వివరించిన ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తులతో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **ఫైవ్ స్టార్ బిజినెస్ ఫైనాన్స్ లిమిటెడ్**కు బకాయి మొత్తాలను మరియు దానిపై వడ్డీని చెల్లించుటకులోబడి ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ 8 యొక్క నియమాలపై రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారులు శ్రద్దవహించవలసిందిగా కోరబడుచున్నది.

లోన్ నంబరు	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత& హామీదారు పేరు	డిమాండ్ నోటీసు తేది	స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసులోని మొత్తాలు (రూ)
LA420024	1. దేగల శ్రీనివాస రెడ్డి, 2. దేగల లావణ్య	20.01.2023	14.07.2023	13.01.2023 నాటికి రూ.24,80,786/- మరియు దానిపై వడ్డీ.

స్థిరాస్తి వివరణ& షెడ్యూలు: అన్ని ఈసిమెంట్ హక్కులుతోపాటు 96.66చ.గ.ల లేదా 80.81చ.మీ.ల విస్తీర్ణపు ఖాళీ సైటు ల్యాండ్‌లో ఎక.1.32 సెంట్ల విస్తీర్ణంతో డోర్ నం.5-240 దగ్గర, మెమర్రెషన్ నం.265/5తో కాతెవరం గ్రామం& గ్రామపంచాయతి వద్దగల తెనాలి వెస్ట్ సబ్-రిజిస్ట్రీ, గుంటూరు జిల్లా రిజిస్ట్రీ పరిధిలో ల్యాండ్ యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: **ఉత్తరం:** దొడ్డపనేని ధర్మారావు సైటు-43.6అ.లు, **దక్షిణం:** సింగం రెడ్డి రామి రెడ్డి సైటు-43.6అ.లు, **తూర్పు:** ప్లాట్ నం.2, షేక్ హుసేన్ జాని సైటు-26అ.లు, **పడమర:** 30 లింకుల వెడల్పు జాయింట్ బజార్-20అ.లు.

గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా మరియు తెనాలి రిజిస్ట్రేషన్ సబ్-డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్ తోగల పై ఆస్తి.

ప్రదేశం: విజయవాడ
తేది: 14.07.2023
సం/- అధీకృత అధికారి, మెసర్స్ ఫైవ్ స్టార్ బిజినెస్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India — भारत सरकार का उपक्रम A Government of India Undertaking — आन्ध्रा Andhra — कार्पोरेशन Corporation

పేనుగొలను శాఖ
పేనుగొలను, గంపలగూడెం మండలం, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర.-521401.
టెలి.ఫోన్.నం.08673 270522, ఇ-మెయిల్:ubin0804118@unionbankofindia.bank

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు/హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన ఆస్తులు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పేనుగొలను శాఖ** కు తాకట్టు/చార్జ్‌చేయబడినవి, వాటిని **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పేనుగొలను శాఖ** యొక్క అధీకృత అధికారిచే స్వాధీనంచేసుకోబడినవి, మరియు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పేనుగొలను శాఖ** కు దిగువ **రుణగ్రహీతలు & హామీదారులు: 1. హరి వేంకటేశ్వర రావు, తండ్రి హరిపుల్లయ్య,** వుటుకూరు గ్రామం, గంపలగూడెం మండలం, కృష్ణా జిల్లా, ఎపి-521401. **2. గద్దం సీతారామయ్య, తండ్రి సుబ్బయ్య,** వుటుకూరు గ్రామం, గంపలగూడెం మండలం, కృష్ణా జిల్లా, ఎపి-521401 నుండి కాంట్రాక్టు రేటు మరియు ఇతర వ్యయాలతో తదుపరి వడ్డీతోపాటు **17.09.2019 నాటికి రూ.1,46,533.28 పై.లు (రూపాయలు ఒక లక్ష నలభై ఆరు వేల ఐదు వందల ముప్పై మూడు మరియు ఇరువై ఎనిమిది పైసలు మాత్రమే)**ల రికవరీ కొరకు **"ఎక్కడ, ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలాగే ఉంటుంది" ప్రాతిపదికన 27.07.2023న విక్రయించబడుతుంది.**

స్థిరాస్తి వివరణ

వుటుకూరు గ్రామం, గంపలగూడెం మండలం, కృష్ణా జిల్లా-521401 వద్ద ఆర్.ఎస్.నం.245/1 వద్ద 193.60చ.గ.ల కొలతల విస్తీర్ణంతో దానిపై భవనము మరియు ల్యాండ్ యొక్క ఈక్విటేబుల్ తాకట్టు మరియు **సరిహద్దులు: తూర్పు:** ఉమ్మడి దారి, **ఉత్తరం:** హరి శేషగిరి రావు యొక్క ఆర్‌సిసి భవనము, **దక్షిణం:** హరా రాధాకృష్ణ యొక్క ఆర్‌సిసి భవనము, **పడమర:** చావ రాధాకృష్ణ యొక్క దారి.

రిజర్వు ధర: రూ.5,40,000/- **ధరావత్తు: రూ.54,000/-**
బిడ్ పెంపుదల: రూ.10,000/-

అమ్మకం యొక్క వివరణాత్మక నియమ& నిబంధనల కొరకు, దయచేసి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్‌సైట్ అనగా., **www.unionbankofindia.com** లో ఇవ్వబడిన లింకును పరిశీలించండి. అధీకృత అధికారికి తెలిసినంత వరకు, ఆస్తిలో రుణభారాలు లేవు. ఆసక్తిగల బిడ్డరుదారు వేలం వివరాలు & ఆస్తి పరిశీలన కొరకు పై పేర్కొన్న తేదీన **సంప్రదించండి: అధీకృత అధికారి, సిఇఆర్/ చీఫ్ మేనేజర్, శ్రీ ఎస్‌కె రహమతున్, 9441909987 & 7799242967, మెయిల్ ఐడి: UBIN0804118@Unionbankofindia.bank.**

ఇ-వేలం తేది& సమయం: 27.07.2023న, ఉ॥ 11.00గం.ల నుండి సా.5.00గం.లు (10 నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపుతో).

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6)/రూల్ 9(1) క్రింద చట్టబద్ధ 15 రోజుల అమ్మకపు ప్రకటన

పై పేర్కొన్న తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు సంబంధించి సదరు రుణం యొక్క రుణగ్రహీతలు మరియు హామీదారులకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)/రూల్ 9(1) క్రింద నోటీసుగా భావించగలరు.

తేది: 17.07.2023
ప్రదేశం: పేనుగొలను
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
స్పెషల్ కలెక్టరువారి కార్యాలయము(భూసేకరణ) ఒంగోలు

ప్రకాశంజిల్లా భూసేకరణ ప్రకటన

ఆర్.సి.నెం.సి/129/2022 ది: 03.07.2023

ఫారం నెం.6(ఎ)

(2013 వ సంవత్సరము 30వ చట్ట వలన భూసేకరణ, పునరావాసము, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టంలోని సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి.

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములను ప్రజాహిత ఉపయోగార్థం అనగా కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్ట్ నిర్మాణములోని దక్షిణ ధేనువకొండ గ్రామ ఆర్ అండ్ ఆర్ కాలని వాసులకు స్మశానము ఏర్పాటు చేయుట కొరకు మద్దిపాడు మండలం గార్లపాడు గ్రామ సర్వేనెం.146/1 నందు గల య.2.64 సెంట్లు భూమి కావలయునని శ్రీ స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్, ఒంగోలు వారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావించినందున, 2013 సంవత్సరం 30వ చట్టంవలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1)న నిభంధనల నుసరించి ఇందుకు సంభంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీ చేయడమైనది.

పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్ -12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయరు ప్రాజెక్ట్ వారికి, వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై సెక్షన్ క్రింది ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11 (4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి శ్రీ ప్రత్యేక కల్లెక్టరు/ భూసేకరణ అధికారి వారి ముందస్తు అనుమతి లేనిదే, ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకము /కొనుగోలు (క్రయ విక్రయాలు) ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పైచట్టం లో సెక్షన్ -15 ననుసరించి భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంభందించిన వ్యక్తి /వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించిన తేది నుండి 60 (అరువది) దినములులోగా శ్రీ స్పెషల్ కలెక్టర్, (భూసేకరణ) , పి.యస్.వి.పి. ఒంగోలు/ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), ఆర్ & ఆర్ యూనిట్ ఒంగోలు అధికారి వారి ఎదుట అభ్యంతరములు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : ప్రకాశం మండలము : మద్దిపాడు గ్రామము : గార్లపాడు

క్రమ సంఖ్య	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణము ఎ. సెంట్లు	తీసుకున్న విస్తీర్ణము ఎ.సెంట్లు	భూస్థితి	సంబంధించిన ఆసామి పేరు మరియు చిరునామ	సరిహద్దులు ఉత్తరం సర్వే నెం. స.డి.నెం	దక్షిణం సర్వే నెం. స.డి.నెం	తూర్పు సర్వే నెం. స.డి.నెం	పడమర సర్వే నెం. స.డి.నెం	రిమార్కులు
1	2	3	4	5	6	7				8
1.	146/1	2.64	2.64	మెట్ట	బుసిరెడ్డి అంజిరెడ్డి తండ్రి రాజిరెడ్డి	10	147	146/2	దొడ్డవరం గ్రామ సరిహద్దు	
		మొత్తము	2.64							

సం॥ శ్రీ **కె.చెన్నయ్య** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ),ఎఫ్.ఎ.సి, పి.ఎస్.వెలిగొండ ప్రాజెక్ట్, ఒంగోలు

SBI **స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా**
యస్‌యమ్ఇ గుంటూరు బ్రాంచి-06830, సంయుక్త మాన్షన్, 3-28-1914, జి.సుదక్షిణాదేవి కాంప్లెక్స్, 3వ అంతస్తు, క్రోమా మాల్‌పైన, బృందావన్ గార్డెన్స్ 3వలైను, మెయిన్ రోడ్డు, స్పెన్సర్స్ ఎదురు, గుంటూరు-522006, ఫోన్: 0863-2231313

స్వాధీనత ప్రకటన రూల్ 8(1) (స్థిరాస్తుల కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (నెం.3 ఆఫ్ 2002) ప్రకారము **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యస్.యమ్.ఇ. బ్రాంచి, గుంటూరు(06830)** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు : మెస్సర్స్ వసంత్ కాటన్ ట్రేడర్స్ తరపున యజమాని : శ్రీ అయిలం కోటేశ్వరరావు, తండ్రి : వీరయ్య, డోర్ నెం.62/5ఎ, వంశీ కృష్ణ రైస్‌మిల్స్ దగ్గర, శ్రీనివాస వేబ్రిడ్జ్ ప్రక్కన, సింహపురి ఎస్టేట్, ఏటుకూరు రోడ్డు, గుంటూరు & ఫ్లాట్ నెం.113, శ్రీలక్ష్మీ గణపతి టవర్స్-11, స్థంబాలగరువు, గుంటూరు & ఫ్లాట్ నెం.101, 1వ అంతస్తు, భరత్ రెసిడెన్సీ, డోర్ నెం.135-55, జెకెసి కాలేజి రోడ్డు, విజయపురి కాలనీ, గుంటూరు, హామీదారులు /తనఖాదారులు: 1) శ్రీ అయిలం కోటేశ్వరరావు, తండ్రి : వీరయ్య, 2) శ్రీమతి అయిలం పిచ్చమ్మ, భర్త: అయిలం కోటేశ్వరరావు, 3) శ్రీమతి దిరిశాల శ్రీలక్ష్మీ, భర్త: బ్రహ్మయ్య, ఫ్లాట్ నెం.113, శ్రీలక్ష్మీ గణపతి టవర్స్-11, స్థంబాలగరువు, గుంటూరు & ఫ్లాట్ నెం.101, 1వ అంతస్తు, భరత్ రెసిడెన్సీ, డోర్ నెం.135-55, జెకెసి కాలేజి రోడ్డు, విజయపురి కాలనీ, గుంటూరు,** వారిని నోటీసులో ఉదహరించబడిన **ది.03-04-2023** నాటికి చెల్లించవలసిన బకాయిసొమ్ము **రూ.8,82,97,678/- (అక్షరాల ఎనిమిది కోట్ల ఎనభై రెండు లక్షల తొంభైఏడు వేల ఆరు వందల డెబ్బైఎనిమిది రూపాయలు మాత్రము)** ప్లస్ తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు చెల్లించనందున ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా నోటీసు రిజిస్టర్డ్ పోస్టుద్వారా **ది.04-04-2023న డిమాండ్ నోటీసు జారీచేయబడినది.**
ఋణగ్రహీత/ హామీదారులు బకాయిసొమ్మును మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలు, హామీదారులు మరియు సాధారణ ప్రజానీకమునకు నోటీసు ఇచ్చి, ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13 లోని సబ్ సెక్షన్ (4)కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారము **ది.11-07-2023న** దిగువ పేర్కొన్న **ఆస్తిని స్వాధీనత** తీసుకోవడమైనదని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బ్యాంకువారికి చెల్లించవలసిన బకాయిసొమ్ము **ది.03-04-2023 నాటికి రూ.8,82,97,678/- (అక్షరాల ఎనిమిది కోట్ల ఎనభై రెండు లక్షల తొంభైఏడు వేల ఆరు వందల డెబ్బైఎనిమిది రూపాయలు మాత్రము)** మరియు తదుపరి జమకూడు వడ్డీ, ఖర్చులు మొ॥నవి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యస్.యమ్.ఇ. బ్రాంచి, గుంటూరు(06830)** వారి ఛార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు మరియు హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమైనది.
సదరు చట్టంలో సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారం ఋణగ్రహీత/ హామీదారులు తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.


తనఖావుంచబడిన స్థిరాస్తుల వివరములు

ఈ క్రింది ఆస్తులు మెస్సర్స్ వసంత్ కాటన్ ట్రేడర్స్‌కు సంబంధించినవి:

ఆస్థి-1, షెడ్యూల్ 'ఏ': గుంటూరు జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పోరేషన్ ఏరియా పరిధిలోని,గుంటూరు టి.ఎస్ నెం.749 (నల్లపాడు గ్రామ పాత డి.నెం.235/ఎ), 8వ బ్లాక్, 18వ వార్డు, స్థంబాలగరువులోని శ్రీలక్ష్మీ గణపతి టవర్స్-II అపార్ట్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్, బ్లాక్ నెం.3 లోని 44.683 చ॥గ॥ల విస్తీర్ణములోని అవిభాజిత మరియు అనిర్ధిశిత వాటా స్థలము (మొత్తం 879.6/9 చ॥గ॥ల స్థలము) నందలి **గుంటూరు జిల్లా, నల్లపాడు ఎస్ఆర్‌ఓలో ది.27.07.2006 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.5524/2006 మరియు ది.27.07.2006 నాటి నిర్మాణం కోసం బిల్డర్ అగ్రిమెంట్ రిజిస్టర్డ్ డీడ్ నెం.5526/2006** ప్రకారం **శ్రీ అయిలం కోటేశ్వరరావు, తండ్రి : వీరయ్యకు చెందిన** ఫ్లాట్ నెం.113కు సంబంధించిన యావదాస్తి. **మొత్తం 879.6/9 చ॥గ॥ల స్థలమునకు హద్దులు : తూర్పు :** పంచమర్తి సత్యనారాయణకు చెందిన ఆస్థి (114'-00"), **దక్షిణం :** కేసరి వెంకటేశ్వర్రెడ్డి & ఇతరులకు చెందిన ఆస్థి (76'-00"), **పడమర :** మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు (109'-00"), **ఉత్తరం :** మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు (66'-00").
షెడ్యూల్ 'బి': శ్రీలక్ష్మీ గణపతి టవర్స్-II అపార్ట్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్, బ్లాక్ నెం.3 లోని 1036 చ॥అ॥ల ప్లింత్ ఏరియా ఉమ్మడి సదుపాయాలు, ఉమ్మడి నడక మార్గములు మరియు కార్ పార్కింగ్‌తోగల ఆర్‌సిసి ఫ్లాట్ నెం.113 నకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** మెట్లమార్గము మరియు వరండా, **ఉత్తరం :** శూన్యాకాశము.
ఆస్థి-2 : గుంటూరు, ప్రస్తుతం కొత్త మునిసిపల్ కార్పోరేషన్ ఏరియా, నల్లపాడు గ్రామము కుగ్రామము తురకపాలెం గ్రామ పంచాయతి ఏరియా, నల్లపాడు గ్రామము, డి.నెం.507 లోని 102 చ॥గ॥ల విస్తీర్ణము **గుంటూరు జిల్లా, నల్లపాడు ఎస్ఆర్‌ఓలో ది.28.07.2008 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.3929/2008** ప్రకారం **శ్రీ అయిలం కోటేశ్వరరావు, తండ్రి : వీరయ్యకు చెందిన** ఖాళీ నివాస స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** పొన్నగంటి సాంబయ్యకు చెందిన స్థలము (25'-06"), **దక్షిణం :** పొన్నగంటి సాంబయ్య, పదబక్కల వెంకటేశ్వర్లు, అయిలం హనుమంతరావు మరియు మస్తాన్‌లకు చెందిన ఉమ్మడి బజార్ (46'-00"), **పడమర :** అయిలం మస్తాన్‌రావు, కోటేశ్వరరావు వగైరాలకు చెందిన ఉమ్మడి బజార్ (25'-06"), **ఉత్తరం :** అయిలం చిన మస్తాన్‌రావుకు చెందిన స్థలము (36'-00").
ఆస్థి-3 : ఐటమ్ నెం.1 : గుంటూరు, ప్రస్తుతం కొత్త మునిసిపల్ కార్పోరేషన్ ఏరియా, నల్లపాడు గ్రామము కుగ్రామము, తురకపాలెం గ్రామ పంచాయతి ఏరియా, నల్లపాడు డి.నెం.507 లోని 103 చ॥గ॥ల విస్తీర్ణము **గుంటూరు జిల్లా, నల్లపాడు ఎస్ఆర్‌ఓలో ది.30.07.2010 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.5508/2010** ప్రకారం **శ్రీ అయిలం కోటేశ్వరరావు, తండ్రి : వీరయ్యకు చెందిన** ఖాళీ నివాస స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** అయిలం పుల్లయ్యకు చెందిన స్థలము (21'-06"), **దక్షిణం :** అయిలం రామారావు వగైరాలకు చెందిన స్థలము (40"-00"), **పడమర :** అయిలం పుల్లయ్యకు చెందిన స్థలము మరియు నడక (23'-06"), **ఉత్తరం :** బైరెడ్డి పెద వీరయ్యకు చెందిన ఆస్థి (42'-06").
ఐటమ్ నెం.2 : గుంటూరు, ప్రస్తుతం కొత్త మునిసిపల్ కార్పోరేషన్ ఏరియా, నల్లపాడు గ్రామము కుగ్రామము, తురకపాలెం గ్రామ పంచాయతి ఏరియా, నల్లపాడు డి.నెం.507 లోని 63.5 చ॥గ॥ల విస్తీర్ణము **గుంటూరు జిల్లా, నల్లపాడు ఎస్ఆర్‌ఓలో ది.30.07.2010 నాటి రిజిస్టర్డ్ పార్టిషన్ డీడ్ నెం.5508/2010** ప్రకారం **శ్రీ అయిలం కోటేశ్వరరావు, తండ్రి : వీరయ్యకు చెందిన** ఖాళీ నివాస స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** అయిలం హనుమంతరావుకు చెందిన ఆస్థి (15'-09"), **దక్షిణం :** అయిలం హనుమంతరావుకు చెందిన ఆస్థి (36'-04"), **పడమర :** పంచాయతి బజార్ (15'-09"), **ఉత్తరం :** అయిలం రామారవుకు చెందిన పెంకుటిల్లు (36'-09").
ఐటమ్ నెం.3: గుంటూరు, ప్రస్తుతం కొత్త మునిసిపల్ కార్పోరేషన్ ఏరియా, నల్లపాడు గ్రామము కుగ్రామము, తురకపాలెం గ్రామ పంచాయతి ఏరియా, నల్లపాడు డి.నెం.507 లోని 71.5 చ॥గ॥ల విస్తీర్ణము **గుంటూరు జిల్లా, నల్లపాడు ఎస్ఆర్‌ఓలో ది.30.07.2010 నాటి రిజిస్టర్డ్ పార్టిషన్ డీడ్ నెం.5508/2010** ప్రకారం **శ్రీ అయిలం కోటేశ్వరరావు, తండ్రి : వీరయ్యకు చెందిన** ఖాళీ నివాస స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** ఉమ్మడి నడవ (29'-06"), **దక్షిణం :** అయిలం రామారావుకు చెందిన ఆస్థి (26'-04"), **పడమర :** పంచాయతి బజార్ (21'-00"), **ఉత్తరం :** పంచాయతి బజార్ (25'-00").
ఐటమ్ నెం.1,2 & 3 లు కలుపుకొని మొత్తం 238 చ॥గ॥ల నివాస స్థలము ఆస్తి.
ఆస్థి-4 : గుంటూరు, ప్రస్తుతం కొత్త మునిసిపల్ కార్పోరేషన్ ఏరియా, పెదపలకలూరు గ్రామ డి.నెం.374 లోని 1210 చ॥గ॥ల విస్తీర్ణము **గుంటూరు జిల్లా, నల్లపాడు ఎస్ఆర్‌ఓలో ది.20.04.2011 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.2843/2011** ప్రకారం **శ్రీ అయిలం కోటేశ్వరరావు, తండ్రి : వీరయ్యకు చెందిన** ఖాళీ నివాస స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** సోమిశెట్టి వెంకట సురేష్‌బాబుకు చెందిన స్థలము (129'-06"), **దక్షిణం :** పంచాయతి బజార్ (84"-06"), **పడమర :** జనచైతన్య ప్లాట్ల యొక్క స్థలము (130'-06"), **ఉత్తరం :** అయిలం శ్రీనివాసరావుకు చెందిన భూమి (83'-09").
ఆస్థి-5 : గుంటూరు, ప్రస్తుతం కొత్త మునిసిపల్ కార్పోరేషన్ ఏరియా, నల్లపాడు గ్రామము కుగ్రామము, తురకపాలెం గ్రామ పంచాయతి ఏరియా, నల్లపాడు డి.నెం.500/ఎ & 500/బి లోని 310 చ॥గ॥ల విస్తీర్ణము **గుంటూరు జిల్లా, నల్లపాడు ఎస్ఆర్‌ఓలో ది.01.12.2011 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.11066/2011** ప్రకారం **శ్రీ అయిలం కోటేశ్వరరావు, తండ్రి : వీరయ్యకు చెందిన** ఖాళీ నివాస స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** బైరెడ్డి హనుమంతరావుకు చెందిన భూమి (62'-00"), **దక్షిణం :** సర్కారు రోడ్డు (45'-00"), **పడమర :** 22 అ॥ల వెడల్పు గల రోడ్డు (62'-0"), **ఉత్తరం :** మెట్టు శివరామకృష్ణారెడ్డికి చెందిన ప్లాట్ నెం.8లోని స్థలము (45'-00").
ఆస్థి-6 : గుంటూరు జిల్లా, వట్టిచెరుకూరు మండలం,గారపాడు గ్రామ పంచాయతి ఏరియా, గారపాడు గ్రామ డి.నెం.22/2 లోని ఎ.0.83 సెంట్ల విస్తీర్ణము **గుంటూరు ఎస్ఆర్‌ఓలో రిజిస్టరు కాబడిన ది.19.05.2016 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.5177/2016** ప్రకారం **శ్రీ అయిలం కోటేశ్వరరావు, తండ్రి : వీరయ్యకు చెందిన** ఖాళీ నివాస స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** నిమ్మగడ్డ సీతారామయ్యకు చెందిన భూమి, **దక్షిణం :** కొల్లి వీరారెడ్డికి చెందిన భూమి, **పడమర :** బత్తుల యేసుకు చెందిన భూమి, **ఉత్తరం :** సర్కారు డొంక.
ఆస్థి-7 : గుంటూరు, ప్రస్తుతం కొత్త మునిసిపల్ కార్పోరేషన్ ఏరియా, నల్లపాడు గ్రామ పంచాయతి ఏరియా, నల్లపాడు గ్రామ డి.నెం.685/ఇ1 లోని ఎ.0.28 సెంట్ల విస్తీర్ణములోని **గుంటూరు జిల్లా, నల్లపాడు ఎస్ఆర్‌ఓలో ది.30.07.2010 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.5502/2010** ప్రకారం **శ్రీ అయిలం కోటేశ్వరరావు, తండ్రి : వీరయ్యకు చెందిన** ఖాళీ నివాస స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** బైరెడ్డి చిన వీరయ్యకు చెందిన భూమి, **దక్షిణం :** రైల్వేస్‌కు చెందిన భూమి, **పడమర :** అయిలం కోటేశ్వరరావుకు చెందిన భూమి, **ఉత్తరం :** అయిలం పెదమస్తాన్‌రావుకు చెందిన భూమి, వగైరాలు.
ఆస్థి-8 : ఐటమ్ నెం.1: గుంటూరు, ప్రస్తుతం కొత్త మునిసిపల్ కార్పోరేషన్ ఏరియా, తురకపాలెం గ్రామ పంచాయతి ఏరియా, నల్లపాడు గ్రామ డి.నెం.697 లోని ఎ.0.65 సెంట్ల విస్తీర్ణము **గుంటూరు ఎస్ఆర్‌ఓలో ది.07.07.2014 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.8526/2014** ప్రకారం **శ్రీ అయిలం కోటేశ్వరరావు, తండ్రి : వీరయ్యకు చెందిన** ఖాళీ నివాస స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** తిరుమలశెట్టి కోటయ్యకు చెందిన భూమి, **దక్షిణం :** పసుపులేటి శ్రీనివాసరావుకు చెందిన భూమి, **పడమర :** పసుపులేటి వెంకటేశ్వర్లుకు చెందిన భూమి, **ఉత్తరం :** అయిలం రమాదేవికి చెందిన భూమి.
ఐటమ్ నెం.2: గుంటూరు, ప్రస్తుతం కొత్త మునిసిపల్ కార్పోరేషన్ ఏరియా, తురకపాలెం గ్రామ పంచాయతి ఏరియా, నల్లపాడు గ్రామ డి.నెం.682/ఎ లోని ఎ.0.50 సెంట్ల విస్తీర్ణము **గుంటూరు ఎస్ఆర్‌ఓలో ది.07.07.2014 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.8626/2014** ప్రకారం **శ్రీ అయిలం కోటేశ్వరరావు, తండ్రి : వీరయ్యకు చెందిన** ఖాళీ నివాస స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** పొన్నగంటి వెంకటేశ్వర్లుకు చెందిన భూమి, **దక్షిణం :** పొన్నగంటి సాంబయ్యకు చెందిన భూమి, **పడమర :**పొన్నగంటి వీరాస్వామికి చెందిన భూమి, **ఉత్తరం :** పొన్నగంటి కృష్ణారావుకు చెందిన భూమి.
ఐటమ్ నెం.1&2 లు కలుపుకొని మొత్తం ఎ.1.15 సెంట్ల నివాస ఖాళీ స్థలము ఆస్తి.
ఆస్థి-9 : గుంటూరు, ప్రస్తుతం కొత్త మునిసిపల్ కార్పోరేషన్ ఏరియా, నల్లపాడు గ్రామ పంచాయతి ఏరియా, నల్లపాడు గ్రామ డి.నెం.676 లోని ఎ.0.75 సెంట్ల విస్తీర్ణములోని **గుంటూరు జిల్లా, నల్లపాడు ఎస్ఆర్‌ఓలో ది.28.07.2008 నాటి రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ నెం.3930/2008** ప్రకారం **శ్రీ అయిలం పిచ్చమ్మ, భర్త : వెంకటేశ్వరరావుకు చెందిన** ఖాళీ నివాస స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** తుపాకుల కోటేశ్వరరావుకు చెందిన భూమి, **దక్షిణం :** అయిలం పుల్లయ్యకు చెందిన భూమి, **పడమం :** పొన్నగంటి ఉమాదేవికి చెందిన భూమి, **ఉత్తరం :** అన్నంగి సాంబయ్యకు చెందిన భూమి.
ప్రదేశం : గుంటూరు, తేది : 11-07-2023 **సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యస్‌యమ్ఇ గుంటూరు బ్రాంచి, గుంటూరు.**

చంద్రయాన్ 3 ఇంజినీర్లకు ఏడాదిగా జీతాల్లేవు

- కేంద్ర ప్రభుత్వ నిర్వాకం



న్యూఢిల్లీ : ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్ 3 ప్రయోగంలో భాగస్వాములైన పలువురు ఇంజనీర్లకు, ఇతర సిబ్బందికి దాదాపు సంవత్సరం నుండి జీతాలు అందడం లేదు. సకాలంలో జీతాలిచ్చి తమ కుటుంబాలను ఆదుకోవాలంటూ ఏడాది కాలంగా వారు చేసిన విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగా కూడా పట్టించుకోలేదు. అయినా, ఈ కష్టాలను పక్కన బెట్టి చంద్రయాన్-3లో వారు భాగస్వాములైన తీరును, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఐఎఎస్ న్యూస్ ఏజెన్సీ తాజాగా వెలుగులోకి తీసుకువచ్చింది. ఆ ఏజెన్సీ ఇచ్చిన కథనం 'ది వైర్'తో పాటు వివిధ పత్రికలు, ఛానళ్లలో ప్రసారం కావడంతో చర్చనీయాంశంగా మారింది. అయినా, కేంద్ర ప్రభుత్వంలో ఎటువంటి స్పందన లేకపోవడం గమనార్హం. ఏ రాకెట్ ప్రయోగానికైనా లాంచ్‌ప్యాడ్ అత్యంత కీలకమన్న సంగతి తెలిసిందే. రాంచీలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హెవి ఇంజినీరింగ్ కార్పొరేషన్ (హెచ్ఇసి) చంద్రయాన్-3కి లాంచ్‌ప్యాడ్‌తో పాటు కీలకమైన పలు ఇతర పరికరాలను సరఫరా చేసింది. కేంద్ర ప్రభుత్వ భారీ పరిశ్రమల శాఖ నిర్వహించే ఈ ప్రభుత్వ రంగ సంస్థలోని సిబ్బందికి దాదాపు ఏడాది కాలంగా జీతాలు చెల్లించడం లేదు.

ఈ విషయమై అనేక మీడియా సంస్థల్లో వార్తలు కూడా వచ్చాయి. ఫ్రంట్‌లైన్ సంస్థ గత మే నెలలో ప్రచురించిన కథనం ప్రకారం 2,700 మంది కార్మికులకు, 450 మంది ఎగ్జిక్యూటివ్‌లకు గత 14 నెలలుగా జీతాలు లేవు. ఇస్రోతో పాటు రక్షణ శాఖ, రైల్వే, కోల్ ఇండియా వంటి సంస్థలు రూ.1500 కోట్ల విలువైన ఆర్డర్లు ఆ సంస్థకు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడం లేదు. కనీసం రూ.1,000 కోట్లను వర్కింగ్ కేపిటల్‌గా విడుదల చేయాలని కోరినా ఫలితం లేకుండా పోయింది. 'కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి సాయం అందదు' అంటూ భారీ పరిశ్రమల శాఖ నుంచి సమాధానం వచ్చేది. దీంతో ఆ పనుల్లో కూడా పురోగతి లేదు. జీతాలు కూడా అందకపోవడంతో కుటుంబాలను పోషించడం కూడా హెచ్ఇసి సిబ్బందికి కష్టంగా మారింది. తమను ఆదుకోవాలని పదేపదే విజ్ఞప్తి చేసినా ఫలితం కనిపించలేదు. దీంతో వీరిలో పలువురు తీవ్ర నిరాశలో కూరుకుపోయారని తాజా కథనంలో పేర్కొన్నారు. ఈ కష్టాలన్నీ దిగమింగి చంద్రయాన్-3 ప్రయోగానికి అవసరమైన ల్యాంచ్‌ప్యాడ్‌ను, ఇతర పరికరాలను నిర్ధేశించిన తేదీకన్నా ముందుగానే హెచ్ఇసి సిబ్బంది అందజేశారు. ప్రయోగం విజయవంతం కావడంతో ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తమ మొర ఆలకిస్తుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.

అస్సోం నియోజకవర్గాల పునర్విభజనపై సవాల్

- పది మంది ప్రతిపక్ష నేతల పిటిషన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అస్సోం నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) అనుసరించిన విధానాన్ని సవాలు చేస్తూ అస్సోంలోని పది మంది ప్రతిపక్ష పార్టీల నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ముసాయిదా ప్రతిపాదనను సవాలు చేస్తూ సోమవారం మనోరంజన్ తాలూక్దార్ (సిపిఎం)తోపాటు దేబబ్రత సైకియా, రోకిబుల్ హుస్సేన్ (కాంగ్రెస్), ఘనకాంత చుటియా (టిఎంసి), మహేంద్ర భుయాన్ (ఎన్‌సిపి), మునిన్ మహంత (సిపిఐ), స్వర్ణ హజారికా (ఆర్‌జెడి), అఖిల్ గొగోయ్ (రైజోర్ దళ్), లూరింజ్యోతి గొగోయ్ (అస్సోం జాతీయ పరిషత్), దిగంత కొన్వర్ (అంచలిక్ గణ మోర్చా) సహా తొమ్మిది ప్రతిపక్ష పార్టీలకు చెందిన 10 మంది నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీరి తరపున న్యాయవాది ఫుజైల్ అహ్మద్ అయ్యూబీ పిటిషన్ దాఖలు చేశారు. 1950 ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8ఎని కూడా పిటిషన్ సవాలు చేశారు. దీని ఆధారంగా ఇసిఐ డీలిమిటేషన్ ప్రక్రియను నిర్వహించడంలో తన అధికారాన్ని వినియోగించుకుంటోందని పేర్కొంది. జూన్ 20న జారీ చేసిన ముసాయిదా ఉత్తర్వులతో అస్సోంలోని 126 అసెంబ్లీ, 14 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిని సరిదిద్దుతూ ఇసి చేసిన ప్రతిపాదనలను పిటిషనర్లు సవాలు చేశారు. అతిపెద్ద, అతిచిన్న నియోజకవర్గాల జనాభా మధ్య 33 శాతం వరకు తేడా ఉందని పిటిషనర్లు పేర్కొన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8ఎకి సవాలు విషయానికొస్తే, అస్సోం రాష్ట్రానికి ఈ నిబంధన ఏకపక్షంగా, అపారదర్శకంగా, వివక్షపూరితంగా ఉందని పిటిషనర్లు వాదించారు.

ఎన్‌కౌంటర్లపై ప్రభుత్వానికి నోటీసులు

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ 2021లో అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఆ రాష్ట్రంలో జరిగిన వరుస పోలీస్ ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత పక్షాలకు సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. న్యాయవాది అరిఫ్ మహ్మద్ యాసిన్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై అస్సాం రాష్ట్ర ప్రభుత్వానికి, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు జస్టిస్ ఎస్ రవీంద్ర భట్, జస్టిస్ అరవింద్ కుమార్‌తో కూడిన ధర్మాసనం నోటీసులు జారీచేసింది. ఈ పిటీషన్‌ను జనవరి 27న గౌహతి హైకోర్టు తిరస్కరించింది. ప్రతి ఎన్‌కౌంటర్‌పైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ చేస్తున్నందున మరో విచారణ అవసరం లేదని హైకోర్టు తెలిపింది.

పెరిగిన చైనా వృద్ధి రేటు

బీజింగ్ : ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ ఒత్తిడికి గురైతుంటే మరోవైపు చైనా మాత్రం వృద్ధిని నమోదు చేస్తోంది. ఏడాదికేడాదితో పోల్చితే ప్రస్తుత ఏడాది జూన్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో చైనా ఆర్థిక వ్యవస్థ 6.3 శాతం పెరిగింది. ఇంతక్రితం త్రైమాసికంలో 4.5 శాతం రాణించింది. కరోనా అనిశ్చిత్తి వల్ల గతేడాది ఇదే జూన్ త్రైమాసికంలో జిడిపి 0.4 శాతం పెరిగింది. గడిచిన త్రైమాసికంలో ఆ దేశ ఎగుమతుల్లో తగ్గుదల చోటు చేసుకున్నప్పటికీ.. దేశీయంగా వినిమయం పెరగడంతో జిడిపి పెరిగింది.

రూ.25 వేలు పరిహారం ఇవ్వాలి

- సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ డిమాండ్

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ (ఐఎన్ఎన్)-న్యూఢిల్లీ

వరద బాధిత కుటుంబాల కోసం పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసిన ఐదు రోజులు గడిచిన తరువాత కూడా అక్కడ ఏర్పాట్లు సంతృప్తికరంగా లేవని సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ విమర్శించింది. తగినంత ఆహారం, మంచినీరు, శిశువులు-చిన్నారుల కోసం పాలు, వైద్యం వంటి అత్యవసర సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరింది. అలాగే వరద బాధిత కుటుంబాల కోసం ప్రకటించిన పరిహారాన్ని కనీసం రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేసింది. అలాగే ముందుగా బాధిత కుటుంబాలకు పునరావాసం కల్పించే పనిని ప్రభుత్వ యంత్రాంగం నిర్వర్తించాలి. కుటుంబాలు నష్టపోయిన ఇళ్లు, జీవనోపాధి వంటి వ్యక్తిగత నష్టాలను రెవెన్యూ శాఖ అంచనా వేయాలని, తదనుగుణంగా పరిహారాన్ని అందించాలని సిపిఎం డిమాండ్ చేసింది. రేషన్ కార్డు లేనివారితో సహా బాధిత కుటుంబాలకు ఉచిత రేషన్ లేదా నిత్యావసర వస్తువులతో కూడిన కిట్‌లను ఈ ఏడాది డిసెంబర్ వరకూ అందించాలని కోరింది. అంటువ్యాధుల వ్యాప్తిని ఎదుర్కొవడానికి వరద ప్రభావిత ప్రాంతాల్లో తప్పనిసరిగా వైద్య శిబిరాలు నిర్వహించాలంది.

కేజ్రీవాల్‌కు ఊరట

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా చర్యలు చేపట్టకుండా విధించిన తాత్కాలిక స్టేను సుప్రీంకోర్టు సోమవారం పొడిగించింది. 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కేజ్రీవాల్ ఉత్తరప్రదేశ్‌లో ప్రసంగిస్తూ కాంగ్రెస్‌కు ఓటు వేసిన వారు దేశానికి ద్రోహం చేసినట్లేనని, బిజెపికి ఓటు వేయాలనుకున్న వారిని దేవుడు క్షమించడని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై కేసు నమోదైంది. సుల్తాన్‌పూర్‌లో విచారణా కోర్టు ముందు పెండింగ్‌లో వున్న ఈ క్రిమినల్ కేసు నుంచి తనను విముక్తుడిని చేయడానికి అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ తిరస్కరిస్తూ జారీ చేసిన ఆదేశాలపై కేజ్రీవాల్ సుప్రీంను ఆశ్రయించారు. ఎన్నికల సందర్భంగా భిన్న వర్గాల మధ్య శతృత్వాన్ని పెంపొందించడానికి కేజ్రీవాల్ ప్రయత్నించారంటూ ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 125కింద కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది.

వివి ప్యాట్లపై సమాధానం ఇవ్వాలి

- ఇసికి సుప్రీం ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎంలు), ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వివిపిఎటి) నుంచి లెక్కించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌జిఒ అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర ఎన్నికల కమిషన్ (సిఇసి)ని సుప్రీంకోర్టు సోమవారం కోరింది. యంత్రాల యూనిట్లు ఒకదానితో ఒకటి లెక్కించబడాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం, దాదాపు 2 శాతం కంటే తక్కువ ఇవిఎంల కౌంట్‌లు వివి ప్యాట్‌తో సరిపోలుతున్నాయని ఎడిఆర్ తరపు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. దీనికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. 'మీరు అతిగా అనుమానిస్తున్నారు. సిఇసి ఇప్పటికే ఈ సిస్టమ్‌పై పని చేస్తుందని కచ్చితంగా అనుకుంటున్నాము. గత పిటిషన్ విచారణలో తాము దానిపై పని చేస్తున్నామని కమిషన్ చెప్పింది' అని పేర్కొంది. 2 శాతం కంటే తక్కువ ఇవిఎంలు వివిప్యాట్‌తో సరిపోలుతున్నాయని ప్రశాంత్ భూషణ్ వాదించగా, వాటికి సరిపోలాల్సిన మానవశక్తి అవసరంతో సహా అనేక ఇతర అంశాలను కూడా ఇసిఐ పరిగణనలోకి తీసుకోవాలని కోర్టు పేర్కొంది. భూషణ్ స్పందిస్తూ.. ఇవిఎంలను ట్యాంపర్ చేయడం, హ్యాక్ చేయడం సాధ్యం కాదని తాను నమ్ముతున్నప్పటికీ, వ్యవస్థకు మరింత విశ్వసనీయతను కల్పించడానికి కొన్ని విధానపరమైన మార్పులు అవసరమని అన్నారు. 'వివి ప్యాట్‌ని ఇవిఎంలతో పోల్చాలని మేము కోరుకుంటున్నాము. ఈ పిటిషన్ కాపీని ఎన్నికల సంఘం స్టాండింగ్ కౌన్సెల్‌కు అందజేయండి. వాటిని పరిశీలించేందుకు మూడు వారాల సమయం ఇస్తాం. వారి సమాధానాలు సిద్ధంగా ఉన్నాయని మేము భావిస్తున్నాము' అని ధర్మాసనం తెలిపింది. 2019 నుండి ఇలాంటి పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, తదుపరి విచారణ తేదీలో ఈ పిటిషన్‌లన్నింటినీ కలిపి తీసుకోవచ్చని న్యాయస్థానం తన ఆదేశాలలో పేర్కొంది. 2019 డిసెంబర్‌లో 2019 లోక్‌సభ ఎన్నికల్లో 347 నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపునకు, ఓట్ల సంఖ్యకు మధ్య ఆరోపించిన వ్యత్యాసాలపై విచారణ కోరుతూ ఎడిఆర్, కామన్ కాజ్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించాలని సుప్రీం కోర్టు ఇసిఐని కోరింది. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికలలో డేటాలోని వ్యత్యాసాలను పరిశోధించడానికి పటిష్ట విధానాన్ని రూపొందించడానికి ఇసిఐకి ఆదేశాలు ఇవ్వాలని కోరింది.

7న సుప్రీంలో బిల్కిస్ బానో కేసు విచారణ

న్యూఢిల్లీ : బిల్కిస్ బానో కేసులో యావజ్జీవ శిక్ష పడిన 11మంది దోషులను ముందుగానే విడుదల చేయడానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై ఆగస్టు 7న సుప్రీం విచారణ చేపట్టనుంది. ఈ మేరకు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్వల్ భూయాన్‌లతో కూడిన బెంచ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసిది. ఈ కేసులోని విడుదలైన దోషులకు, ఇతర సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ చేయడం పూర్తయిందని తెలిపింది. నాగరత్న బెంచి ముందుకు ఈ కేసు విచారణకు రావడం ఇది రెండవసారి. జులై 11న మొదటిసారిగా రాగా జులై 17కి వాయిదా వేశారు. జస్టిస్ కె.ఎం.జోసెఫ్ నేతృత్వంలోని గత బెంచ్ ముందు కూడా ఈ కేసు పదే పదే విచారణకు వచ్చింది. విడుదలైన 11మంది తరపు లాయర్లు లేవనెత్తిన పలు అభ్యంతరాల కారణంగా వరుసగా విచారణలు వాయిదా పడుతూ వచ్చాయి. మే 9వ తేదిన చివరిసారిగా అటువంటి విచారణ జరిగింది. ఈ విషయంపై విచారణ జరగాలని వారు కోరుకోవడం లేదంటూ మే 9వ తేదీన జస్టిస్ జోసెఫ్ వ్యాఖ్యానించారు. తాను జూన్ 16న పదవీ విరమణ చేస్తున్నానని, మే 19 తన చివరి వర్కింగ్ డే అని ఈలోగా దీనిపై విచారణ జరుపుతాననుకోవడం లేదని వ్యాఖ్యానించారు.

ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-6లో రక్తహీనత డేటా తొలగింపు

- ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించిన ఐద్వా
- తక్షణమే డేటాను చేపట్టాలని డిమాండ్



న్యూఢిల్లీ : భారతదేశంలో మహిళల్లో, చిన్నారుల్లో రక్తహీనత సమస్య ఎక్కువగానే వుంటుంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్)-5 సర్వే ప్రకారం 57శాతం మంది మహిళలు, 67శాతం పిల్లలు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. ఇంత స్థాయిలో ఈ సమస్య నెలకొని వున్నందున ఇదేదో చాలా చిన్న సమస్య అని కొట్టివేయడానికి వీల్లేదు. ఈ స్థాయి రక్తహీనత ప్రసూతి మరణాలకు, పిల్లల మరణాలకు దోహదపడుతుందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తున్నారు. పిల్లల్లో ఎదుగుదల, అభివృద్ధిని దెబ్బతీసేందుకు కూడా దారి తీస్తుందంటున్నారు. ఇక బాలికలు, మహిళలకు రక్తహీనత వల్ల కలిగే ప్రభావం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో తాజాగా చేపట్టే ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-6 సర్వేలో అనీమియా (రక్తహీనత)కు సంబంధించిన డేటాను సర్వే నుండి ఎత్తివేయాలనే నిర్ణయాన్ని బిజెపి ప్రభుత్వం తీసుకుంది. అంచనా విశ్వసనీయతకు సంబంధించిన సాంకేతిక కారణాలను ఇందుకు సాకుగా చూపుతోంది. సర్వే నివేదికలు చెల్లుబాటవుతాయని ప్రజారోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇదే ప్రాతిపదికన గతంలో సేకరించిన డేటాతో తాజా నివేదికను సరిపోల్చి చూడవచ్చని అంటున్నారు. ప్రాంతాలవారీగా ఇంత వైవిధ్యత వున్న దేశంలో అనీమియా స్థాయిలు కూడా రాష్ట్రాలు, జిల్లాలవారీగా తేడాలుంటాయి. జిల్లాస్థాయిలో విలువైన సమాచారాన్ని ఇవ్వగలిగేది ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ మాత్రమే. అటువంటి కీలకమైన అంశాన్ని సర్వే పరిధి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఐద్వా ఖండన

సర్వే సూచీల నుండి అనీమియాను తొలగించాలన్న నిర్ణయాన్ని ఐద్వా ఖండించింది. దీనివల్ల తీవ్ర పర్యవసానాలు నెలకొంటాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సర్వేలో ఈ అంశాన్నే పరిగణనలోకి తీసుకోకపోతే ఎక్కడ జోక్యం చేసుకోవాలో శాస్త్రీయంగా అంచనా వేసేందుకు కూడా మార్గం వుండదని పేర్కొంది. గతంలో ఈ సమస్యను పరిష్కరించడంలో విఫలమై, భవిష్యత్తులో సమస్యను పరిష్కరించడానికి అవసరమైన చర్యలు చేపట్టడానికి ప్రభుత్వం విముఖంగా వుందని విమర్శించింది. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, సర్వేలో అనీమియా డేటాను చేపట్టడాన్ని పునరుద్ధరించాలని ఐద్వా డిమాండ్ చేసింది.

అదే సమయంలో ప్రభుత్వ ఆహార భద్రతా వ్యూహాల్లో భాగంగా రక్తపుష్టిని కలిగించే బియ్యాన్ని జాతీయ స్థాయిలో ప్రవేశపెట్టడం అనాలోచిత తొందరపాటు చర్య అవుతుందని హెచ్చరించింది. దీనికన్నా ప్రజల్లో గల రక్తహీనత, పోషకాహారం లోపం సమస్యలను పరిష్కరించేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని కోరింది. దీనికి తోడు నిత్యావసరాల ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని ఐద్వా కోరింది.

క్రిమియా బ్రిడ్జి లక్ష్యంగా ఉక్రెయిన్ డ్రోన్ దాడి

ఇరువురు మృతి, ఒకరికి గాయాలు

మాస్కో : క్రిమియా బ్రిడ్జిని లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ డ్రోన్ దాడి జరిపిందని రష్యా జాతీయ తీవ్రవాద నిరోధక కమిటీ (ఎన్ఎకె) సోమవారం ప్రకటించింది. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారు జామున 3గంటలకు ఉక్రెయిన్‌కి చెందిన రెండు మానవరహిత సముద్ర వాహనాలు క్రిమియా ద్వీపాన్ని, రష్యాతో కలుపుతున్న కీలకమైన లింకుపై దాడి చేశాయని ఎన్ఎకె ప్రకటన పేర్కొంది. ఫలితంగా క్రిమియా బ్రిడ్జిలో రోడ్డు భాగం ధ్వంసమైంది, ఇద్దరు పెద్దవారు మరణించగా, ఒక చిన్నారి గాయపడ్డారని ఆ ప్రకటన తెలిపింది. దీనిపై దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టాయని పేర్కొంది. ఉక్రెయిన్ భద్రతా బలగాలు, నావికా దళాలు నిర్వహించిన ఈ దాడిని ప్రత్యేక ఆపరేషన్‌గా ఉక్రెయిన్ మీడియా పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎన్ఎకె ప్రకటన వెలువడింది. ఈ దాడికి తమదే బాధ్యత అని ఉక్రెయిన్ అధికారులు బహిరంగంగా ప్రకటించలేదు. పరోక్షంగా ఈ సంఘటన పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రాంతానికి చెందిన దంపతులు ఈ దాడిలో మరణించారని, వారి కుమార్తె గాయపడిందని బెల్గోరాడ్ గవర్నర్ తెలిపారు.

సోమాలియా ద్వీపకల్పంలో ఆకలి కేకలు

నైరోబీ : ఆఫ్రికాలోని సోమాలియా ద్వీపకల్ప ప్రాంతంలో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. ఈ ప్రాంతంలో అనేక నెలల నుంచి కొనసాగుతున్న కరువు కారణంగా సుమారు 23.4 మిలియన్ల మంది ప్రజలు ఆహార అభద్రతలో ఉన్నారని, దాదాపు 5.1 మిలియన్ల మంది చిన్నారులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని ఐక్యరాజ్య సమితికి చెందిన ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్‌పి) వెల్లడించింది. ఈ ప్రాంతంలో మొత్తంగా 36.6 మిలియన్ల మంది కరువు ప్రభావానికి గురయ్యారని, ఈ ప్రభావాన్ని తగ్గించడానికి 'తక్షణ, దీర్ఘకాలిక చర్యలు' అవసరమని డబ్ల్యూఎఫ్‌పి పేర్కొంది. కరువు కారణంగా ప్రజలు ఆకలి బాధలను ఎదుర్కొనడమే కాకుండా, నిరాశ్రయులయ్యారని కూడా ఆవేదన వ్యక్తం చేసింది. సుమారు 3 మిలియన్ల మంది స్థానభ్రంశం చెందినట్లు అంచనా వేసినట్లు తెలిపింది. వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోవడంతో వాటి ధరలు విపరీతంగా పెరిగిపోయాయని పేర్కొంది. అలాగే ఈ కరువు ప్రభావం సుదీర్ఘకాలం ఉండే అవకాశం ఉందని, ప్రజలు దీని నుంచి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని తెలిపింది. సోమాలియా, కెన్యాలోని నైరుతి భాగాన్ని 'హర్న్ ఆఫ్ ఆఫ్రికా' లేదా సోమాలియా ద్వీపకల్పంగా పేర్కొంటారు. ఇది ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ద్వీపకల్పం.

సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరికి కట్టుబడి వుంటాం

- పునరుద్ఘాటించిన వెనిజులా, క్యూబా

బ్రస్సెల్స్ : వెనిజులా, క్యూబాలను కలిపి వుంచుతున్న సుహృద్భావ సంబంధాలు, సంఘీభావాన్ని ఇరు దేశాల విదేశాంగ మంత్రులు సమీక్షించారు. తమ సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరిని పునరుద్ఘాటించారు. ఇరు దేశాలపై అమెరికా విధిస్తున్న ఆంక్షలను, ఏకపక్ష బలవంతపు చర్యలను వారు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. సోమ, మంగళవారాల్లో జరుగుతున్న సెలాక్ (కమ్యూనిటీ ఆఫ్ లాటిన్ అమెరికా, కరేబియన్ స్టేట్స్), (యురోపియన్ యూనియన్) ఇయుల ప్రభుత్వ, దేశాధినేతల సమావేశంలో పాల్గొనేందుకు ఆదివారం ఇక్కడకు వచ్చిన వెనిజులా, క్యూబా విదేశాంగ మంత్రులు వైవాన్ గిల్, బ్రూనో రొడ్రిగజ్‌లు విడిగా సమావేశమై ఇరు దేశాల సంబంధాలపై చర్చించారు. లాటిన్ అమెరికా దేశాలు, కరేబియా దేశాల మధ్య ఐక్యతకు గల ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. ప్రపంచ ప్రజలకు పూర్తిగా ప్రమాదకారిగా పరిణమించిన అమెరికా గుత్తాధిపత్యాన్ని అంతం చేసేందుకు ఈ రెండూ కలిసి పెద్ద బ్లాక్‌గా ఏర్పడ్డాయని పేర్కొన్నారు. సార్వభౌమాధికార హక్కు, స్వంతంగా నిర్ణయించుకునే హక్కుల ప్రాతిపదికగా మరింత స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో కూడిన ప్రపంచం కోసం పనిచేయడానికి తమ ప్రభుత్వాలు సుముఖంగా వున్నాయని వారు చెప్పారు. ఈ సందర్భంగా క్యూబా అధ్యక్షుడు మిగ్వెల్ డియాజ్ కానెల్‌ను వైవాన్ గిల్ అభినందించారు. ప్రజా ప్రయోజనాలకు మిత్రుడని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. సెలాక్, ఇయు సమావేశాలకు హాజరయ్యేందుకు వెనిజులా ఉపాధ్యక్షులు డెల్సీ రొడ్రిగజ్ ఆదివారమే బ్రస్సెల్స్ చేరుకున్నారు. సమానుల మధ్య గౌరవ సంబంధాలు వుండాలని బొలివారియన్ శాంతి దౌత్యం పేర్కొంటోందని రొడ్రిగజ్ వ్యాఖ్యానించారు.

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు

ఆఫ్రికన్ నేతల పిలుపు

నైరోబి : అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ ఆఫ్రికన్ నేతలు పిలుపునిచ్చారు. ఆఫ్రికన్ యూనియన్ సమన్వయ సదస్సును ఆదివారం ఇక్కడ ప్రారంభించారు. సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు ఆర్థిక విలీనంపై చర్చించారు. కోవిడ్ మహమ్మారి వల్ల తలెత్తిన ఆర్థిక, సామాజిక ప్రభావాల వల్ల అనూహ్యమైన సంక్షోభాలు ఇంకా ప్రపంచ దేశాల్లో కొనసాగుతుండగా, ఆఫ్రికా ఖండం మరింత ఎక్కువగా ఇబ్బందులు పడుతోందని ఐక్యరాజ్య సమితి డిప్యూటీ సెక్రటరీ జనరల్ అమీనా మహ్మద్ పేర్కొన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనే కార్యాచరణ ప్రణాళికకు నిధులు సమకూరుస్తామని అంతర్జాతీయ సమాజం ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదని ఆమె విమర్శించారు. పైగా మానవతా సాయం కూడా అరకొరగానే వుండడంతో 2063 ఎజెండాను అమలు చేసేందుకు ఆఫ్రికా దేశాలు, నేతలు చేస్తున్న కృషికి తీవ్రంగా అవరోధాలు ఎదురవుతున్నాయని అన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ద్వారా తమ ఆర్థిక వ్యవస్థలకు అదనపు వనరులు కేటాయించాలని ఆఫ్రికన్ నేతలు పిలుపునిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి కూడా ఈ పిలుపును పునరుద్ఘాటించిందని ఆమె చెప్పారు.

మునుగుతున్న చదువులు

(మొదటి పేజీ తరువాయి)

భయంతో విద్యార్థులు వణికిపోతున్నారు.

గిరిజన మాతృ భాషలో బోధనపై చిత్తశుద్ధి కరువు

గిరిజన ప్రాంతాల్లోని ఆదివాసీలకు వారి మాతృభాషలో విద్యా బోధనపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించింది. తూర్పు ఏజెన్సీ మండలాల్లో కోయ తెగకు చెందిన అత్యధిక మంది విద్యార్థులు ఉన్నారు. వారికి మాతృభాషలో పాఠ్యపుస్తకాలు అందించడంతోపాటు బోధించేందుకు వలంటీర్లను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమై నెల గడిచినా ఇప్పటికీ మాతృభాషా వలంటీర్లను ప్రభుత్వం రెన్యువల్ చేయలేదు. దీంతో, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

పాఠశాలలు, డ్రాపౌట్స్ వివరాలు ఇలా..

మండలం	ప్రైమరీ	అప్పర్‌ప్రైమరీ	హైస్కూల్స్	మొత్తం	విద్యార్థుల సంఖ్య	డ్రాపౌట్స్
ఎటపాక	80	2	9	91	4730	45
కూనవరం	53	4	6	63	3253	27
చింతూరు	88	6	12	106	6083	633
విఆర్.పురం	45	5	4	54	2837	387
	266	**17**	**31**	**314**	**16903**	**1092**

టిఎంసితో ఎలాంటి పొత్తు ఉండదు

- బెంగాల్‌లో ఆ రెండు పార్టీలపైనే పోరు
- సంఖ్య పెంచుకోవడానికి బిజెపి పాట్లు : ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తు ఉండబోదని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యత కోసం ప్రతిపక్ష పార్టీలు సమావేశాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో, బెంగాల్‌లో టిఎంసితో కలుస్తారా అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సీతారాం ఏచూరి పై విధంగా బదులిచ్చారు. వామపక్షాలు, కాంగ్రెస్‌తో పాటు లౌకిక పార్టీలు బిజెపిని ఒంటరిపాటు చేసి ఓడించేందుకు కృషి చేస్తూనే, టిఎంసిని కూడా ఎదుర్కొంటాయని తెలిపారు. టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ, ఇతర నేతలు హాజరయ్యే రెండు రోజుల సమావేశ వేదిక వద్ద విలేకరులతో మాట్లాడిన ఏచూరి 2004లో యుపిఎ-1 ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తీరును వివరించారు. "ప్రతి రాష్ట్రంలోనూ పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో బిజెపికి ప్రయోజనం చేకూర్చే ఓట్ల విభజన తక్కువగా ఉండేలా చూడడమే మా ప్రయత్నం. ఇది కొత్త విషయం కాదు. 2004లో వామపక్షాలకు 61 సీట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించి 57 గెలిచాం ఆ తరువాత మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఏర్పడి 10 సంవత్సరాలు నడిచింది" అని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాలు, కాంగ్రెస్‌తో పాటు లౌకిక పార్టీలు బిజెపి, టిఎంసిలకు వ్యతిరేకంగా పోరాడతాయని ఆయన అన్నారు. ఇది ఏ రూపంలో ఉంటుందో తర్వాత నిర్ణయించబడుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఇటీవల ముగిసిన పంచాయతీ ఎన్నికల్లో వామపక్షాలను, కాంగ్రెస్‌నే టార్గెట్‌గా పెట్టుకుని తృణమూల్ హింసాత్మక దాడులకు దిగిందని ఆయన విమర్శించారు.

బిజెపితో పాటు 31 పార్టీలు ఉన్నాయని వాదిస్తున్నందుకు ఏచూరి ఈశాన్య రాష్ట్రాల్లోని అతిపెద్ద పార్టీలు, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), అకాలీదళ్‌తో కలిసి లేవని అన్నారు. ఇప్పుడు వారు తమ సంఖ్యను పెంచుకోవడానికి చిన్న పార్టీలను తమవైపు లాక్కొనేందుకు వెతకని చోటు లేదని ఏచూరి దెప్పిపొడిచారు. ప్రధాని మోడీకి ప్రతిపక్షాల ప్రధాని అభ్యర్థి ఎవరు అనే ప్రశ్నకు ఏచూరి సమాధానం ఇస్తూ 2004లో ప్రతిపక్షాలు ప్రధాని అభ్యర్థిని ప్రకటించకపోయినా అటల్ బిహారీ వాజ్‌పేయిని ఓడించిన విషయాన్ని మరచిపోరాదన్నారు. "ప్రతిపక్షాల ఐక్యత 2004 ఎన్నికల్లో లాంటిది.

అమెరికాతో దోస్తీ పటిష్టం

- యెలెన్‌తో నిర్మలా సీతారామన్ చర్చలు


గాంధీనగర్ : ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా పర్యటన నుంచి వచ్చిన వారం రోజులకే ఈ రెండు దేశాల ఆర్థిక మంత్రులు భేటీ అయ్యారు. మోడీ పర్యటనలో కుదుర్చుకున్న ఒప్పందాలకు కార్యరూపం ఇచ్చేందుకు జి-20 ఆర్థిక మంత్రుల సమావేశం సందర్భంగా వీరిరువురూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.. సెప్టెంబరులో జరిగే జి-20 శిఖరాగ్ర సదస్సుకు సన్నాహంగా సోమవారం నాడిక్కడ జరిగిన ఆర్థిక మంత్రుల సమావేశం వాతావరణ మార్పులపైనా దృష్టి సారించినట్లు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఇంధన పరివర్తనా క్రమానికి అవసరమైన నిధుల సమీకరణకు మార్గాలు అన్వేషించాలని జి 20 ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ల సమావేశం నిర్ణయించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, తెలిపారు. అమెరికాతో బంధాన్ని మరింత పరిపుష్టం చేసుకోవాలని భావిస్తున్నట్లు సీతారామన్ పేర్కొన్నారు. పునర్వినియోగ ఇంధన రంగంలో పెట్టుబడుల కోసం ప్రత్యామ్నాయ వేదికల ద్వారా కృషి చేస్తున్నామని చెప్పారు.

శరద్ పవార్‌తో అజిత్ పవార్ రెండో భేటీ

ముంబయి : ఎన్‌సిపి చీఫ్ శరద్‌పవార్‌తో సమావేశమైన 24 గంటల వ్యవధిలోనే మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ సోమవారం మరోసారి ఆయనతో సమావేశమయ్యారు. ఆదివారం సమావేశంలో పాల్గొనలేకపోయిన కొంతమంది అజిత్ పవార్ గ్రూపు ఎమ్మెల్యేలు సోమవారం సమావేశంలో పాల్గొన్నారు. శరద్‌పవార్ ఆశీర్వాదం కోసం వచ్చామని ప్రఫుల్ పటేల్ తెలిపారు. ముంబయిలోని వైబి చవాన్ సెంటర్‌లో ఈ సమావేశం జరిగింది. అప్పుడు అజిత్ వెంట కొంత మంది ఎమ్మెల్యేలు లేరు. సోమవారం జరిగిన రెండో సమావేశంలో కూడా ఎన్‌సిపిని ఐక్యంగా ఉంచాలని శరద్‌పవార్‌ను కోరినట్లు భేటీ అనంతరం ప్రఫుల్ పటేల్ మీడియాకు తెలిపారు. శరద్‌పవార్ తమ మాటలను శ్రద్ధగా విన్నారని, నిన్నటి మాదిరిగానే ఎలాంటి ప్రతిస్పందన ఇవ్వలేదని చెప్పారు. మంగళవారం ఢిల్లీలో బిజెపి నేతృత్వంలో జరిగే ఎన్‌డిఎ సమావేశానికి తాను, అజిత్ పవార్ హాజరవుతామని ప్రఫుల్ పటేల్ తెలిపారు. సోమవారం సమావేశంలో తమపై వేసిన అనర్హత పిటిషన్ గురించి శరదపవార్‌తో అజిత్ పవార్ చర్చించినట్లు సమాచారం. ఎన్‌డిఎలోకి చేరాలని కూడా శరద్‌పవార్‌ను ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఎన్‌సిపిలో నుంచి చీలిపోయిన అజిత్ గ్రూపు ఎమ్మెల్యేలు ఏక్‌నాథ్ షిండే మంత్రివర్గంలో చేరిన సంగతి తెలిసిందే. మరోవైపు బెంగళూరులో జరుగుతున్న ప్రతిపక్ష పార్టీల సమావేశానికి సోమవారం శరద్‌పవార్ హాజరుకాలేదు.

డాక్టర్ సమరానికి స్వర్ణపతకం ప్రదానం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ (విజయవాడ)



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సమరం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్‌టిఆర్ జిల్లా చైర్మన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సమరం సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సమావేశం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సేవా అవార్డు కింద డాక్టర్ సమరానికి స్వర్ణ పతకం ప్రదానం చేశారు. రెడ్‌క్రాస్ ద్వారా చేసిన సామాజిక సేవలకు, ముఖ్యంగా కరోనా సమయంలో ఆయన చేసిన అద్వితీయమైన సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ అవార్డును అందజేశారు.

నేరుగా మాకే ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

విజ్ఞప్తి చేశారు. కార్యదర్శి కృష్ణమోహన్ మాట్లాడుతూ.. సర్పంచులు గ్రామాల్లో పనులు చేయలేని స్థితిలోకి వెళ్లారని పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులమైనా ఏమీ చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. దీనిపై సిఎంఒ అధికారులను కూడా కలిశామని, నిధులు ఒకట్రెండు రోజుల్లో విడుదల చేస్తామని తెలిపారని పేర్కొన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సర్పంచులు ఎం సాంబశివరావు, అశోక్‌కుమార్, జైరామ్‌రెడ్డి, ఎం శ్రీనివాసరావు, సాంబశివరావు, బొజ్జన్న, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

13.5 కోట్ల మంది పేదరికం నుంచి అవుట్!

(మొదటి పేజీ తరువాయి)

నుంచి 19.28 శాతానికి వేగంగా క్షీణించింది. పట్టణ ప్రాంతాల్లో పేదరికం 8.65 శాతం నుంచి 5.27 శాతానికి తగ్గింది.

పేదల సంఖ్యలో అతిపెద్ద క్షీణత ఉత్తరప్రదేశ్‌లో నమోదైంది. 3.43 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, 707 అడ్మినిస్ట్రేటివ్ జిల్లాలకు పేదరికం అంచనాల్లో ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్ రాష్ట్రాల్లో పేదల నిష్పత్తిలో అత్యంత వేగంగా తగ్గుదల ఉన్నట్టు నివేదిక పేర్కొంది.

ఐదేళ్లలో ఎంపిఐ విలువ 0.117 నుండి 0.066కి తగ్గింది. పేదరికం తీవ్రత 47 శాతం నుండి 44 శాతానికి తగ్గింది. పారిశుధ్యం, పోషకాహారం, వంట ఇంధనం, ఆర్థిక సమ్మేళనం, తాగునీరు, విద్యుత్‌ను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి సారించడం ఈ రంగాల్లో పురోగతికి దారితీసిందని నీతి ఆయోగ్ పేర్కొంది. ఎంపిఐ మొత్తం 12 పారామీటర్ల గుర్తించదగిన మెరుగుదలను చూపించాయని తెలిపింది. పేదరికాన్ని తగ్గించడంలో పోషకాహారంలో మెరుగుదల, పాఠశాల విద్య, పారిశుధ్యం, వంట ఇంధనం ముఖ్యమైన పాత్ర పోషించాయని పేర్కొంది.

ఎపిలో 30.19 లక్షల మంది ...

ఆంధ్రప్రదేశ్‌లో (2015-16, 2019-21 మధ్య) ఐదేళ్లలో 30,19,718 మంది పేదరికం నుంచి బయటపడ్డారు. 2015-16లో 11.77 శాతం నుంచి 2019-2021లో 6.06 శాతానికి అంటే 5.71 శాతం పేదరికం తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం 14.72 శాతం నుంచి 7.71 శాతానికి వేగంగా క్షీణించింది. అదే సమయంలో, పట్టణ ప్రాంతాల్లో పేదరికం 4.63 శాతం నుంచి 2.20 శాతానికి తగ్గింది.



మీకోసం

పిల్లలకు కాల్షియం సంవృద్ధిగా అందాలంటే ప్రతిరోజూ ఉదయం అర చెంచా, సాయంత్రం అర చెంచా నువ్వులను నమిలి తినేలా అలవాటు చేయాలి.

జీవన సౌరభం

మూఢ విశ్వాసాలను, హేతువాదానికి నిలబడని వాదనలను నమ్మకూడదు. సమాజం చైతన్యవంతం కావాలంటే కాలానుగుణంగా సాగిపోవాలి.

అడవిలో దెయ్యం



వనపర్తి ఊరికి దగ్గరలో పెద్ద అడవి ఉంది. ఆ ఊరి ప్రజలు వంట కోసం కట్టెలు తేవడానికి, పశువులను మేపడానికి, అడవిలో దొరికే పండ్లు తెచ్చుకోవడానికి రోజూ అడవికి వెళ్లేవారు. ఒక రోజు ఒక బాటసారి ఆ అడవిగుండా వస్తున్నప్పుడు అడవిలో గణగణమంటూ శబ్దం వినిపించింది. అది దెయ్యం పనే అనుకొని, పరిగెత్తుకుంటూ వచ్చి ఆ విషయాన్ని ఊర్లో అందరికీ చెప్పాడు.

నిజమా, కాదా అని కొంతమంది అడవికి దగ్గరగా వెళ్లారు. వారికి కూడా గణగణ శబ్దం వినబడింది. దాంతో వారు అడవిలో నిజంగానే దెయ్యం ఉందని నమ్మారు. అప్పటి నుంచి ఆ ఊరివాళ్లు అడవిలోకి వెళ్ళటం మానేశారు. వంటకు కట్టెలు లేక, పనులు లేక అనేక బాధలు పడ్డారు. దీంతో గ్రామస్తులందరూ ఆ ఊరి పెద్ద వద్దకు వెళ్లి, తమ సమస్యను చెప్పుకున్నారు.

అడవిలో దెయ్యం ఉండడం ఏమిటి? గ్రామస్తులు ఊరకే ఎందుకు భయపడుతున్నారు? దీనికి పరిష్కారం ఏమిటి? అని ఆలోచించాడు. "ఎవరైనా అడవిలోకి వెళ్లి ఆ శబ్దం ఎక్కడి నుంచి వస్తుందో కనుక్కోండి. అలా చేసిన వారికి మంచి బహుమతి ఇస్తాం." అని చాటింపు వేయించాడు.

దెయ్యం ఉందని భయపడి అడవిలోకి వెళ్ళడానికి ఎవరూ సాహసించలేదు. ఒక బాలిక మాత్రం దయ్యాలు అనేవి ఉండవని నమ్మి, ధైర్యంగా అడవిలోకి వెళ్లింది. అక్కడ తనకు గణగణమనే శబ్దం వినిపించింది. ఆ శబ్దం ఏ వైపు నుంచి వస్తుందో గమనించి అటువైపు వెళ్లింది. అక్కడ ఒక కోతుల గుంపు గుడిలో కొట్టే గంటతో ఆడుతూ ఉన్నాయి. ఆ కోతులు అడవికి దగ్గరలో ఉన్న గుడి నుంచి ఆ గంటను తీసుకువచ్చాయని బాలిక గ్రహించింది.

తన వద్ద ఉన్న రొట్టెలను కోతులకు కనిపించేలా దూరంగా విసిరింది. వాటిని తినటానికి కోతులన్నీ గంటను వదిలి పెట్టి, రొట్టెల వద్దకు చేరిపోయాయి. వెంటనే ఆ బాలిక గంటను తీసుకొని, ఊళ్లోకి వచ్చింది. తాను గ్రహించిన విషయాన్ని ఊరి పెద్దకు, గ్రామస్తులకు చెప్పింది. దెయ్యం ఉందని తాము నమ్మినందుకు గ్రామస్తులు సిగ్గుపడ్డారు. గ్రామ పెద్ద బాలిక ధైర్యానికి మెచ్చుకొని, మంచి బహుమతులు అందజేశాడు.

- దారవేణి రిచిత,
8వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
నర్సింహుల పల్లి.

1. బియ్యం R ◯ ◯ E
2. పోటీ R ◯ ◯ E
3. రోజా పువ్వు R ◯ ◯ E
4. తాడు R ◯ ◯ E
5. పండిన R ◯ ◯ E

ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని తెలుగు మాటలు ఇచ్చాం. వాటికి ఎదురుగా సరైన అర్థాన్ని ఇచ్చే ఇంగ్లీషు మాటలు ఉన్నాయి. ఖాళీ గడులను పూరిస్తే.. ఆ పదాలు వస్తాయి. ట్రై చేయండి మరి!

నేను గీసిన బొమ్మ

సిహెచ్ జాహ్నవి,
9వ తరగతి,
అవనిగడ్డ ప్రభుత్వ పాఠశాల,
కృష్ణా జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అమ్మాయిల కోసం స్కేట్ ఇండియా..



'అమ్మాయిలు అన్నింటిలోనూ ముందుంటున్నారు.. చదువులోనూ, ఆటల్లోనూ హవా కొనసాగిస్తున్నారు..' అంటూ ఆడపిల్లల గురించి చాలామంది భావిస్తుంటారు. కాని కొన్ని క్రీడల వైపు ఆడపిల్లలు కన్నెత్తి కూడా చూడడం లేదు అంటున్న ప్రముఖ స్కేట్ బోర్డర్ అటితా వర్గీస్ 21 ఏళ్ల వయసులోనే 2015 నుండి 'గర్ల్స్ స్కేట్ ఇండియా' పేరుతో స్కేటింగ్ క్రీడలో అమ్మాయిలను, మహిళలను ప్రోత్సహించే లక్ష్యంతో ఆన్‌లైన్ కమ్యూనిటీని నిర్వహిస్తున్నారు.

బెంగుళూరుకు చెందిన అటితా 'నేను స్కేటింగ్ నేర్చుకునేటప్పుడు ఆట మీద దృష్టి పెట్టి సాధన చేశాను. మగపిల్లలతో కలిసి శిక్షణ తీసుకునేదాన్ని. అయితే కొద్ది కాలానికి నా చుట్టూ వున్న వాళ్లను గమనించడం మొదలుపెట్టాను. మా బృందంలో నేను ఒక్కదాన్నే అమ్మాయిని. చాలా కాలం నుండి నేనొక్కదాన్నే ఉన్నాను. ఈ పరిస్థితి ఒక్కోసారి నన్ను ఒంటరిపాటుకు గురిచేసేది. ఎంతో ఒత్తిడితో ఉండేదాన్ని' అంటూ తన ప్రయాణం తొలి రోజులను గుర్తుచేసుకున్నారు. మన దేశంలో ఎంతోమంది స్కేట్‌బోర్డర్లు ఉన్నారు. అటితా మొదటిసారి నేర్చుకున్న అమ్మాయీ కాదు. ఆమెకు ముందు చాలామందే ఉన్నారు. కానీ అటితా ప్రత్యేకమైన వ్యక్తి. తనతో పాటు మరింత మంది అమ్మాయిలను ఈ ఆటవైపు తీసుకురావాలని శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఆమె ప్రతిభ గురించి ఒక్కమాటలో చెప్పాలంటే అమెరికాకు చెందిన స్కేట్‌బోర్డర్ షూ ఉత్పత్తిదార కంపెనీ అటితాకు స్కేటింగ్ షూ స్పాన్సర్ చేస్తోంది. ఈ అవకాశం దక్కించుకున్న దేశంలోనే ఏకైక స్కేట్ బోర్డర్ ఆమె.

స్వేచ్ఛగా.. సృజనాత్మకంగా ..

బాల్యం నుండే ఆటలంటే ఆసక్తి చూపించే అటితాకి, స్కూలు తరపున పలు జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొన్న అనుభవం ఉంది. 19 ఏళ్ల వయసప్పుడు తన స్నేహితుల ద్వారా ఆమెకి స్కేటింగ్ పరిచయమైంది. 'మొదటిసారి స్కేట్ బోర్డర్‌పై కాలు పెట్టినప్పుడు నేను దాన్ని చాలా ఇష్టపడ్డాను. స్వేచ్ఛగా కదులుతూ సృజనాత్మకంగా ఆడే క్రీడగా ఇది నన్ను తెగ ఆకర్షించింది. అప్పటి నుండి నేను వెనక్కు తిరిగి చూడలేదు' అంటున్న అటితా 2013లోనే మొట్టమొదటి ఉచిత స్కేట్ పార్క్‌ని నిర్మించడంలో సహాయం చేసింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఆమె ఆధ్వర్యంలో పదికి పైగా స్కేట్ పార్క్‌లు నిర్మించారు.

ఆన్‌లైన్ వేదికగా..

'ఈ క్రీడవైపు ఆడపిల్లలను రప్పించడం కోసమే 2015 నుండి 'గర్ల్స్ స్కేట్ ఇండియా'ను ప్రారంభించాను. నేనొక్కదాన్నే స్కేటింగ్ చేస్తే ప్రయోజనమేముంది. ఎక్కువమంది అమ్మాయిలు ఈ క్రీడలోకి రావాలి. అదే నా లక్ష్యం.





ఈ ప్రయాణంలో నేను విజయం సాధిస్తున్నాను' అంటూ గర్వంగా తన ఆన్‌లైన్ కమ్యూనిటీ గురించి చెబుతున్నారు. సోషల్‌మీడియా వేదికలో నిర్వహించే ఈ కమ్యూనిటీ పేరుతో పోస్టు చేసిన ఇన్‌స్టా వీడియోలు చూస్తే అటితా సాధించిన ఘనత మనకు అర్థమవుతుంది.

మాలాంటి వారికి రోల్ మోడల్..

'నేను 2018లో బెంగుళూరులో జరుగుతున్న స్కేటింగ్ కాంపిటీషన్‌కు హాజరయ్యాను. అక్కడ అటితాను కలిశాను. ఆటలో ఎన్నో మెలకువలు చెప్పింది. స్ట్రీట్ స్టైల్ స్కేటింగ్‌లో ట్రిక్స్ నేర్పించింది. ఆమె ఓ గొప్ప క్రీడాకారిణిగానే కాదు, ఎంతోమంది మహిళలను తీర్చిదిద్దుతూ నాలాంటి వారికి రోల్ మోడల్‌గా నిలుస్తున్నారు' అంటూ అటితా గురించి గొప్పగా చెబుతున్నారు పూణెకి చెందిన స్కేట్ బోర్డర్ శ్రద్ధ గైక్వాడ్.

మగరాయుడి వేషమన్నారు..

'ఎప్పుడైనా.. ఎక్కడైనా ఆడపిల్లలు క్రీడలవైపు రావాలంటే ఎన్నో అడ్డంకులు అధిగమించాలి. అమ్మానాన్న నన్ను ఆటలవైపు ప్రోత్సహించినా సమాజంలో ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదురయ్యాయి. జుట్టు కత్తిరించుకున్న నన్ను చూసి చాలామంది నువ్వు అమ్మాయివా.. అబ్బాయివా అని ముఖం మీదే అడిగేవాళ్లు. ఒకసారి ఒకతను.. నువ్వు ఈ మగరాయుడి వేషం మానేసి, అమ్మాయిలా జుట్టు పెంచు, వాళ్లు ధరించే బట్టలు వేసుకో.. అలా ఉంటేనే నిన్ను చూసైనా మరింతమంది అమ్మాయిలు ఇటువైపు వస్తారని చెప్పాడు. ఈ జనాలకి అమ్మాయిల శక్తిసామర్థ్యాలు కనిపించవు. వాళ్ల దుస్తులు, అలంకరణే గుర్తుకొస్తుంది. స్కేట్ బోర్డర్‌గా అమ్మాయిలు రాణించడం కూడా వీళ్లకి ఇష్టం ఉండదు. అందుకే చెత్త కామెంట్లు చేస్తుంటారు' అంటూ గతంలో తనకెదురైన అనుభవాన్ని చెబుతున్న అటితా దేశవ్యాప్తంగా ఉచితంగా పలు స్కేట్‌బోర్డింగ్ వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు.

ఈ ప్రయాణం కొనసాగుతుంది..

స్కేటింగ్‌లో నైపుణ్యం సాధించాలంటే ఎగుడుదిగుడుగా ఉండే వివిధ ఉపరితలాల్లో, వీధుల్లో సాధన చేయాలి. కాని మన దేశంలో అటువంటి అవకాశాలు తక్కువ. స్కేట్ పార్కుల కొరత ఎక్కువగా ఉంది. నాలాంటి వారు చేస్తున్న కృషి ఫలితంగా ఇప్పుడిప్పుడే స్కేటింగ్‌వైపు అమ్మాయిలు వస్తున్నారు. ఇది చాలదు. మున్ముందు మరిన్ని ప్రయోజనాల దిశగా మా ప్రయాణం కొనసాగించాలి' అంటూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు అటిత.

జానపదం కదిలింది.. కలెక్టరేట్ హోరెత్తింది...

సమస్యలు పరిష్కరించాలని కళాకారుల వినూత్న ఆందోళన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

కాళ్లకు గజ్జలు, చేతిలో డప్పులు, కోలాట కర్రలు, చెక్క భజన చెక్కలు, పిల్లన గ్రోవులతో పల్లెల నుండి జానపద కళాకారులు చిత్తూరు కలెక్టరేట్‌కు సోమవారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమ కళా రూపాలను ప్రదర్శిస్తూ వినూత్న రీతిలో అక్కడ చేపట్టిన ఆందోళనతో పరిసరాలు హోరెత్తాయి. ప్రభుత్వం తమకు గుర్తింపు కార్డు, పింఛను మంజూరు చేయాలని, తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి), కాణిపాకం, శ్రీకాళహస్తి, ఇతర దేవాలయాల్లో నిర్వహించే బ్రహోత్సవాల్లో తమ కళలను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించాలని, జానపద కళలను బతికించాలని నినాదాలు చేశారు. జానపద వృత్తి కళాకారుల సంఘం పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం తమ సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వీరిలో చెక్క భజనలు, పండరి భజనలు, కులుకు భజనలు, కోలాటం, పిల్లన గ్రోవి సంప్రదాయ గ్రామీణ నృత్యాలు, పాటలతో సంప్రదాయ జానపదానికి జీవం పోస్తున్న కళాకారులు ఉన్నారు. కలెక్టరేట్ వద్ద ధర్నాలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు మురళి మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకీ జానపద కళలు కనుమరుగవుతున్నాయని తెలిపారు. వాటిని కాపాడాల్సిన పాలకులు, అధికారులు ఏ మాత్రమూ పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సంఘం ఆధ్వర్యంలో గతంలో చేసిన అనేక పోరాటాల ఫలితంగా గుర్తింపు కార్డులు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి కూడా ఇప్పటివరకు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. స్థానికంగా ఉన్న ఆలయాల్లో స్థానిక కళాకారులకు అవకాశం కల్పించి కళాకారులను ఆదుకోవాలని, కళాకారులకు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కళాకారుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో టిటిడి ప్రతిష్టను పెంచుతున్న జానపద వృత్తి కళాకారుల సమస్యలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లాలో గతంలో 50 రకాల కళలు ఉండేవని, కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో నేడు 15 మాత్రమే ఉన్నాయని తెలిపారు. జానపద నృత్య కళాకారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సురేంద్రన్, అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్ర, రవికుమా ర్, వందలాది మంది జానపద కళాకారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద చెక్క భజన చేస్తున్న కళాకారులు


'ఉస్తాద్ భగత్ సింగ్'కు బ్రేక్..!



పవన్ కళ్యాణ్ నటిస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'కు బ్రేక్ పడినట్లుగా సమాచారం. డైరెక్టర్ హరీష్ శంకర్ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. గతంలో గబ్బర్ సింగ్ సినిమాతో హరీష్ శంకర్ హిట్ కొట్టిన విషయం విదితమే. పవన్ కళ్యాణ్ 'ఓజీ' సినిమాలో నటిస్తూనే రాజకీయాల్లో కూడా బిజీగా ఉన్నారు. హిందీలో అజయ్ దేవగన్ నటించిన 'రైడ్' సినిమా సూపర్ హిట్ అయ్యింది. ఈ సినిమాని రవితేజతో హరీష్ శంకర్ రీమేక్ చేయబోతున్నట్లుగా సమాచారం.

యాక్షన్ సన్నివేశాల్లో 'దేవర'

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న రెండో సినిమా ఇది. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జాన్వీ కపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు.



'జవాన్' నయనతార

అట్లీ కుమార్, షారుక్ ఖాన్ కాంబినేషన్‌లో వస్తున్న 'జవాన్' చిత్రం నుండి తాజాగా నయనతార లుక్‌ని విడుదల చేశారు. 20 ఏళ్ల కెరియర్లో నయన్ నేరుగా చేసిన బాలీవుడ్ సినిమా ఇది. షారుక్ ఖాన్ సొంత బ్యానర్లో నిర్మితమైన ఈ చిత్రంలో ఆయన ద్విపాత్రాభినయం చేస్తున్నారు. నయనతార కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. సెప్టెంబర్ 7వ తేదీన ఈ సినిమా విడుదల కానుంది.

గుంటూరు కారంలో మీనాక్షి చౌదరి



మహేశ్ బాబుతో త్రివిక్రమ్ హ్యాట్రిక్ మూవీగా తెరకెక్కిస్తున్న చిత్రం 'గుంటూరు కారం'. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. హీరోయిన్ మీనాక్షి చౌదరి ఈ చిత్రంలో సెకండ్ హీరోయిన్ పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాలో కథానాయికలుగా మొదట పూజా హెగ్డే, శ్రీలీలను ఎంపిక చేశారు. అయితే కొన్ని కారణాల వల్ల ఈ ప్రాజెక్ట్ నుంచి పూజా హెగ్డే బయటకు వెళ్లింది. శ్రీలీల మెయిన్ హీరోయిన్‌గా ఉన్నారు. రెండో హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి తీసుకున్నట్లుగా కొంతకాలంగా ఊహాగానాలు కొనసాగుతున్నాయి. అయితే ఈ విషయంపై చిత్రబందం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. తాజాగా 'హత్య' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న మీనాక్షి చౌదరి తాను గుంటూరు కారంలో నటిస్తున్నట్లుగా చేసిన ప్రకటించింది. ఇప్పటికే ఒక షెడ్యూల్ పూర్తయ్యిందన్నారు. 'ఇచ్చట వాహనములు నిలుపరాదు'తో తెలుగు తెరకు పరిచయమై, తొలి ప్రయత్నంలోనే ఆకట్టుకుంది మీనాక్షి చౌదరి. ఆ తర్వాత 'హిట్ 2', 'కిలాడి' చిత్రాల్లో సందడి చేసింది.

సెమీస్‌కు భారత్-ఎ

అర్ధ సెంచరీలతో మెరిసిన ఓపెనర్లు
నేపాల్-ఏపై తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపు
ఎమర్జింగ్ ఆసియా కప్



కొలంబో: ఎమర్జింగ్ ఆసియా కప్‌లో భారత్-ఎ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి మ్యాచ్‌లో యూఏఈ ఘన విజయం సాధించిన భారతజట్టు సోమవారం నేపాల్-ఎపై 9 వికెట్ల తేడాతోగెలిచి గ్రూప్-ఏలో అగ్రస్థానంలో నిలిచింది. ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ జట్టు 39.2ఓవర్లలో 167పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రోహిత్ పౌడెల్(65) అర్ధ సెంచరీ చేయడంతో ఆ జట్టు ఆమాత్రమైనా స్కోర్ చేయగల్గింది. హంగర్గేకర్ మూడు, హర్షిత్ రానాకు రెండు వికెట్లు దక్కాయి. నిషాంత్ సింధు(4/14), హంగర్గేకర్ (3/25), హర్షిత్ రాణా(2/16) బౌలింగ్‌లో రాణించారు. ఛేదనలో భారత ఓపెనర్లు సాయి సుదర్శన్(58నాటౌట్), అభిషేక్ శర్మ(87) అర్ధ సెంచరీలతో మెరిశారు. అభిషేక్ తర్వాత వచ్చిన ధ్రువ్ జురెల్(21నాటౌట్) సిక్స్ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. దీంతో భారతజట్టు 9 వికెట్ల తేడాతో నేపాల్‌పై నెగ్గింది. ఛేదనలో భారతజట్టు 22.1 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అభిషేక్ శర్మకు లభించింది. ఇదే గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు 184పరుగుల తేడాతో యుఏఇపై ఆ జట్టూ సెమీస్‌కు చేరింది. రేపు(బుధవారం) పాకిస్తాన్-ఎ - ఇండియా-ఎ జట్ల మధ్య ఆఖరి, నామమాత్రపు లీగ్ మ్యాచ్ జరగనుంది.

'వారందరికి' నా పతకం అంకితం

సంగీతా ఫోగట్




న్యూఢిల్లీ : మహిళలపై నేరాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న అందరికీ తన పతకాన్ని అంకితం చేస్తున్నట్లు ప్రముఖ రెజ్లర్ సంగీతా ఫోగాట్ తెలిపింది. శనివారం బుడాపెస్ట్‌లో జరిగిన హంగేరీ ర్యాంకింగ్ సిరీస్ టోర్నమెంట్‌లో ఆరుగురు పాల్గొన్న నాన్ - ఒలింపిక్ 59 కేజీ విభాగంలో సంగీతా ఫోగట్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. పలువురు మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా సంగీతా ఫోగట్ ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలంటూ మరో రెజ్లర్, తన భర్త భజరంగ్ పూనియాతో కలిసి ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో నెలరోజుల పాటు ఆందోళనలోనూ పాల్గొంది. "మీ అందరి అభినందనల సందేశాల నాకు చేరుతున్నాయి. ఈ సమయంలో నేను చాలా ఉద్వేగానికి లోనయ్యాను. మీ అందరికీ చాలా కృతజ్ఞతలు. ఈ పతకం నాది మాత్రమే కాదు. ఇది మీ అందరికి చెందుతుంది, మహిళలపై కొనసాగుతున్న నేరాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వారందరికీ ఈ పతకాన్ని అంకితం చేస్తున్నాను" అని ట్విటర్‌లో పేర్కొంది.

ఐర్లాండ్ టూర్‌కు కోచ్‌గా లక్ష్మణ్

ముంబయి: ఐర్లాండ్‌కు వెళ్లే భారతజట్టు కోచ్‌గా వివిఎస్ లక్ష్మణ్ వ్యవహరించనున్నాడు. వెస్టిండీస్ పర్యటన తర్వాత హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ కొన్ని రోజులు విశ్రాంతి కోరుకోవడంతో బిసిసిఐ ఆ టూర్‌కు లక్ష్మణ్‌ను ఎంపిక చేసింది. ఐర్లాండ్ టూర్‌కు ద్రావిడ్‌తో పాటు సహాయక సిబ్బంది కూడా విశ్రాంతి తీసుకోనున్నారు. వెస్టిండీస్ టూర్ ముగిసిన తర్వాత ద్రవిడ్, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోర్, బౌలింగ్ కోచ్ పరాస్ హంబ్రే అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. వీళ్లు తిరిగి ఆగస్టులో భారత్‌కు రానున్నారు. ఆగస్టు 31 నుంచి జరిగే ఆసియా కప్, ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ ఆ తర్వాత వనే ప్రపంచకప్‌తో భారతజట్టు బిజీ షెడ్యూల్‌తో గడపనుంది. దీంతో బిసిసిఐ ద్రవిడ్ బృందంపై పని ఒత్తిడి పడకుండా కొన్ని రోజులు విశ్రాంతి ఇవ్వాలని అనుకుంది.

ఇక అల్కరాజ్ శకమే..! : నాదల్



మాడ్రిడ్: ఇక అల్కరాజ్ శకం మొదలైందని స్పెయిన్ దిగ్గజ ఆటగాడు రఫెల్ నాదల్ అన్నాడు. ఆదివారం జరిగిన వింబుల్డన్ ఫైనల్లో అల్కరాజ్ తొలి సెట్ 6-1తో చిత్తుగా ఓడితే మళ్లీ పుంజుకోవడం కష్టమే అనుకున్నానని, ఆ తర్వాత సెట్‌ను టైబ్రేక్‌లో గెలుచుకున్నా.. ట్రోఫీ దక్కదేమోనని భయపడ్డానని తెలిపాడు. కానీ అతడు ఫైనల్లో గెలిచిన తీరు వర్ణణాతీతమని పేర్కొన్నాడు. రాబోయేది అల్కరాజ్ శకమేనని ట్విటర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపాడు. "కంగ్రాట్యులేషన్స్ అల్కరాజ్. ఈరోజు మాకు నువ్వు ఎనలేని సంతోషాన్ని పంచావు. స్పానిష్ టెన్నిస్‌లో మన మార్గదర్శి, దిక్సూచి, వింబుల్డన్‌లో అద్భుతాలు చేసిన మనోలో సాంటానా కూడా నీ ఆట చూసి ఉప్పొంగిపోయి ఉంటారు. నిన్ను గట్టిగా హత్తుకుని ఈ క్షణాన్ని పూర్తిగా ఆస్వాదించాలని ఉంది చాంపియన్!!! మన టీమ్‌కు ఇదొక గొప్ప క్షణం" అని నాదల్.. అల్కరాజ్‌ను ఉద్దేశించి భావోద్వేగపూరిత ట్వీట్ చేశాడు. తొంటినొప్పి కారణంగా రఫెల్ నాదల్ వింబుల్డన్ చాంపియన్‌షిప్‌కు దూరమయ్యాడు. ఇదిలా ఉంటే.. అల్కరాజ్ అద్భుత ఆటతో 24వ గ్రాండ్‌స్లామ్ గెలవాలన్న జొకోవిచ్ ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. అలాగే అత్యధిక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ ఫెదరర్(8) రికార్డును సమం చేయకుండా అడ్డుకున్నాడన్నాడు.

ఫెదరర్‌తో పోల్చిన సచిన్

భారత దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్.. అల్కరాస్‌ను 20 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన రోజర్ ఫెదరర్‌తో పోల్చాడు. ఫైనల్ పోరు చూసిన అనంతరం ట్విటర్‌లో అతడిపై ప్రశంసలు కురిపించాడు. "ఎంతో అద్భుతమైన ఫైనల్ పోరు ఇది. ఈ ఇద్దరు ఆటగాళ్లు గొప్పగా ఆడారు. టెన్నిస్‌లో తర్వాతి సూపర్‌స్టార్ ఎదుగుదలను మనం చూస్తున్నాం. ఫెదరర్ కెరీర్‌ను అనుసరించినట్లే మరో 10-12ఏళ్లు.. కార్లోస్ కెరీర్‌ను నేను ఫాలో అవుతాను. అతడికి నా అభినందనలు. 20ఏళ్ల కార్లోస్ అల్కరాస్.. 2018నుంచి వింబుల్డన్‌లో ఓటమే లేని జకోవిచ్‌కు పరాజయాన్ని రుచి చూపాడు. దీంతో భవిష్యత్‌లో అగ్రశ్రేణి ఆటగాడిగా ఎదుగుతాడు" అంటూ సచిన్ ట్వీట్ చేశాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68